సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 93

సోమవారం 18-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'




అర్ష్‌దీప్, అవేశ్ అదుర్స్

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై 8 వికెట్లతో నెగ్గిన భారత్ - 12లో



భారం దింపుకుందాం

ఇంటి రుణం ఈఎంఐ భారంగా మారితే.. ప్రత్యామ్నాయాలపై కథనం - 13లో



భద్రతా వైఫల్యం తీవ్రమైనది

లోక్‌సభలోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి పొగపెట్టిన ఘటనను తీవ్రమైన అంశంగా ప్రధాని మోదీ అభివర్ణించారు.

వివరాలు 6లో ▸



60 మందికి పైగా జలసమాధి

యూరప్ వెళ్తున్న వలసజీవుల పడవ లిబియా తీరంలో బోల్తాపడటంతో 60 మందికిపైగా జలసమాధి అయ్యారు.

వివరాలు 6లో ▸



మహారాష్ట్రలో పేలుడు

మహారాష్ట్రలోని బజార్‌గావ్‌లోని ఓ పేలుడు పదార్థాల తయారీ ఫ్యాక్టరీలో సంభవించిన విస్ఫోటనంతో 9 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



గాల్లో 30 అడుగులు..

అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో ఓ 4 నెలల బుడతడు టోర్నడోలో చిక్కుకున్నా నిక్షేపంగా బయటపడి ఔరా అనిపించాడు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

సాయం చేస్తున్నా గిట్టదా?

- కళ్లెదుట కనిపించడం లేదా వాస్తవాలు?
- సీజన్ ముగియకుండానే కరువు మండలాల ప్రకటన
- తుపాన్ పంట నష్టం అంచనాల్లో యంత్రాంగం నిమగ్నం
- సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు సన్నాహాలు

14లో

ఓట్ల.. కేటుగాళ్లు

ఉనికి కోసం టీడీపీ సానుభూతిపరులతో బాబు బోగస్ వేషాలు

తెలంగాణలో నివాసం, ఓటు.. ఏపీలోనూ ఓటర్లుగా నమోదు

- పోలింగ్ ముగిసిన మర్నాడే హైదరాబాద్‌లో టీడీపీ నేతల మేళా
- సానుభూతిపరులతో శిబిరాలు.. ఆన్‌లైన్‌లో భారీగా ఫామ్ 6 దరఖాస్తులు
- ఏపీలోనూ ఓటర్లుగా నమోదుకు లక్షల సంఖ్యలో అప్లికేషన్లు
- ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17 ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి
- ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరం
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ
- బాబు చూపిన బాటలోనే.. జనసేన
- పవన్ సోదరుడు నాగబాబు, కుటుంబీకులకు హైదరాబాద్‌లో ఓట్లు
- తామంతా వడ్డేశ్వరంలో ఉంటున్నామంటూ మళ్లీ ఓటు కోసం దరఖాస్తు
- హైదరాబాద్‌లో ఓట్లున్న 4.30 లక్షల మందికి ఏపీలోనూ ఓట్లు.. వాటిని తొలగించాలని ప్రజాసంఘాల డిమాండ్



rolls. The Telugu Desam Party has also set up separate teams area wise for enrolling Telangana voters in Andhra Pradesh. Please refer to the screenshots below, being circulated on Social Media by Telugu Professional Wing belonging to Telugu Desam Party (as mentioned in the above banner photo). They have created WhatsApp groups area wise in Hyderabad, Telangana for new voter registration in AP.

Forwarded many times

New Voter Registration and Verification Drive for AP Voters

Dear Friends,

Telugu Professional Wing is organising voter registration and verification drive in below listed locations. Please use this opportunity to verify your vote and also register new vote in AP.

Locations - Contact person

Kukatpally - Vijay -

LB Nagar - Sailesh -

తెలంగాణ ఓటర్లను ఏపీలో నమోదు చేయించేందుకు హైదరాబాద్‌లో తాము నిర్వహిస్తున్న శిబిరాల ఇన్‌చార్జ్‌ల ఫోన్ నంబర్లను సానుభూతి పరులకు వాట్సాప్‌లో పంపిన టీడీపీ

ప్రజాస్వామ్యమంటే... ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం. ప్రజలే ప్రభువులు! ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమే. ఒకే ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశిస్తుంది. ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తుంది. ఓటర్ల జాబితా ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజాతీర్పు అంత స్పష్టంగా ఉంటుంది.

5లో

అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రజల ఆశీస్సులతో కాకుండా.. అడ్డదారుల్లో అధికారం కోసం అర్రులు చాచే వ్యక్తిని ఏమంటారు? కేటుగాడనే కదా! ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి దొంగదారిలో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాటి నుంచి ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ 'డూప్లికేటు' వేషాలు వేస్తున్నారు!

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



జనం.. జైత్రయాత్ర

కర్నూలు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

అశేషంగా హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు

యువత బైక్ ర్యాలీలు.. జై జగన్ నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణాలు

సీఎం జగన్ పాలనలో సాధించిన సామాజిక సాధికారతను చాటిచెప్పిన జనం

రాష్ట్రంలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. కర్నూలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలకు ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. సీఎం జగన్ పాలనలో తాము సాధించిన సాధికారతను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు చాటిచెప్పారు. ఈ సందర్భంగా మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ.. 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు అవహేళన చేసి కించపరిస్తే.. జగన్ వారందరినీ చేయిపట్టి అభివృద్ధి పథం వైపు నడిపించారు. ఎన్నడూలేనన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. బడుగు, బలహీనవర్గాలకు లబ్ధి చేకూర్చి వారి అభివృద్ధికి బాటలు వేశారు. పదవుల్లోనూ అధిక ప్రాధాన్యమిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్' అని వివరించారు.

2లో

న్యూస్‌రీల్

అధికారిక లాంఛనాలతో ఎమ్మెల్సీ సాబ్జి అంత్యక్రియలు



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అంత్యక్రియలు ఆదివారం ఏలూరులో అధికారిక లాంఛనాలతో జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తుది వీడ్కోలు పలికారు.

వివరాలు 3లో ▸

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో సీఆర్పీఎఫ్ 165వ బెటాలియన్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి వీరమరణం పొందగా.. రాము అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి సొంతూరు ఏపీలోని కర్నూలు.

వివరాలు 6లో ▸

తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం



ఇంధన సామర్థ్య రంగంలో ఎన్నో ఏళ్ల అనుభవమున్న అస్సూరి చంద్రశేఖరరెడ్డిని దక్షిణాది రాష్ట్రాలకు బీఈఈ మీడియా సలహాదారుగా నియమిస్తూ ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలు 2లో ▸

ఏపీ విధానాలు నచ్చాయి

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ప్రజలకు లబ్ధి

కేంద్ర హోం శాఖ పరిధిలోని అంతర్ రాష్ట్ర మండలి ప్రశంసలు

- వివిధ రాష్ట్రాల్లో గుడ్ ప్రాక్టీసెస్‌పై విడుదల చేసిన నివేదికలో వెల్లడి
- వన్‌స్టాప్ సొల్యూషన్‌గా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన సేవలతో ప్రజలకు మేలు
- సమగ్ర భూ సర్వే ద్వారా యజమానులకు కచ్చితమైన హక్కు పత్రాలు
- ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు
- అన్నదాతలను అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపిస్తున్న ఆర్బీకేలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పాలనా విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అంతర్ రాష్ట్ర మండలి ప్రశంసించింది. గ్రామ, వార్డు సచివాలయాలతో క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన వికేంద్రీకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారని కితాబిచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారని, రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)తో సాగుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్‌ను గ్రామాల్లోనే అందుబాటులోకి తెచ్చారని కొనియాడింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా సమగ్ర భూ సర్వేతో భూ యజమానులకు కచ్చితమైన భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారని..

మిగతా 5వ పేజీలో ▶





నా మూడో ఇన్నింగ్స్ పక్కా

- దేశాన్ని 10 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
- ప్రపంచంలో బలమైన బ్రాండ్‌గా మేడిన్ ఇండియా..
- సూరత్ డైమండ్ బోర్స్ ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

6లో

"'నేడు ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయి. పదేళ్ల క్రితం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం ఇప్పుడు ఐదో స్థానానికి చేరింది. ప్రధానిగా నా మూడో ఇన్నింగ్స్‌లో భారత్.. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయం' అని ప్రధాని మోదీ అన్నారు.



ఇక రూ.25లక్షల వరకు

'ఆరోగ్యశ్రీ'

- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులకూ శ్రీకారం
- నేటి నుంచి ఇంటింటికి పంపిణీ
- ప్రతీ ఇంట్లో ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ అయ్యేలా చర్యలు
- రాష్ట్రంలో మొత్తం 4.25 కోట్ల లబ్ధిదారులకు ఈ సేవలపై విస్తృత అవగాహన
- జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 జనవరి 1 నుంచి..

14లో



సరుకు రవాణా సేవల్లో

ఏపీ భేష్

- తీరప్రాంత రాష్ట్రాల అచీవర్స్ జాబితాలో ఏపీ ఫస్ట్
- లాజిస్టిక్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించిన కేంద్ర వాణిజ్య శాఖ 'లీడ్స్' నివేదిక
- రోడ్లు, రైల్వే, పోర్టు కనెక్టివిటీకి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం
- లాజిస్టిక్ రంగానికి పారిశ్రామిక హోదాతో పాటు ప్రత్యేక పాలసీ

14లో

ఇదండీ సంగతి



..ఇచ్చిన హామీలు కచ్చితంగా నెరవేర్చుతాం!

పోలిపల్లిలో కబ్జా గళం

టీడీపీ నాయకులు భూములు కొట్టేసిన గ్రామంలో లోకేశ్ యువగళం ముగింపు సభ

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నకిలీ పత్రాలతో ఖరీదైన భూములకు ఎసరు

ఫోర్జరీ పాసు పుస్తకాలతో స్వాహా చేసి విక్రయాలు

ఆర్డీవో నాడు చర్యలకు ఆదేశించినా అడ్డుపడ్డ ఎల్లో గ్యాంగ్

అక్రమాలకు నాటి ఓ జిల్లా పోలీసు అధికారి అండదండలు!



విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కోట్ల రూపాయల విలువైన వివాదాస్పద భూమి ఇదే

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రూ.వందల కోట్ల విలువైన భూములు అవి. టీడీపీ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ముగింపు సభ నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఉన్న ఈ ఖరీదైన భూములను ఆ పార్టీ నేతలు నకిలీ పత్రాలతో కొట్టేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలిపల్లి కేంద్రంగా సాగించిన భూ దందాలు ఇప్పుడు టీడీపీ నేత నారా లోకేశ్ సభతో మరోసారి వెలుగులోకి వస్తున్నాయి.

నకిలీ పత్రాలతో విక్రయించి.. పరిహారం కాజేసి

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి రెవెన్యూ గ్రామం, సర్వే నంబరు 27లో 45 ఎకరాలున్న ఆసామి తిరుమారెడ్డి ఆదినారాయణ 1973లోనే మృతి చెందారు. భీమునిపట్నం మండలం అమనాం ఆయన స్వగ్రామం. ఆ భూములను కాజేసేందుకు తిరుమలరెడ్డి ఆదినారాయణ, అతడి కుమారుడు రమేష్ అనే వ్యక్తులను టీడీపీ నేతలకు బినామీగా వ్యవహరించే పులవర్తి సుబ్రహ్మణ్యం నకిలీ ధ్రువపత్రాలతో రంగంలోకి దించాడు. నకిలీ పత్రాలతో 5.01 ఎకరాలను శ్రీరామినేని శ్రీధర్‌కు, మిగతా ఐదు ఎకరాలను కోనేరు కరుణాకరరావుకు 2000లో విక్రయించారు. అనంతరం దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన ఆర్డీవో నాగేశ్వరరావు ఆ పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్స్ బోగస్ అని తేల్చారు. తహసీల్దారు, ఆర్డీవో సంతకాలను ఫోర్జరీ చేశారని నిర్ధారిస్తూ, దీనిపై చర్యలు తీసుకోవాలని 2005లోనే ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేసినా టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. మరోవైపు జాతీయ రహదారి విస్తరణ సమయంలో

మిగతా 3వ పేజీలో ▶



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

జీవన సంధ్యలో హాయిగా...



నా వయస్సు 68 ఏళ్లు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా భార్య భానుమతి దివ్యాంగురాలు. నాకు బాల్యం నుంచీ కష్టాలే. హోటల్‌లో కూలీ పని చేశాను. చాలా కాలంగా పూలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ప్రతి రోజూ కడియం వెళ్లి, పూలు కొనుక్కుని వచ్చి, అమ్ముతుంటాను. అయినా తగినంత ఆదాయం రావడం లేదు. ఒక్కోసారి నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. నా భార్యకు వికలాంగ పింఛను వస్తుండడంతో నాకు రాదని అనుకునే వాడిని. వయస్సు రీత్యా ఆరోగ్యం సహకరించక పూల కోసం వెళ్లలేకపోతే ఇంట్లో గడవడం కష్టంగా ఉండేది. ఈ సమయంలో మా వలంటీరు షేక్ అనీషా వలి మా వద్దకు వచ్చి 'తాత గారూ.. మీ భార్యది దివ్యాంగుల పెన్షన్ కాబట్టి, వయస్సు ప్రకారం మీకూ పెన్షన్ వస్తుంది' అని చెప్పి నాతో దరఖాస్తు చేయించింది. ఇప్పుడు మా ఇద్దరికీ ప్రభుత్వ పింఛను వస్తోంది. వృద్ధాప్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు కొండంత అండగా నిలిచింది. మా బతుకు సాఫీగా సాగిపోతోంది.

– నల్లమిల్లి నరసింహమూర్తి, రామచంద్రపురం
(నరాల రాధాకృష్ణ, విలేకరి, రామచంద్రపురం రూరల్)


పిల్లల చదువు బెంగ తీరింది



మేము తిరుపతి సీఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్నాము. నా భర్త ఆటో నడుపుతున్నాడు. నేను గృహిణిని. మాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి 9వ తరగతి, అబ్బాయి ఏడో తరగతి చదువుతున్నారు. ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబం గడవడానికే సరిపోతోంది. పిల్లల చదువుల విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. ప్రస్తుత పరిస్థితిలో పిల్లలకు మంచి చదువులు ఎలా చదివించాలా అని నిత్యం సతమతం అయ్యేవాళ్లం. ఈ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం అమలు చేస్తుండటం వల్ల మాలాంటి పేద కుటుంబాలను ఆదుకుంటోంది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల చొప్పున నా ఖాతాలోకి నగదు జమ చేశారు. పిల్లల చదువుల కోసం ఇంత పెద్ద మొత్తం అధికారులతో కానీ, రాజకీయ నేతలు, మధ్యవర్తులతో సంబంధం లేకుండా తల్లుల ఖాతాలోకి జమ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. మధ్యాహ్నం స్కూల్లో మంచి భోజనం పెడుతున్నారు. మాకు ఆటో ఉండటంతో ఏటా వాహనమిత్ర ద్వారా కూడా రూ.10 వేలు అందుతోంది. ఇప్పుడు మాకు బతుకుపై ఎలాంటి భయం లేదు.

– కె.లక్ష్మి, సీఎస్ఆర్ కాలనీ, తిరుపతి
(పి.చంద్రబాబు, విలేకరి, తిరుపతి సిటీ)

కరువు నేలపై జలధారలు



చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని చిలకావారిపల్లిలో నాకు 23 ఎకరాల పొలం ఉంది. నీటి పారుదల సౌకర్యం లేక 13 ఎకరాల్లో వర్షాధారంపై ఆధారపడి.. బోరు బావిని నమ్ముకొని మామిడి చెట్లు నాటాను. వాటిని బతికించుకొనేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చేది. అయినా ఎంతో ఓర్పుతో మామిడి తోట కాపాడుకున్నాను. మిగిలిన 10 ఎకరాల భూమి బీడుగా పెట్టాల్సి వచ్చింది. నాలాగే మా ప్రాంత రైతాంగం నీటి పారుదల సౌకర్యం లేని కారణంగా వర్షాధార పంటలు వేసేవారు. కొందరు పొలాలు బీడు పెట్టేవారు. ఇలాంటి దారుణమైన పరిస్థితులు ఉన్న సమయంలో జలయజ్ఞం పుణ్యమా అని సుమారు రూ.350 కోట్లతో నేతిగుట్లపల్లెలో ఒక టీఎంసీ కెపాసిటీతో రిజర్వాయర్ నిర్మించారు. హంద్రీ–నీవా నీటితో నింపారు. ఫలితంగా ఐదారు గ్రామాల పరిధిలోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఒక పంట కాదు.. మూడు పంటలు వేసుకునేలా వైఎస్ జగన్ సర్కారు భరోసా ఇచ్చింది. ప్రాజెక్టుల్లో నీళ్ల నిలువ ఉండటం వల్ల భూగర్భ జలాలు బాగా పెరిగాయి. నేను బీడు పెట్టిన 10 ఎకరాల పొలంలో ఇప్పుడు కొబ్బరి, జామ, సీతాఫలం చెట్లు నాటాను. మామిడి తోటకు అంతర్ పంటలుగా టమాటా, ఇతర కూరగాయల పెంపకం చేపట్టాను. సోమల మండలం ఆవులపల్లె వద్ద మరో ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. అయితే ఈ రెండు రిజర్వాయర్ల పనులపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుర్బుద్ధితో.. టీడీపీ నేతలతో కోర్టులో కేసులు వేయించడంతో ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించ లేదు. అయినా భూగర్భ జలాలు బాగా పెరిగినందున ఈ రిజర్వాయర్ కింద భూములు ఉన్న రైతాంగానికి ఎంతో మేలు జరుగుతోంది.

– రామకృష్ణారెడ్డి, రైతు, చిలకావారిపల్లి
(పి.ఎన్.ఎస్.ప్రకాష్, విలేకరి, పుంగనూరు)

నందిగామలో సామాజిక చైతన్యం

- అసంఖ్యాకంగా వచ్చిన ప్రజలతో సామాజిక సాధికార బస్సు యాత్ర
- నియోజకవర్గం నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజలు
- పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్న యువత.. జై జగన్ నినాదాలతో మార్మోగిన పట్టణం





నందిగామలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం.. అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు

నందిగామ (పెనుగంచిప్రోలు): ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. ఆదివారం సాయంత్రం నందిగామలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు అసంఖ్యాకంగా హాజరయ్యారు. యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి యాత్రకు తరలివచ్చిన వారితో పట్టణంలోని వీధులన్నీ కిటకిటలాడాయి. జై జగన్.. జగనే కావాలి అంటూ వారు చేసిన నినాదాలతో పట్టణం మార్మోగింది. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు జనం వెల్లువలా తరలి వచ్చారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేయగా జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక అన్ని విధాలా బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసి రాజ్యాధికారం కల్పించారని వక్తలు చెప్పటంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అధికారం ఇవ్వాలని మంత్రులు, నేతలు పిలుపునివ్వటంతో ప్రజలు జై జగన్.. అంటూ పెద్ద ఎత్తున మద్దతు పలికారు.

జగనన్న పాలనలో సామాజిక విప్లవం : మంత్రి మేరుగు నాగార్జున

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో సామాజిక విప్లవం వచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. స్వాతంత్య్రం వచ్చాక ఎందరో మహనీయులు సామాజిక విప్లవం రావాలని కోరుకున్నారని, వారి ఆశయాలను సాధ్యం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవహేళన చేస్తూ చంద్రబాబు అన్నమాటలను ఎవరూ మరచి పోరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అగ్రతాంబూలం ఇచ్చిన లీడర్ ఒక్క జగనే అని అన్నారు. చంద్రబాబు ఒక గజదొంగ అని, చట్టాలను అనుకూలంగా మార్చుకుని బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాశారని చెప్పారు.

సామాజిక సాధికారత విధానంగా...: డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సామాజిక సాధికారత ఒక నినాదంగా కాకుండా విధానంగా అమలు జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని విధాలుగా మోసం చేశారని చెప్పారు. వైఎస్ జగన్ వచ్చిన తర్వాతే ఈ వర్గాలు తలెత్తుకొని తిరుగుతున్నాయన్నారు. కేబినెట్‌లో 25 మంది మంత్రులు ఉంటే 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో మొదటి కేబినెట్‌లోనే తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారన్నారు. శాసనసభలో, శాసన మండలిలో నలుగురు మైనార్టీలకు అవకాశం ఇచ్చారన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో కేవలం రూ.2,650 కోట్లు కేటాయిస్తే, సీఎం జగన్ ఈ నాలుగున్నరేళ్లలోనే రూ.23,175 కోట్లు ఖర్చు చేశారన్నారు. జగనన్నను గుండెల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగమే స్ఫూర్తి..: జోగి

అంబేడ్కర్ రాజ్యాంగమే స్ఫూర్తిగా, పూలే ఆలోచనలను జోడించి సీఎం సామాజిక న్యాయం అమలు చేస్తున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర దేశంలో సామాజిక న్యాయం ఒక్క జగన్ వల్లనే సాధ్యమైందన్నారు. చంద్రబాబు వర్ల రామయ్యకు రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పి ఆనక కనకమేడల రవీంద్రకు కేటాయించటం బడుగు, బలహీన వర్గాల పట్ల ఆయనకు ఉన్న వైఖరి అర్థమవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో అందరూ జగన్‌కు మద్దతు పలకాలన్నారు. నందిగామ, జగ్గయ్యపేట, పామర్రు, పెనమలూరు ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్‌రావు, సామినేని ఉదయభాను, కైలే అనిల్‌కుమార్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు.

దేవరపల్లిలో జన జాతర

- సామాజిక సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన ప్రజానీకం
- అశేషంగా హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు
- బహిరంగ సభ ఆసాంతం జై జగన్.. వన్స్‌మోర్ జగన్ అంటూ నినాదాలు



తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి సభలో ప్రసంగిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, చేసిన మేలును వివరించేందుకు తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల నుంచి అశేష సంఖ్యలో తరలి వచ్చిన జన ప్రవాహంతో దేవరపల్లి పరిసర ప్రాంతాలు, సభా ప్రాంగణం పోటెత్తాయి. తొలుత కృష్ణంపాలెం హైవే నుంచి సుమారు 3 వేల ద్విచక్ర వాహనాలతో 6 కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆరు వేల మందికి పైగా యువత, సీఎం వైఎస్ జగన్ అభిమానులు పాల్గొన్నారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రసంగించారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకూ ప్రజలు నేతల ప్రసంగాలు శ్రద్ధగా విన్నారు. సీఎం జగన్ తమకు చేసిన మంచిని గుర్తుకు చేసుకుని 'జై జగన్.. 2024 జగన్ వన్స్‌మోర్' అంటూ నినదించారు.

సంఘ సంస్కర్త సీఎం జగన్: మంత్రి చెల్లుబోయిన

సీఎం జగన్ ఓ సంఘ సంస్కర్త అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి రూ.2.60 లక్షల కోట్లు జమ చేశారని, ఇందులో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే చేరాయని తెలిపారు. పేదలకు అంతర్జాతీయస్థాయి విద్య, వైద్య సౌకర్యాలను చేరువ చేస్తున్నారన్నారు. సీఎం జగన్ చేపట్టిన కార్యక్రమాలతో రాష్ట్రంలోని ప్రతి ఎస్సీ, ప్రతి ఎస్టీ, ప్రతి బీసీ, ప్రతి మైనారిటీ తలెత్తుకొని తిరుగుతున్నారని వివరించారు.

వృద్ధి రేటు పెంచిన సీఎం జగన్: మంత్రి కారుమూరి

సీఎం జగన్ తీసుకొచ్చిన పథకాలతో అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధిస్తున్నారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పేదల ఆర్థిక స్థితిగతులు మార్చారని అన్నారు. దీంతో రాష్ట్ర వృద్ధి రేటు 11.5 శాతానికి పెరిగిందని తెలిపారు. సీఎం జగన్ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం కొని రైతులకు 72 గంటల్లోనే నగదు చెల్లించామన్నారు.

సామాజిక సాధికారత సాధ్యం చేశారు : మంత్రి తానేటి వనిత

దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న సామాజిక సాధికారతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాధ్యం చేసి చూపించారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమంలో, పదవుల్లో పెద్ద వాటా ఇచ్చి, వారిని అభివృద్ధి పథంలోకి తెచ్చారని తెలిపారు. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ ట్యాబ్‌లు ఇస్తున్నారని, వారికి ఉపయోగపడే కంటెంట్ మాత్రమే వాటి ద్వారా అందిస్తున్నారని చెప్పారు. దీనిని కూడా కొందరు తప్పుపడుతున్నారని, పెత్తందార్ల పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవవచ్చు కానీ, పేద పిల్లలు చదివితే భరించలేరా అని ప్రశ్నించారు.

సీఎం జగన్ పేదలకు భూములిచ్చారు: ఎంపీ సురేష్

వైఎస్ జగన్ అధికారం చేపట్టాక అసైన్డ్, అన్యాక్రాంతమైన భూములను పేదలకు అందించారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. మహిళా సాధికారతకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న నేత జగనేనన్నారు.

రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి: ఎంపీ మార్గాని భరత్‌రామ్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ వచ్చిన తర్వాత రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. రూ.10 వేల కోట్లు వెచ్చిస్తే మూడు రాజధానులు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి: ఎమ్మెల్యే తలారి

ఈ నాలుగున్నరేళ్లలో గోపాలపురం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ రూ.3 వేల కోట్లు వెచ్చించారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. ఇందులో రూ.1,200 కోట్లు కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం

- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి
- ప్రధాని మోదీ ప్రారంభించిన 'లైఫ్ మిషన్'కు నోడల్ అధికారిగానూ నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే



సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం లభించింది. ఇంధన సామర్థ్య రంగంలో ఎన్నో ఏళ్ల అనుభవమున్న అస్సరి చంద్రశేఖరరెడ్డికి కేంద్ర విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) సంస్థ కీలక బాధ్యతలు అప్పగించింది. దక్షిణాది రాష్ట్రాలకు బీఈఈ మీడియా సలహాదారుగా నియమిస్తూ ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ఉత్తర్వులు జారీచేశారు. పాత్రికేయుడిగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన చంద్రశేఖరరెడ్డిది కర్నూలు జిల్లా పెద్దపుదిళ్ల స్వగ్రామం. ఈయన రాష్ట్ర ప్రభుత్వంలో సమాచార, పౌర సంబంధాలు, ఇంధన సంరక్షణ విభాగాల్లో పనిచేశారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈఓగా ఇంధన సంరక్షణలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) దక్షిణ భారతదేశం, కేంద్రపాలిత ప్రాంతాల్లో వ్యాపార అభివృద్ధి, ప్రభుత్వ వ్యవహారాల సీనియర్ సలహాదారుగా నియమించింది. ఇక చంద్రశేఖర్‌రెడ్డి చిత్తశుద్ధి, అంకిత భావాన్ని గుర్తించిన మరో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ.. తాజాగా దక్షిణాదిన ఆ సంస్థకు మీడియా సలహాదారుగా తీసుకుంది. దేశవ్యాప్తంగా అనేకమంది ఇంధన రంగ నిపుణుల దరఖాస్తులను పరిశీలించి, ఇంటర్వ్యూలు చేసి చివరిగా చంద్రశేఖరరెడ్డిని బీఈఈ ఎంపిక చేసింది. బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా సమక్షంలో డీజీ అభయ్ భాక్రే ఢిల్లీలో చంద్రశేఖరరెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అలాగే ప్రధాని మోదీ ప్రారంభించిన 'లైఫ్' మిషన్‌కు నోడల్ అధికారిగా కూడా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇంధన సామర్థ్యం, సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అలాగే ఇంధన సంరక్షణ, పొదుపుకు సంబంధించి బీఈఈ చేపడుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించాలని డీజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంధన సంరక్షణ, పొదుపులో చంద్రశేఖర్‌రెడ్డి పలు జాతీయఅవార్డులు అందుకున్నారు.

ఏపీలో వైమానిక శిక్షణ

సాక్షి, అమరావతి: వైమానిక చోదక (పైలట్) శిక్షణ కోసం ఇక నుంచి వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో తొలి పైలట్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద తొలి పైలట్ శిక్షణ కేంద్రం ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీవో) ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టులో ఎఫ్‌టీవోను ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ వీఎన్ భరత్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇంతకాలం పైలట్ శిక్షణ కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుండటంతో సీఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

కర్నూలులో ప్రతిధ్వనించిన సాధికార నినాదం

- వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రకు భారీగా తరలివచ్చిన జనం
- వేలాది ప్రజలు, యువత బైక్ ర్యాలీతో సాధికార వైభవం



కర్నూలు బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కర్నూలు (రాజ్‌విహార్): రాష్ట్ర తొలి రాజధాని కర్నూలు సామాజిక సాధికార నినాదంతో పులకించింది. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వేలాది ప్రజలు వెంట నడుస్తుండగా, యువత బైక్ ర్యాలీతో పాతబస్తీలో సాధికార వైభవాన్ని చాటింది. కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు ర్యాలీగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సభా స్థలికి చేరుకున్నారు. దారి పొడవునా కేరింతలు, జై జగన్ నినాదాల హోరుతో యాత్ర సాగింది. 'మళ్లీ జగనే కావాలి' అంటూ అశేష జనవాహిని చేస్తున్న నినాదాల మధ్య సభ విజయవంతంగా జరిగింది. సీఎం వైఎస్ జగన్ అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు చేసిన మేలును నేతలు చెబుతుంటే ప్రజలు నిజమే అంటూ సమాధానం ఇచ్చారు.

సామాజిక న్యాయం నెలకొల్పిన ఏకైక సీఎం జగన్ : మంత్రి ఆదిమూలపు

నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలతో అణగారిన వర్గాల బతుకుల్లో ఎంతో మార్పు వచ్చిందని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. మన బిడ్డలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐక్య రాజ్య సమితిలో ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారన్నారు. పెత్తందారులకే పరిమితమైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతోందన్నారు. మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇలా ఎన్నో పదవులను అణగారిన వర్గాలు పొందుతున్నారని తెలిపారు. ఇలా అన్ని రంగాల్లో సామాజిక న్యాయం నెలకొల్పిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీల నేతలు తోడేళ్లు, దొంగల ముఠాల్లా వస్తున్నారని, వారి వలలో పడవద్దని ప్రజలను కోరారు.

బడుగుల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం: కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు

రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి ఒక్క సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సీఎం జగన్ ఈ నాలుగున్నరేళ్లలో రూ. 2.50 లక్షల కోట్లు ప్రజల కోసం ఖర్చు చేశారని, ఇందులో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికే వెచ్చించారని తెలిపారు. ఇది 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. ఆ డబ్బు ఎక్కడికి మళ్లించారో చంద్రబాబు సమాధానం ఇవ్వాలన్నారు. ముగ్గురు భార్యలకు గ్యారంటీ ఇవ్వని పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి అండగా నిలుస్తారా అని వ్యాఖ్యానించారు. ఒక్క ఓటు వేస్తేనే రెండున్నర లక్షలు ఖర్చుచేసిన సీఎం జగన్ మరోసారి ఓటు వేస్తే ఎంత మేలు చేస్తారో ఆలోచించాలని ప్రజలను కోరారు.

దేశంలో ఇంత మేలు ఎన్నడూ జరగలేదు : మాజీ మంత్రి అనిల్‌కుమార్

దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అట్టడుగు వర్గాలకు సీఎం జగన్ చేసినంత మేలు ఎన్నడూ జరగలేదని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. ప్రతి ఎస్సీ, ప్రతి ఎస్టీ, ప్రతి బీసీ, ప్రతి మైనార్టీకి సీఎం జగన్ సంక్షేమాన్ని అందించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అనేక హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు ఎప్పటికీ మేలు చేయరని చెప్పారు.

సామాజిక కుట్రకు టీడీపీ శ్రీకారం: ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ అండగా ఉన్నారని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులిచ్చి సమాజంలో గుర్తింపు తెచ్చారన్నారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పోస్టుల వరకు అన్నింటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేశారని తెలిపారు. బలహీనులు ఎదగకూడదన్న దురుద్దేశంతో టీడీపీ సామాజిక కుట్రకు తెర లేపిందని, అందరూ దానిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కర్నూలుకు రూ.2 వేల కోట్లు ఇచ్చిన సీఎం జగన్: ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

సీఎం జగన్‌కు కర్నూలుపై ప్రత్యేక అభిమానం ఉందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చెప్పారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి ఈ నాలుగున్నరేళ్లలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్ మరోసారి అధికారంలోకి రావాలని, అందుకు అందరం ఆయనకు మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ధర్మవరంలో టీడీపీకి ఎదురుదెబ్బ

వైఎస్సార్‌సీపీలో చేరిన వంద కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ధర్మవరంలోని కొత్తపేటకు చెందిన వంద కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ముఖ్య నాయకుడు కొత్తపేట హిదయతుల్లా (హిద్దూ)తో పాటు 32, 36, 38, 39 వార్డులకు చెందిన తౌఫిక్, సుబహాన్, రఫీక్ అహ్మద్, మున్వర్, మన్సూర్, ముక్తియార్, దామోదర్‌రెడ్డి, వసంతం నాగేశం, రంగం ఆంజనేయులు, పెద్దకోట్ల శివశంకర్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

మైనారిటీల హక్కుల పరిరక్షణకు కృషి

ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా



కృష్ణలంక (విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని మైనారిటీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ, బాధ్యతలపై ఆదివారం ఆలిండియా మిల్లి కౌన్సిల్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజాద్‌బాషా మాట్లాడుతూ మైనారిటీల హక్కులను ప్రజలకు తెలపాలని, వాటిని పరిరక్షించుకునేందుకు ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలనే ఆలోచనలో భాగంగా ఆలిండియా మిల్లి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అన్ని మైనారిటీ వర్గాలను కలుపుకొని రాబోయే రోజుల్లో హక్కుల పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. అనంతరం అరసవల్లి కృష్ణ రచించిన 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా మిల్లీ కౌన్సిల్ జాతీయ ఉప కార్యదర్శి షా ఖాద్రి ముస్తఫా రిఫాయి జిలాని, రాష్ట్ర కార్యదర్శి మునీర్ అహ్మద్, అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన బీజేపీ

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్



కర్నూలు(అర్బన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను దగా చేసిందని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ ఆరోపించారు. కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో లక్షమందికి పైగా రైతులు, మూడు లక్షలమంది కార్మికులు, కౌలు రైతులు, 50వేలమంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్ల మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో పడి నలిగిపోతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనసేనతో కలిసి పోటీ చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పాలకొల్లు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేనతో కలిసి బీజేపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీతో కూడా బీజేపీ పొత్తు పెట్టుకుంటుందా...' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... దానిపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పురందేశ్వరి చెప్పారు. రాష్ట్రంలో అమలయ్యే పథకాల్లో కేంద్ర భాగస్వామ్యం కూడా ఉందన్నారు. ఏపీకి రాజధాని అమరావతి అని రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కుల, మత, వర్గ వైషమ్యాలతో పాలన చేస్తోందని ఆమె ఆరోపించారు.

నిర్వాసితుల పునరావాసంపై మీ వైఖరి ఏమిటి?

పురందేశ్వరికి సీపీఎం ప్రశ్న

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో పర్యటించిన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారని, అయితే ఆమె పోలవరం పునరావాసంపై మాట దాటవేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాసంపై బీజేపీ వైఖరి ఏమిటనేది పురందేశ్వరి చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం జరిగిన సీపీఎం సమావేశంలో రవి మాట్లాడుతూ బీజేపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు, ప్రతి విమర్శలు చేయడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని స్పష్టంచేశారు.

రూ.242 కోట్లతో కొత్తగా 16 వంతెనలు



ఎన్‌డీఆర్ఎఫ్, నాబార్డు నిధులతో నిర్మాణానికి నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త వంతెనల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. మొత్తం రూ.242.73 కోట్లతో 16 కొత్త వంతెనల నిర్మాణ ప్రణాళికను ఆమోదించింది. ఇప్పటికే మొదలైన వంతెనల పనులను పూర్తి చేయడంతోపాటు ఇంకా పనులు మొదలు పెట్టాల్సిన వంతెనల నిర్మాణానికి నిధుల సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించింది. కోస్తా జిల్లాల పరిధిలోని ఏడు వంతెనలను ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.137.03 కోట్లతోనూ, రాయలసీమ పరిధిలోని 9 వంతెనలను నాబార్డ్ నిధులు రూ.105.70 కోట్లతోనూ నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ శాఖ ప్రతిపాదనలకు ఆర్థికశాఖ ఆమోదించడంతో వంతెనల నిర్మాణం వేగవంతం కానుంది.

ఎన్‌డీఆర్ఎఫ్ నిధులతో నిర్మించే 7 వంతెనలు

జిల్లా	వంతెన	నిధులు
శ్రీకాకుళం	అలికాం - బత్తిలి	రూ.3.36కోట్లు
శ్రీకాకుళం	వనతిమండలం-శాలిహుండం	రూ.72.00కోట్లు
విజయనగరం	చిలకపాలెం-రామభద్రపురం(92/2)	రూ.12.00కోట్లు
విజయనగరం	చిలకపాలెం- రామభద్రపురం(74/0-2)	రూ.10.90కోట్లు
గుంటూరు	దొడ్లేరు - హెచ్‌జీ రోడ్	రూ.3.20 కోట్లు
గుంటూరు	హైదరాబాద్- గుంటూరు రోడ్డు	రూ.15.00
ప్రకాశం	ఒంగోలు - కొత్తపట్నం	రూ.20.57 కోట్లు
మొత్తం		రూ.137.03కోట్లు

నాబార్డ్ నిధులతో నిర్మించే 9 వంతెనలు

జిల్లా	వంతెన	నిధులు
కర్నూలు	నన్నూరు-నాగలాపురం-గూడూరు	రూ.3.00 కోట్లు
కర్నూలు	కొడుమూరు - ఎమ్మిగనూరు	రూ.2.30 కోట్లు
కర్నూలు	ఆదోని - గద్వాల్(నాగలదిన్నె వద్ద)	రూ.42.00 కోట్లు
అనంతపురం	అనంతపురం - తోగరకుంట	రూ.3.75 కోట్లు
అనంతపురం	బుక్కరాయసముద్రం - ముచుకుంటపల్లి	రూ.2.50 కోట్లు
వైఎస్సార్	ఏఈ రోడ్ - వేదునూరు రోడ్	రూ.2.56 కోట్లు
వైఎస్సార్	చిన్నమంచుపల్లి - పుష్పగిరి రోడ్	రూ.8.29 కోట్లు
వైఎస్సార్	ఇండస్ట్రియల్ ఎస్టేట్ - పుట్లంపల్లి రోడ్	రూ.3.30 కోట్లు
వైఎస్సార్	కుప్పం - కల్లూరుపల్లి	రూ.38.00 కోట్లు
మొత్తం		రూ.105.70 కోట్లు

అధికారిక లాంఛనాలతో ఎమ్మెల్సీ సాబ్జి అంత్యక్రియలు


ఎమ్మెల్యేలు, కలెక్టర్ నివాళి.. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయుల హాజరు



సాబ్జి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అంత్యక్రియలు ఆదివారం ఏలూరులో జరిగాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. లాల్ సలామ్, జోహార్ సాబ్జి అని నినదిస్తూ తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మొదట యూటీఎఫ్ నాయకులు ఉదయం ఆశ్రం ఆసుపత్రి మార్చురీలో ఉన్న సాబ్జి మృతదేహాన్ని ఏలూరు ఇండోర్ స్టేడియానికి తరలించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సాబ్జి మృతదేహాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ బేగం, ఎమ్మెల్సీలు రఘువర్మ, లక్ష్మణరావు, కల్పలత, ఐ.వెంకటేశ్వరరావు తదితరులు సాబ్జి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాబ్జి మృతదేహాన్ని ఆయన ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఊరేగింపుగా మదీనా మజీద్‌కు తీసుకెళ్లి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పోలిపల్లిలో కబ్జా గళం



reported that the Pattadar Pass Book bearing No.288253 and Title Deed bearing No.273676 issued in favour of Sri Tirumareddi Adinarayana S/o late Ramulu in S.No.27/4 measuring an extent of Ac.10.01 of Polipalli Village of Bhogapuram mandal are not issued from the Mandal Revenue Officer's Office, Bhogapuram and also not genuine. The signature ~~put but on the~~ of the MRO and O/o ... also ... are also not genuine.

Yours faithfully,

Revenue Divisional Officer,
Vizianagaram

Copy to the Mandal Revenue Officer, Bhogapuram for taking necessary action.

ఫోర్జరీని నిర్ధారిస్తూ 2005లో ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వుల కాపీ

▶ మొదటి పేజీ తరువాయి

తిరుమారెడ్డి ఆదినారాయణకు చెందిన సుమారు 1.74 ఎకరాల భూమి పోయింది. దీనికి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చెల్లించిన పరిహారాన్ని ఆయన వారసులకు తెలియకుండా టీడీపీ భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ కాజేసిన వైనాన్ని 'సాక్షి' ఇప్పటికే బట్టబయలు చేసింది.

బినామీ బాగోతం ఇలా...

విలువైన భూములను కాజేసేందుకు పులవర్తి సుబ్రహ్మణ్యం అనే బినామీని తెరపైకి తెచ్చిన టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి ఆదినారాయణ అనే పేరుతో బోగస్ గుర్తింపు కార్డులను సృష్టించారు. అయితే ఇంటి పేరు తిరుమారెడ్డి బదులు తిరుమలరెడ్డి అని రాయడంతో పప్పులో కాలేశారు! పులవర్తి సుబ్రహ్మణ్యం సాక్షి సంతకంతో భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1.2.2000వ తేదీన రిజిస్ట్రేషన్ చేశారు. పట్టాదారు పాసు పుస్తకం లేకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ దస్తావేజులను పెండింగ్‌లో పెట్టారు. దీంతో నకిలీ పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌లను టీడీపీ నాయకులు సృష్టించారు. వాటిని సమర్పించడంతో 31.3.2000న సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్లను రిలీజ్ చేశారు.

చుట్టూ తిరిగి 'పులవర్తి'కే..

పట్టాదారు పుస్తకం, టైటిల్ డీడ్స్‌పై అనుమానం కలగడంతో కొనుగోలుదారులైన శ్రీరామినేని శ్రీధర్, కోనేరు కరుణాకరరావు ఆర్డీవోను ఆశ్రయించారు. దీన్ని పసిగట్టిన టీడీపీ నేతలు నాడు అధికారం అండతో విచారణను అడ్డుకుని కొనుగోలుదారులతో బేరసారాలకు దిగారు. శ్రీరామినేని శ్రీధర్ అప్పటి ఆనందపురం ఎంపీపీగా ఉన్న టీడీపీ నాయకుడు కోరాడ రాజబాబుకు విక్రయించినట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తరువాత పులవర్తి సుబ్రహ్మణ్యం బావ లక్ష్మణరావు పేరుతో బదలాయించారు. కోనేరు కరుణాకరరావు నుంచి నాలుగు ఎకరాలను సుబ్రహ్మణ్యమే స్వయంగా తన పేరున, మరో ఎకరం తన స్నేహితుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అలా చుట్టూ తిరిగి మొత్తం పది ఎకరాల భూమి పులవర్తి సుబ్రహ్మణ్యం చేతిలో పడింది!.

ఆక్రమణదారుల కోసమేనా యువగళం?



టీడీపీకి చెందిన భూ ఆక్రమణదారులు, అక్రమార్కులకు కొమ్ము కాయటానికే లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టినట్లుగా ఉంది. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు భోగాపురం మండలంలో పలు భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఒక్క పోలిపల్లి గ్రామ పరిధిలోనే రూ.వందల కోట్ల విలువైన భూములను రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి కాజేసినట్లు బాధితులు ఆక్రోశిస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి బుద్ధి చెప్పినా లోకేశ్ నిస్సిగ్గుగా అదేచోట యువగళం ముగింపు సభ నిర్వహిస్తున్నారు. అక్రమార్కులు, పెత్తందారులకు టీడీపీ కొమ్ము కాస్తున్నట్లు దీన్నిబట్టి రుజువవుతోంది. తీరు మారని టీడీపీకి ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయం.

– మజ్జి శ్రీనివాసరావు,
వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు

మారణాయుధాలతో దాడులు..

2004 ఎన్నికల్లో టీడీపీ ఓటమి అనంతరం పోలిపల్లి పరిధిలో సర్వే నంబర్ 27లోని భూములకు సంబంధించి తిరుమలరెడ్డి ఆదినారాయణ పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్‌పై విచారణ మొదలైంది. అవేవీ భోగాపురం తహసీల్దారు కార్యాలయం నుంచి జారీ కాలేదని గుర్తించారు. ఆర్డీవో, తహసీల్దారు సంతకాలను ఫోర్జరీ చేయడంపై చర్యలకు ఆదేశించినా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారు. కబ్జాపై ప్రశ్నించిన తిరుమారెడ్డి ఆదినారాయణ బంధువులు, అమనాం, రావాడ గ్రామస్తులపై 2004 జనవరి 1న రౌడీ మూకలు మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డాయి. ఆ భూమి వద్దకు వచ్చిన వారిని దారుణమైన చిత్ర హింసలకు గురి చేసిన వైనాన్ని స్థానికులు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. బాధితులు భోగాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. నెలల పాటు కిరాయి మూకలు మారణాయుధాలతో ఆ భూమిలోనే తిష్ట వేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఉత్తరాంధ్రలోని ఒక జిల్లాకు ఎస్పీగా పని చేసిన ఓ పోలీసు అధికారి భార్య పేరిట 2.43 ఎకరాలు, ఆయన బావమరిది పేరుతో 49 సెంట్ల భూమి 2017లో బదిలీ కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు అధికారి ఉద్యోగ విరమణ అనంతరం టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడికి సలహాదారుడిగా వ్యవహరించడం భూముల కబ్జాలో ఆ పార్టీ నేతల ప్రమేయానికి నిదర్శనంగా నిలుస్తోంది.

లోకేశ్ పాదయాత్రకు జనం కరువు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేశ్ ఆదివారం యలమంచిలి, అనకాపల్లి, పెందుర్తి, గాజువాక నియోజకవర్గాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. తోటాడ-పరవాడ గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ జరగకపోవడం వల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎల్‌జీ పాలిమర్స్ సమస్యను కూడా లోకేశ్ దృష్టికి తెచ్చారు. పరవాడలో లోకేశ్ పాదయాత్రకు జనం కరువయ్యారు. రాత్రి 8 గంటలకు స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పాదయాత్ర నిర్వహించారు.

లోకేశ్‌ది పాదయాత్రా.. డైటింగ్ యాత్రా?

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌గాంధీ
- లోకేశ్.. నీ స్థాయిని మించి మాట్లాడుతున్నావ్.. జాగ్రత్త



సాక్షి, అమరావతి: తెలుగుదేశం నాయకుడు లోకేశ్ చేస్తున్నది పాదయాత్ర లాగా లేదని, కేవలం డైటింగ్ కోసం చేస్తున్న యాత్రలాగా ఉందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ చెప్పారు. లోకేశ్‌ది పాదయాత్రా.. లేక డైటింగ్ యాత్రా? అని అందరూ ప్రశ్నిస్తున్నారన్నారు. యాత్రలో ఎక్కడా ప్రజాసమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయటం లేదని, అందుకే లోకేశ్ యాత్రపై ప్రజలకు సందేహం కలుగుతోందని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేశ్ అడుగు పెట్టిన చోటల్లా ఏదో ఒకటి జరుగుతోందని, ఆయన మాట్లాడితే మటాష్ అన్నట్లుగా పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పాదయాత్ర ద్వారా ఏం తెలుసుకున్నారో, ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నారో లోకేశ్‌కే అర్థం కావటంలేదన్నారు. ప్రతిసారీ చంద్రబాబు ఇస్తాం అంటారు తప్ప ఇంతవరకు ప్రజలకు ఇచ్చింది ఏమీ లేదని చెప్పారు. ఇప్పుడు అమ్మ ఒడి పథకం మీద పడి ఏడుస్తున్నారని విమర్శించారు. నమ్మకం, పట్టుదల, కష్టం, విజయం ఇవి సీఎం జగన్ డీఎన్ఏ అయితే మోసం, దగా, కుట్ర, వెన్నుపోటు చంద్రబాబు డీఎన్ఏ అని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ క్రియేటర్ అయితే చంద్రబాబు డెకరేటర్ అని చెప్పారు. జగన్ నమ్మకానికి అమ్మ వంటివారని, చంద్రబాబు నమ్మకాన్ని అమ్మకానికి పెట్టేవాడని పేర్కొన్నారు.

ఎర్ర బుక్కులో రామకోటి రాసినా పుణ్యం వస్తుంది

రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమం ఓర్వలేక కడుపు మంటతో చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ దిక్కుమాలిన విమర్శలు చేస్తున్నారని, ఎల్లో మీడియా పనికి మాలిన రాతలు రాస్తోందని చెప్పారు. లోకేశ్ పాదయాత్ర పేరుతో ఎంత తిరిగినా, ఎన్ని ఎర్రబుక్కులు రాసినా ఒరిగేదేమీలేదన్నారు. దానిబదులు రామకోటి రాస్తే పుణ్యమైనా వస్తుందని చెప్పారు. అమరావతి అనే దాన్ని చంద్రబాబు డ్రామా కంపెనీగా మార్చారన్నారు. వందేళ్ల చరిత్ర తీస్తే.. తెలంగాణ, రాయలసీమ కంటే వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర అని తెలిపారు. చంద్రబాబు విశాఖను రాజధానిగా చేయకుండా, తన ధనదాహం తీర్చుకోవడానికి అమరావతిని పెట్టారని విమర్శించారు. మూడు రాజధానుల కోసం నాలుగేళ్లుగా జరుగుతున్న ఉద్యమాన్ని పచ్చ మీడియా బ్యానర్ ఐటంగా ఎందుకు పెట్టదని ప్రశ్నించారు. అమరావతి.. చంద్రబాబుకు, ఆయన వర్గానికి వ్యాపార రాజధాని, ఆదాయమార్గం తప్పితే ప్రజా రాజధాని కాదని రాజీవ్‌గాంధీ చెప్పారు.

కులపిచ్చితోనే అమరావతిపై పురందేశ్వరి వ్యాఖ్యలు

బహుజన పరిరక్షణ సమితి నాయకుల ధ్వజం



దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: కులపిచ్చితోనే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పదేపదే అమరావతిపై వ్యాఖ్యలు చేస్తూ తన మరిది చంద్రబాబు అవినీతికి వత్తాసు పలుకుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,176వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థల్లో తామే ఆధిపత్యం చెలాయించాలనే దురాశతో కులవాదులంతా ఏకమై చేస్తున్న తప్పుడు పనులతో బహుజనులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదలను 14 సంవత్సరాలు అణగదొక్కిన చంద్రబాబు ఇప్పుడు వారు ఆర్థికంగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక తప్పుడు కేసులు వేయించి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కులపిచ్చితో అన్ని పార్టీల్లో చేరి వీరంతా రాజకీయ వ్యభిచారం చేస్తున్నారన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి, దళిత నాయకులు పాల్గొన్నారు.

హద్దు దాటుతున్న గజరాజులు

- కర్ణాటక సరిహద్దులోనే ఏనుగుల గుంపు
- గతంలోనూ ఇదే మార్గంలో చొరబడిన వైనం
- కర్ణాటక, తమిళనాడు అడవులోంచి కౌండిన్యలోకి మళ్లింపు



రైల్వే ట్రాక్‌ను దాటుతున్న కర్ణాటక ఏనుగుల గుంపు (ఫైల్)

పలమనేరు: జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలో ఉన్న కౌండిన్య అభయారణ్యంలో దశాబ్దాలుగా గజరాజుల సమస్య ఉంది. వీటికి తోడు తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్ నుంచి తరచూ ఏనుగులు ఈ ప్రాంతానికి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. తాజాగా కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేట అడవులనుంచి చొరబడిన ఏనుగుల గుంపు కుప్పం నియోజకవర్గ సరిహద్దులో సంచరిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక అటవీ అధికారులు ఏనుగులను కౌండిన్య అడవుల్లోకి మళ్లించడంతోనే ఇక్కడ సమస్య ఎక్కువైంది.

అడవులను వదలి జనావాసాల్లోకి

కౌండిన్య అభయారణ్యం దాదాపు 250 కిలోమీటర్లు మూడు రాష్ట్రాల సరిహద్దుగా ఉంటుంది. ఇందులో పలమనేరు, కుప్పం నియోజకవర్గంలోని ఏనుగులు సంచరించే అడవి ప్రాంతంలో 70 కిలోమీటర్లు ఎలిఫెంట్ ట్రెంచ్‌లు, 230 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఏనుగులు వీటిని ధ్వంసం చేసి పంటపొలాలు, జనావాసాలవైపు దూసుకొస్తున్నాయి. ప్రస్తుతం స్థానిక కౌండిన్యలోనే 64 ఏనుగులు ఉన్నట్టు అటవీశాఖ చెబుతోంది. ఇవి ప్రస్తుతం వి.కోట మండలం అటవీ సమీప గ్రామాల్లో 13 దాకా సంచరిస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. పెద్దపంజాణి ప్రాంతంలో ఎనిమిది సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పలమనేరు మండలంలోని కౌండిన్యలో పదకొండు ఉండగా, మరో మూడు మదపుటేనుగులు ఒంటరిగానే సంచరిస్తున్నాయి. తమిళనాడులోని మోర్ధన అడవిలో రెండు, మూడు గుంపులుగా ఉన్నట్టు తెలుస్తోంది. అడవిలో ఉండాల్సిన ఏనుగులు పంటలపై, జనంపై దాడులు చేస్తున్నాయి.

కారిడార్‌తోనే పరిష్కారం

ఏనుగుల సమస్యకు మూడు రాష్ట్రాల్లో కారిడార్ నిర్మాణం ఒక్కటే శాశ్వత పరిష్కార మార్గంగా కనిపిస్తోంది. కర్ణాటకలోని బంగారుపేట, మాలూరు, కేజీఎఫ్, బన్నేరుగట్ట, తమిళనాడులోని మోర్ధన, క్రిష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు రావడంతోనే రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. ఇవి అడవులను దాటి జనావాసాల మీదుగా సంచరిస్తున్నాయి. ఏనుగుల శాశ్వత పరిష్కారంలో భాగంగా మూడు రాష్ట్రాల్లోని అడవిలో ఓ కారిడార్‌ను నిర్మించేందుకు గతంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వైల్డ్ అనిమల్ ప్రొటెక్షన్‌కు ప్రభుత్వం నివేదిక పంపినా మూడు రాష్ట్రాలకు సంబంధించిన సమస్య కాబట్టి కార్యరూపం దాల్చలేదు. దీంతోపాటు ఏనుగుల సంరక్షణ కోసం అడవుల్లో నీటి కుంటలు, షెల్టర్లు, అవసరమైన వెదురు, గడ్డి పెంపకాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై స్థానిక ఎఫ్ఆర్వో శివన్నను వివరణ కోరగా కర్ణాటక సరిహద్దుల్లోని ఏనుగులు కౌండిన్యలోకి రాకుండా తమశాఖ చూస్తోందన్నారు. ఇక స్థానికంగా ఉన్న ఏనుగులు గుంపులుగా విడిపోయి సంచరిస్తున్నాయన్నారు. ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నామని తెలిపారు.

తాజాగా కర్ణాటక నుంచి ఏనుగులు

కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేట, కేజీఎఫ్ అడవుల్లోంచి 24 ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇందులో పిల్ల ఏనుగును కలిగిన 14 ఏనుగుల గుంపు ప్రస్తుతం మన రాష్ట్రం వైపు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడి ఫారెస్ట్ అధికారులు వీటిని బన్నేర్‌ఘట్ట అడవులోకి మళ్లించకుండా కుప్పంవైపునకు మళ్లించడంతోనే అవి ఈ మార్గం వైపుకొస్తున్నట్లు సమాచారం. గతంలోనూ కర్ణాటక రాష్ట్రం నుంచి శాంతీపురం, గుడుపల్లి వైపుకొచ్చిన ఏనుగులు ఓ వ్యక్తిని సైతం తొక్కి చంపాయి. అప్పట్లో కుప్పం ఫారెస్ట్ అధికారులు వీటిని ఏపీలోకి రానివ్వకుండా మళ్లీ కర్ణాటక అడవుల్లోకి మళ్లించి ట్రాకర్స్‌ను పహారాగా ఉంచి సమస్యను పరిష్కరించారు.

వచ్చిన దారిని మరవని ఏనుగులు

ఏనుగులు ఓ సారి కొత్తగా ప్రయాణించిన మార్గాన్ని తన జీవితకాలంలో మరిచిపోదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి గతంలో ఎలా ప్రయాణించాయో అదే మార్గంలో మళ్లీ వస్తుంటాయి. ఇవి రోజుకు 30 కిలోమీటర్ల దాకా సంచరిస్తాయి. గతంలో కుప్పం సరిహద్దు గ్రామాల్లోకి వచ్చిన అలవాటు మేరకు మళ్లీ ఇక్కడికి రావచ్చన్న ఆందోళన మొదలైంది. ఇదే టెన్షన్ అక్కడి గ్రామాల జనాల్లో కనిపిస్తోంది.



కొన్నిసార్లు జనాలు సత్యాలను నమ్మడానికి ఇష్టపడరు, ఎందుకంటే వారు తమ భ్రమలు చెదిరిపోవడాన్ని ఇష్టపడరు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 18 డిసెంబర్ 2023

శీతోష్ణస్నానం

వసంతకాలమే ఋతువుల రాణి అనుకుంటాం కానీ, హిమానీ నిబిడ హేమంతమూ, చలి వణికించే శిశిరకాలం మాత్రం ఏం తక్కువ? ఆమాటకొస్తే ఏ ఋతువుకా ఋతువు జీవజాలాన్ని ఏకచ్ఛత్రంగా శాసించే మహారాణియే! మహారాణి అన్నప్పుడు ఆగ్రహానుగ్రహాలు సమపాళ్లలో ఉండకతప్పదు. అసలు మనం అల్లుకునే ఊహలు, కల్పించుకునే భావనలు, సృష్టించుకునే మాటల ఇరుకులో మనమే ఎలా బందీలమవుతామంటే; చన్నీళ్ళ, వేణ్ణీళ్ళ స్నానాలూ; పర్వదినాల్లో నదీ, సముద్రస్నానాలే తప్ప ఏటేటా నిండా మునిగే ఋతుస్నానాలు మనకు స్ఫురించవు. జ్యేష్ఠ – ఆషాఢమాసాల మహోష్ణంలోనూ, శ్రావణ – భాద్రపదాల కుంభవృష్టుల్లోనూ స్నానించినట్టే మార్గశిర – పుష్యమాసాల్లో నిలువునా కోతపెట్టే శీతలస్నానాలే మనకు రాసిపెట్టి ఉంటాయి. ఇది ఋతువుల రాణి ఆగ్రహపార్శ్వమైతే; హేమంత – శిశిరాలలో మిట్టమధ్యాహ్నం వేళ ఆరుబయటికో, డాబా మీదికో తరిమి శీతోష్ణస్నానంతో హాయిగొలపడం అనుగ్రహపార్శ్వం.

హేమంతం కలిగించే ఆ హాయి ఇంకా ఎన్నెన్ని విధాలుగా ఉంటుందంటే, భక్త పోతన అంతటి వాడిలో కూడా అది రక్తిని రంగరించి రసికతను రాశిపోస్తుంది. శ్రీమంతమైన హేమంతం ప్రవేశించేసరికి చేమంతులు ధరించిన పూబంతుల కౌగిలిలో ఎందరో చలి భయాన్ని జయించారు కానీ; విరహులకు ఆ యోగం లేకుండా మన్మథుడు వేధించాడట. ఉత్తరపు గాలి అదే పనిగా విసురుతూ చీకాకు పెట్టే హేమంతరాత్రులలో మంచుకిరణాల రేరాజు మహాశత్రువయ్యాడట. ఎడమొహం, పెడమొహంగా ఉన్న దంపతులు కూడా రాజీపడిపోయి జంటగా చలిని జయించడానికి సిద్ధమయ్యారట. పగటి సమయం తగ్గి, అగ్ని ఆప్తమిత్రుడైపోయాడట. అతి శీతల దీర్ఘరాత్రుల పాలబడి లోకమంతా గడగడా వణికిపోయిందట. హిమం తాకిడికి కమలాలు బెదిరి తరిగి పోయాయట.

ఆదికవి వాల్మీకి హేమంత చిత్రణలూ హృద్యంగా ఉంటాయి. పృథివి విరగబండుతుంది కానీ మంచు కసిపట్టినట్టు మనుషుల్ని కాల్చుకుతింటుంది. నీరూ, నీడా దుస్సహమవుతాయి. మధ్యాహ్నాలు సుఖసంచార సమయాలవుతాయి. సూర్యుడు దూరంగా జరిగిపోవడం వల్ల హిమాలయాలు మంచుతో పూర్తిగా గడ్డకట్టి సార్థకనామాలవుతాయి. ఆకాశం కప్పు కింద నిద్రించడం మాని అందరూ ఇంటికప్పు కింద ముడుచుకుంటారు. సమస్త జనాన్ని ఇళ్ళల్లో బంధింపజేయగలిగిన హేమంత రుతురాజు యశస్సు దిక్కులను ఆవరించిందా అన్నట్టుగా మంచు సర్వత్రా కమ్ముకుందని మరో కవి వర్ణిస్తాడు. శీతఘాతానికి అన్ని జీవులూ సొమ్మసిల్లినా తను మాత్రం అచలంగా ఉండి అందగించే భూదేవిని మెచ్చి ఆ హేమంత ప్రభువే వజ్రాలు కానుక చేశాడా అన్నట్టుగా ప్రాతర్వేళల లేత పచ్చికలపై మంచుబిందువులు రహించాయని ఇంకో కవి అభివర్ణన.

నిత్యనూతనమవుతూ, ఆదికవి నుంచి ఆధునిక కవి వరకు ఋతుచక్రం ఒక్కలానే తిరుగుతూ ఉంటుంది. 'ఇవాళలాగే ఎప్పుడు కూడా ఇనబింబం పయనించు నింగిపై; ఎప్పుడు కూడా ఇవాళ లాగే గాలులు వీచును, పూవులు పూచును' అంటూ శిశువులకు హామీపత్రం రాసిస్తాడు మహాకవి. 'రాత్రంతా మంచుముక్కలా బిగుసుకున్న ఆకాశంలో కదల్లేని నక్షత్రాలు వెండి తెరల కాంతిలోంచి జారుకుంటూ గడ్డిపరకలపై కన్ను తెరిచే' దృశ్యమూ; ఉదయం తొడుక్కున్న చలివస్త్రంలోంచి చెట్లు చల్లని పచ్చసిరాతో జీవితం కాగితమ్మీద కొత్త సంతకాలు చేయడ'మూ (బి.వి.వి. ప్రసాద్) నేటి కవి దృష్టినీ సమానంగా ఆకర్షిస్తాయి. అలాంటిదే, 'పటిక ముక్కల్లాంటి మంచుబిందువుల శీతాకాలంలో చెరువు తేటపడడమూ, అప్పుడే అడవి, ఆకాశం, చెరువు ఒకదాని సౌందర్యాన్ని ఒకటి ఆస్వాదించడమూ' (కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ) కూడా! సంగీతాన్ని వాయుశిల్పంలా దర్శించిన మరో కవి (పసునూరు శ్రీధర్ బాబు) స్వనస్నానమాచరించి శీతాకాలపు గదిలో చుబుకం కింద వణికే పిడికిళ్లేసుకుని ఓ మూల ముడుచుక్కూచోవలసిందేనంటాడు.

ఏ ఋతువూ మరో ఋతువులా ఉండదు; ఒక ఋతువులోంచి మరో ఋతువులోకి మారిపోయే మన అనుభవమూ, అనుభూతీ ఒక్కలా ఉండవు. ప్రతి ఋతువులోనూ మనం పునర్జన్మిస్తాం. ప్రతి ఋతువూ మనకు శైశవం నుంచి వార్ధక్యం వరకూ అన్ని దశలనూ చవిచూపి మరీ నిష్క్రమిస్తుంది. ప్రతి ఋతువులోకీ ఒక శిశువుగా కళ్ళు తెరుస్తాం. ఏటా పునర్జీవించే ఈ ఋతజన్మలను గణించకుండా ఒక్క జన్మనే ఊహించుకోవడం కూడా మనకు మనం విధించుకునే అజ్ఞానమే. అసలు జీవితమంటేనే ఋతువుల మధ్య నిరంతర సంచారం. సందర్భం వేరైనా మరో కవి(సిద్ధార్థ) అన్నట్టు, ఒక ఋతువులోంచి ఇంకొక ఋతువులోకి 'అందరూ ఎవరికివారే కొత్తగా పుట్టి నడచుకుంటూ వెళ్లిపోతారు'.

ఋతువులు, మాసాలు, సంవత్సరాలతో మన కేలండర్ మనకున్నట్టే ఈ విశ్వానికీ, అందులోని ఈ భూగోళానికీ, అందులో మనం కూడా భాగమైన ప్రకృతికీ తనదైన కేలండర్ ఉంది. వందల కోట్ల సంవత్సరాల అస్తిత్వంలో భూమి ఎన్నో హిమప్రళయాలను చూసింది. వాటిలో చివరిదైన మంచుయుగం ఇరవయ్యారు లక్షల సంవత్సరాల క్రితం మొదలై పదకొండు వేల సంవత్సరాల క్రితం వరకూ కొనసాగింది. ఇప్పుడు మనం జీవిస్తున్న కాలాన్ని కూడా మంచు యుగపు అంతర్దశగానే చెబుతారు. శీతోష్ణాల నిరంతర సంఘర్షణ నుంచే జీవం పుట్టి నేటి రకరకాల రూపాల్లోకి పరివర్తన చెందింది. ఆ వైశ్విక ఋతుభ్రమణం మన చేతుల్లో లేనిది కనుక దానినలా ఉంచితే; మనకు తెలిసిన, మనం ప్రత్యక్షంగా భాగమైన ఋతుభ్రమణాన్ని మన చేతులారా గతి తప్పించకుండా చూసుకోవలసిన బాధ్యత మనదే!

ఏం చెప్పినట్లు? ఏం చెప్పనట్లు?

కామెంట్



కరణ్ థాపర్

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. అయితే, 'రద్దు రాజ్యంగ బద్ధమే కానీ, అందుకోసం అనుసరించిన విధానం సమర్థనీయం కాదు' అని అభిప్రాయపడటం చర్చనీయాంశం అయింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి వీలుగా కశ్మీర్ 'రాజ్యాంగ సభ'ను కశ్మీర్ 'రాష్ట్ర శాసన సభ' అనే అర్థంలోకి తెచ్చేందుకు వెసులుబాటును కల్పించే ఆర్టికల్ 367ను కేంద్రం వాడుకుంది. మళ్లీ ఈ 367 సవరణ కోసం నియమ విరుద్ధంగా 272వ రాజ్యాంగ ఉత్తర్వును ఆసరా చేసుకుంది. ఇది అధికారాన్ని దాటి వెళ్లడమేనని న్యాయస్థానం అంటూనే, రద్దును సమర్థించడం తీర్పు సంపూర్ణత్వంపై న్యాయపరమైన సందేహాలను రేకెత్తిస్తోంది.

మునుపు చెప్పిన దానినే మళ్లీ చెప్పడంతో ప్రారంభిస్తాను. ఒక సంక్లిష్టమైన ముగింపును అర్థం చేసుకోడానికి అత్యుత్తమమైన మార్గం ఏమిటంటే స్పష్టత అవసరమయ్యే అంశాలను లేవనెత్తే ప్రశ్నలకు రూపకల్పన చేసుకోవడం. చీకటి సొరంగంలో చిన్న కాంతిరేఖను కనుగొనడం వంటిది ఇది. అందువలన నన్ను కశ్మీర్‌పై తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల వైపు వెళ్లనివ్వండి.



'రద్దు' అని అంతా అంటున్న ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో నేను విషయాన్ని ప్రారంభిస్తాను. రద్దును సమర్థించడాన్ని అలా ఉంచితే – ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి వీలుగా కశ్మీర్ 'రాజ్యాంగ సభ'ను కశ్మీర్ 'రాష్ట్ర శాసన సభ' అనే అర్థంలోకి తెచ్చేందుకు వెసులుబాటును కల్పించే ఆర్టికల్ 367ను కేంద్రం వాడుకుంది. మళ్లీ ఈ 367 సవరణ కోసం కేంద్ర ప్రభుత్వం నియమ విరుద్ధంగా 272వ రాజ్యాంగ ఉత్తర్వు (కాన్‌స్టిట్యూషనల్ ఆర్డర్)ను ఆసరా చేసుకుంది. ఇది అధికార అతిక్రమణేనని బెంచిలోని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 రద్దుకు కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న ఈ మార్గం చట్ట విరుద్ధమైనది కనుక రద్దు చెల్లుబాటు అవదని నిజానికి కోర్టు తీర్పు ఇవ్వవలసింది. కానీ అలా ఇవ్వలేదు. బదులుగా, క్లాజ్ 3ని ఉపయోగించి ఆర్టికల్ 370ని రద్దు చేయవచ్చని పేర్కొనడం ద్వారా కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థించింది. దీనర్థం... ప్రభుత్వం తప్పుగా చేసింది కానీ, మరోలా చేసి ఉంటే తప్పేమీ అయివుండేది కాదని కోర్టు తీర్పు ఇవ్వడం. అంటే ప్రభుత్వాన్ని సమర్థించడం.

ఇది నాకు ప్రభుత్వం నోటిలో న్యాయస్థానమే వాదనలు పెట్టినట్లుగా అనిపించింది. అయితే అవి ప్రభుత్వ వాదనలు కావు. దీనిపై కపిల్ సిబాల్, ''ఆర్టికల్ 370పై ప్రభుత్వ స్వీయ అవగాహనకు, కోర్టు తీర్పునకు కొద్దిగానైనా పొంతన లేదు. సుప్రీంకోర్టు ఇలా తీర్పు ఇవ్వడం సరైన విధానమేనా?'' అని ట్వీట్ చేశారు.

ఆర్టికల్ 367లో రాజ్యాంగ ఉత్తర్వు 272 ద్వారా ప్రవేశపెట్టిన క్లాజు 3 ప్రకారం, కశ్మీర్ రాజ్యాంగ సభను రద్దు చేయొచ్చన్న వాదన కూడా... 'కశ్మీర్ రాజ్యాంగ' సభ రద్దు అవడం అంటే 'కశ్మీర్ అసెంబ్లీ'కి ఉండే సిఫారసు అధికారం ఉనికిలో లేకుండా పోవడం మాత్రమే అనే వాదనపై ఆధారపడి ఉంటుంది. అంతే తప్ప రద్దుకు భారత రాష్ట్రపతికి ఉన్న అధికారంపై – సిఫారసు చేసేందుకైనా, చేయకుండా ఉండేందుకైనా – అది ఎలాంటి ప్రభావమూ చూపదు. ఈ వాదన ఆమోదయోగ్యమైనదా లేక వివాదాస్పదమైనదా?

ఇప్పుడిక ఆర్టికల్ 3 ప్రకారం ఒక రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు... అంటే, జమ్మూ కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా కుదించేందుకు... కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నదా లేదా అని నిర్ధారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయానికి వద్దాం. కోర్టు రెండు వాదనలపై ఆధారపడింది. ఒకటి: ''ఆర్టికల్ 356 అమలులో ఉన్న సమయంలో రాష్ట్రపతి తీసుకున్న ఏ నిర్ణయాలపైన అయినా వచ్చే దావాల విచారణకు కోర్టు కొలువు తీరవలసిన అవసరం ఉంటుందని మేము భావించడం లేదు. ఎందుకంటే రాష్ట్రం తరఫున రాష్ట్రపతి, పార్లమెంటు తీసుకున్న ప్రతి చర్య కూడా సవాలుకు అనువుగా ఉంటే కష్టం. అప్పుడిక రాష్ట్రపతి పాలనలో తీసుకున్న ప్రతి చర్యతోనూ విభేదించే ప్రతి వ్యక్తినీ ఇది ఎలాంటి అడ్డంకులూ లేకుండా కోర్టు వరకు రానిస్తుంది'' అని! రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ రాజ్యంగబద్ధమేనా, కాదా అని నిర్ధారించేందుకు నిరాకరించిన కోర్టు అందుకు చూపించిన ఈ కారణం న్యాయబద్ధమైనదేనా?

కోర్టు చూపించిన రెండవ కారణం – ఆర్టికల్ 3 కింద రాష్ట్ర శాసనసభ సిఫారసులు అమలుకు బద్ధతను కలిగి లేవు. అందులో సందేహం లేదు. అయినప్పటికీ రాజ్యాంగం ప్రకారం అదొక ప్రక్రియ. సిఫారసులకు బద్ధమై ఉండే అవసరం లేనంత మాత్రాన కోర్టు తన నిర్ణయం చెప్పడానికి నిరాకరించవచ్చునా?

ఇప్పుడు, పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగబద్ధమైనదా, కాదా అని నిర్ధారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించిన పర్యవసానంగా జరిగేది ఒకటేమిటంటే... ఇదే పద్ధతిలో మరికొన్ని పునర్వ్యవస్థీకరణలు జరగవచ్చు. ప్రభుత్వం బెంగాల్, కేరళ, తమిళనాడులలో రాష్ట్రపతి పాలనను ప్రకటించి, అసెంబ్లీ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేసి, ఆ తర్వాత – రాష్ట్రాన్ని రద్దు చేయాలా, లేక కేంద్రపాలిత ప్రాంతంగా రాష్ట్ర స్థాయిని తగ్గించాలా అన్న దానిని పార్లమెంటులో నిర్ణయించవచ్చు. ఈ విధానం, మున్ముందు ఒక ఆనవాయితీగా స్థిరపడిపోతుంది.

రెండో పర్యవసానం... బహుశా మరింత ముఖ్యమైనది. సమాఖ్య భావన (ఫెడర లిజం) అనేది రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో భాగం అని కదా అలోక్ ప్రసన్న కుమార్ అంటారు. దాని అర్థం దాన్ని పార్లమెంటు సవరించలేదని! అయితే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అధికారాన్ని పార్లమెంటరీ అధికారంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనివల్ల పార్లమెంటు అధికారానికీ, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ ప్రాముఖ్యతకూ మధ్య ఇప్పుడు మనకు ఘర్షణ తలెత్తడం కనిపించదా?

'ది హిందూ' మరింత విస్తృతమైన అంశాన్ని వెల్లడించింది. ''ఒక రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉన్నప్పుడు రాష్ట్ర శాసనసభ తరఫున ఎటువంటి చర్యనైనా – శాసనపరమైనవి, తిరుగులేని పరిణామాలకు తావిచ్చేవి – ఏవైనా గానీ కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చుననే ఒక సహేతుకం కాని తీర్మానాన్ని సుప్రీంకోర్టు తీర్పు సూచిస్తోంది'' అని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దీని పైనే అర్ఘ్యా సేన్‌గుప్తా మాట్లాడుతూ, ''ఇది భారతదేశ సమాఖ్యతత్వ భవిష్యత్తుకు సంబంధించి కీలకమైన పరిణామాలతో ముడివడి ఉన్న రాజ్యాంగపరమైన ప్రశ్న'' అన్నారు. అంటే... కోర్టు తన తాజా తీర్పుతో సమస్యల తుట్టెను కదిలించినట్లయిందా?

ఈ ప్రశ్నలకు సమాధానం దొరికినప్పుడే కశ్మీర్ తీర్పుల గురించి నేనేమనుకుంటున్నానో నాకు తెలుస్తుంది. కానీ ఆ సమాధానాలను ఎవరు అందిస్తారు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



లేని ఆశలు

'మండల్ వర్సెస్ మందిర్' అనేది ఏదో ఒకటి ఎంచుకొమ్మని తప్పుగా సూచిస్తోంది. మండల్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకించింది. కానీ ఇప్పుడు ఉత్తర భారత ఓబీసీ లను రాజకీయమయం చేయడం ద్వారా గట్టెక్కగలనని భావిస్తుండటం మహా అయితే దాని ఆశావాదం అనుకోవచ్చు.

– సూర్యకాంత్ వాగ్‌మోరే, సోషియాలజీ ప్రొఫెసర్



తస్మాత్ జాగ్రత్త!

ఉన్నట్టుండి, చాలామంది సెఫాలజిస్టులు (ఎన్నికల సర్వేలు నిర్వహించేవాళ్లు) 2024 ఫలితాలను ప్రచండంగా ఊహిస్తున్నారు. ఇకనుంచీ ప్రతి వారానికోసారి ఒపీనియన్ పోల్స్ జరుగుతాయి. అవన్నీ కూడా మోదీ 3.0 అని చెబుతాయి. ఇదంతా కూడా రాజకీయ అంచనాలను తలకిందులు చేయడానికి జరిగే వ్యవస్థీకృత ప్రజా సంబంధాల ప్రచారం. అంటే, మిమ్మల్ని మానసికంగా ఏమార్చడం! తస్మాత్ జాగ్రత్త!!

– సంజయ్ ఝా, రచయిత



సత్యం

"ఒకవేళ అందరూ చేస్తున్నప్పటికీ, తప్పు తప్పే. ఒకవేళ ఎవరూ చేయకపోయినప్పటికీ ఒప్పు ఒప్పే."

– వాలా అఫ్సార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్



మొత్తం మిగులే!

నా స్నేహితులు ఎప్పుడైతే తమ పిల్లలను హోమ్‌స్కూలింగ్ చేయడం మొదలు పెడతారో, వాళ్లకు పాఠాలు చెప్పడానికి ఇంత తక్కువ సమయం సరిపోతుందని తెలుసుకుని దిగ్భ్రాంతికి గురవుతారు.

– క్రిస్‌మన్ ఫ్రాంక్, హోమ్‌స్కూలింగ్ యాక్టివిస్ట్



మీరే బాధ్యులు

మనం మన ఆరోగ్యం పట్ల ఇంకొంచెం బాధ్యతగా ఉంటే – దేశమూ (యూకే), జాతీయ ఆరోగ్య సేవా (ఎన్‌హెచ్‌ఎస్) పథకమూ చాలా మెరుగైన స్థితిలో ఉంటాయి. కొద్దిగా చురుగ్గా ఉండటానికి మనకు అందరికీ రోజులో కొంత సమయం దొరుకుతుంది. ఇది జనాదరణకు నోచుకోని అభిప్రాయమే కావచ్చుగానీ, జనాన్ని మెరుగైన ఆకృతిలో ఉంచే బాధ్యత ప్రభుత్వానిది కాదు – అది మీ మీద ఆధారపడి ఉంటుంది.

– కరోల్ సైకోరా, ఆంకాలజిస్ట్



డబ్బుల్లేని రంగాలు

నైజీరియాలోని వినోద రంగం, సృజనాత్మక రంగాల్లో ఒక్కరు కూడా ధనికులు లేరు. ధనికులు కావాలంటే, కొకైన్ స్మగ్లింగ్ చేయాలి. రాజకీయాల్లోకి వెళ్లాలి. కిడ్నాపర్ కావాలి. పుస్తకం రాయడం, పాడటం, నటించడం పనికిరావు. ఇలాంటివన్నీ చివరికి ఎలా ముగుస్తాయో చూశాం; శస్త్రచికిత్స కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు భిక్ష అడగటంతో! అందుకే భ్రమలు వద్దు.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

ఫెడ్ రేట్లు తగ్గితే... అంతా బాగేనా?

అభిప్రాయం



డి. పాపారావు

అమెరికా ఫెడరల్ బ్యాంక్ ఈ మధ్య కాలం వరకూ వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చింది. అనంతరం గత కొద్ది దఫాల తమ సమావేశాలలో ఆ పెరిగిన వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయాలు తీసుకుంటూ వచ్చింది. ఈ వడ్డీరేట్ల పెంపు ఉద్దేశ్యం దేశంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం. ఈ చర్య వల్ల ప్రస్తుతం ఆ దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. నవంబర్ 2023కు సంబంధించి వెలువడిన అమెరికా 'వినియోగదారుల ధరల సూచీ' 3.1 శాతంగా నమోదు అయింది. అంతకుముందరి అక్టోబర్ మాసంలో ఈ ద్రవ్యోల్బణం 3.2 శాతంగా ఉంది. ముఖ్యంగా, కోర్ ఇన్‌ఫ్లేషన్‌గా పిలవబడే ఆహార, ఇంధన ధరల పెరుగుదలను లెక్కలలోంచి తీసివేసి, అంచనా వేసే ద్రవ్యోల్బణం 4 శాతం వద్ద స్థిరంగా ఉంది.

నిన్నా మొన్నటి వరకూ పెరుగుతూ వచ్చిన వడ్డీరేట్ల వలన అమెరికా ప్రజల కొనుగోలు శక్తీ, వారు తమ అవసరాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే అవకాశాలూ తగ్గిపోతూ వచ్చాయి. అలాగే వారు తాము గృహాలు లేదా వాహనాల కొనుగోలు కోసం తీసుకున్న రుణాలపై వడ్డీ మొత్తాలు పెరిగిపోయిన కారణంగా కూడా ప్రజల కొనుగోలు శక్తి దెబ్బ తినటం, అనేక సందర్భాలలో వారు అసలు తిరిగి తమ రుణాలను చెల్లించలేని స్థితికి చేరడం వంటివీ జరిగాయి. ఈ నేపథ్యంలోనే నేడు అమెరికాలోని అనేక బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు మొండి బకాయిలు పెరిగిపోయి, ప్రస్తుతం తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి.

ఈ పెరిగిన వడ్డీరేట్ల వలన అమెరికా ఆర్థిక వ్యవస్థలో మెల్లమెల్లగా మందగమనం మొదలవుతోంది. అక్టోబర్ 2023లో అమెరికాలో ఉపాధి కల్పన 8.7 మిలియన్లకు తగ్గడం దీని పర్యవసానమే. ఈ రెండేళ్ల కాలంలో అతి తక్కువ స్థాయి ఇదే! ఒక పక్కన ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన దాఖలాలూ... మరో పక్కన తగ్గిపోతున్న ఉపాధి కల్పన గణాంకాలూ... డిసెంబర్ నెలలో జరిగిన అమెరికా ఫెడరల్ బ్యాంక్ సమావేశంలో 2024లో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ బ్యాంక్ ఛైర్మన్ జరోమ్ పావెల్ సంకేతాలను ఇచ్చేలా చేశాయి.

పెరిగిపోతున్న ఆటోమేషన్ (మర మనుషులు, సాఫ్ట్‌వేర్‌లలో పురోగతి), కొన్ని దేశాల్లో శ్రామిక శక్తి చౌకగా లభించడం వల్ల అమెరికా వంటి ధనిక దేశాల నుంచి పరిశ్రమలు, సేవారంగం భారీగా విదేశాలకు తరలిపోతున్నాయి. అమెరికాలో నేడు ప్రజల కొనుగోలు శక్తిని నిలిపి వుంచుతోంది షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్ వంటి సట్టా వ్యాపారాలూ, ఉద్దీపనా పథకాలూ; రుణ స్వీకరణను సులువు చేస్తూ, బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు వంటి చర్యలే! స్థూలంగా అటు ఉద్దీపన రూపంలో ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణీని పెంచే చర్యలూ... అలాగే వడ్డీరేట్లను 0 (సున్నా) శాతానికి తగ్గించివేస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల అమెరికా వంటి దేశాలలో మార్కెట్‌లో డబ్బు చలామణి విపరీతంగా పెరిగిపోయింది. అందుకే సరఫరా పెరిగిపోయిన ఏ సరుకైనా దాని విలువ పడిపోయినట్లుగానే అమెరికా డాలర్ విలువ కూడా పడిపోయింది. సూక్ష్మంగా చెప్పాలంటే డాలర్ కొనుగోలు శక్తి పతనమై, ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు అటు ప్రజల కొనుగోలు శక్తీ, ఇటు షేర్ మార్కెట్ల వంటి ఎటువంటి ఉత్పత్తి లేకుండానే పెట్టుబడిగా పెట్టిన డబ్బును లాభాలతో కలిపి మరింత డబ్బుగా పెంచే వ్యాపారాలు వంటివన్నీ నష్టపోతాయి. కాబట్టి ఈ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత మరలా తిరిగి ప్రభుత్వంపైనో... లేకుంటే ఆ దేశం తాలూకా కేంద్రబ్యాంకు పైనో పడుతుంది.

ఇక ఇప్పుడు, కేంద్రబ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు రూపంలో, తాను చలామణీలోకి తెచ్చిన అధిక నగదు మొత్తాన్నో... లేదా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలోకి ఉద్దీపన రూపంలో పంపిన డబ్బునో తిరిగి మరలా వెనక్కి లాక్కోవలసి వస్తుంది. దీనికోసం కేంద్రబ్యాంకు వడ్డీరేట్లను పెంచుతుంది, ప్రభుత్వం ఉద్దీపన పథకాలను నిలిపివేస్తుంది. తద్వారా, ఆర్థిక వ్యవస్థలో ఉన్న అదనపు డబ్బును వెనక్కి లాగివేసి ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తుంది.

అమెరికాలో నేడు నడుస్తోన్న కథ ఇదే! ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఏర్పడితే డబ్బు చలామణీ పెంచడం... ఈ డబ్బు చలామణీ పెరగడం వలన ద్రవ్యోల్బణం పెరిగితే తిరిగి మరలా అధికంగా చలామణిలోకి తెచ్చిన ఆ డబ్బును వెనక్కి లాగివేయటం అనే వలయమే ఈ కథ సారాంశం. అమెరికా ఆర్థిక వ్యవస్థ తాలూకు ఈ రెండు దశల మధ్యనా ఉన్న కాలవ్యవధి నేడు వేగంగా కుచించుకు పోతోంది.

నిజానికి, అమెరికా ఆర్థిక వ్యవస్థలో డాలర్ల ముద్రణ గత



అనేక దశాబ్దాలుగా జరుగుతున్నప్పటికీ... మనం 2008 అనంతరం పరిణామాలను ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. 2008లో అమెరికాలో ఫైనాన్స్ సంక్షోభం ఏర్పడింది. ఈ సంక్షోభ క్రమంలో, అమెరికా జనాభాలోని సగానికి సగం మంది రాత్రికి రాత్రే దారిద్ర్య రేఖకు దిగువకు నెట్టివేయబడ్డారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు 2009 ఫిబ్రవరిలో ఒబామా ప్రభుత్వం 7,00,800 బిలియన్ డాలర్ల ఉద్దీపనను, అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇచ్చింది. ఆ తరువాత కూడా కొద్ది దఫాలు మరిన్ని ఉద్దీపనలు ఇచ్చారు. తదనంతరం నెలవారీ (95 బిలియన్ల డాలర్ల మేర) ఉద్దీపనలను ఇస్తూ పోయారు. తరువాత ఈ ఉద్దీపనల స్టెరాయిడ్‌ల ప్రభావంతో ఆర్థిక వ్యవస్థ 'నిలదొక్కుకుందనే' నమ్మకం కుదిరాక, కొంతమేర ఈ ఉద్దీపనలను తగ్గించివేశారు. అయితే, 2020 కోవిడ్ లాక్‌డౌన్‌ల అనంతరం మరలా లక్షల కోట్ల డాలర్ల మేర కరెన్సీని ముద్రించి అమెరికా ఉద్దీపనలను ఇచ్చింది. లాక్‌డౌన్‌ల వలన ఇళ్ళకే పరిమితం అయిపోయి... ఆదాయాలు నిలిచిపోయిన కుటుంబీకులను ఆదుకునేందుకు ఈ చర్య అవసరం అయ్యింది. అయితే, 2008 తరువాతి ఉద్దీపనలూ, వడ్డీరేట్ల తగ్గింపులూ, తదనంతరం 2020 నాటి మరింత ఉద్దీపనలూ కలగలిసి 2022 నాటికి ద్రవ్యోల్బణం రూపంలో దాడి మొదలుపెట్టాయి. అప్పటికే శక్తికి మించిన భారాన్ని మోస్తోన్న ఒక ఒంటె మూపుపై అదనంగా మరో గడ్డిపోచ వేసినా కుప్ప కూలిపోయినట్లు... 2008 నుంచి పెంచుతూ వచ్చిన డాలర్ల చలామణీ ప్రభావం, అంతిమంగా 2022లో తీవ్ర ద్రవ్యోల్బణ రూపంలో బయటపడింది. దీనికి విరుగుడుగా మరలా ద్రవ్య చలామణీని తగ్గించే వడ్డీరేట్ల పెంపు వంటి నిర్ణయాలు జరుగుతూ పోయాయి. ఈ క్రమంలోనే నేడు అమెరికా తిరిగి మందగమనం, ఉపాధి కల్పనలో బలహీన స్థితికి చేరింది.

ప్రస్తుత ఫెడరల్ బ్యాంక్ సమావేశం 2024లో మూడు దఫాలుగా 75 బేసిస్ పాయింట్ల మేరకు వడ్డీరేట్లను తగ్గించే అవకాశం గురించి మాట్లాడిందంటే ఈ మందగమనం ద్రవ్యోల్బణాల విషవలయం తాలూకు మరో రౌండ్ మొదలయ్యిందన్న మాట! కానీ, ఈ రౌండ్... గత రౌండ్ (2008, 2022)లు ఉన్నంత కాలం ఉండే అవకాశమే లేదు. ప్రస్తుత రౌండు వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయాలు అతి స్వల్పకాలంలోనే ద్రవ్యోల్బణం తిరిగి తలెత్తే పరిస్థితిని తెచ్చిపెడతాయి. ఫలితంగా ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ తాలుకూ ఈ గడియారం లోలకం పరస్పర విరుద్ధ కొసలు అయిన వృద్ధి మందగమనం– ద్రవ్యోల్బణం మధ్య... మరింత వేగంగా కొట్టుమిట్టాడుతుంది. ఆర్థిక వ్యవస్థలో అటువంటి అనిశ్చితి అమెరికా ప్రజా జీవితంలో మరింత తీవ్ర అభద్రతకూ, అనిశ్చితికీ దారితీయగలదు. ఈ క్రమంలోనే అమెరికా డాలర్ పతనం ప్రమాదం కూడా మరింత తీవ్రతరం అవుతుంది. ఇదే జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తాలూకా స్వరూప స్వభావాలనే పునర్నిర్వచించే పరిస్థితి తలెత్తవచ్చు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

నెల రోజుల వ్రతం

ధనుర్మాస వ్రతం, శ్రీవ్రతం, తిరుప్పావై వ్రతం, గోదా వ్రతం అనే పేర్లతో వ్యవహరింపబడే ముప్పయి రోజుల వ్రతం ఈ డిసెంబర్ 17న ప్రారంభమైంది. ఒక నెల రోజుల పాటు కొనసాగనున్నది. విష్ణు భక్తులు ఆచరించే మూడు వ్రతాలు కృష్ణాష్టమీ వ్రతం, ఏకాదశీ వ్రతం, ధనుర్మాస వ్రతం – ఈ మూడింటిలో కృష్ణాష్టమి ఒకే రోజు ఆచరించునట్టిది. ఏకాదశీ వ్రతం నెలలో 2 సార్లు, సంవత్సరంలో 24 రోజులు చేస్తారు. ఇక ధనుర్మాస వ్రతం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా 'ముప్పదుం తప్పామే' (30 రోజులు) పాటిస్తారు.



తమ తమ గృహాలలో కొందరు, అలాగే దగ్గరలో ఉన్న వైష్ణవాలయాల్లోకి తెల్లవారు జాము సమయంలో భక్తులు చేరుకొని గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలను (తమిళ పాటలను) పాడుతూ, అష్టోత్తర శతనామాలను శ్రీకృష్ణునిపై, గోదాదేవిపై చదువుతూ తులసీదళాలతో, పూలతో అర్చనలు చేస్తారు. ఉపనిషత్తులలో నిగూఢంగా చెప్పబడిన వేదాంతార్థాలను గోదాదేవి 'తిరుప్పావై' అనే తమిళ ప్రబంధాలలో 30 పాటలలో ఇమిడ్చి భక్త జన ప్రియంగా ఒక దివ్య ప్రబంధంగా, ధ్వని కావ్యంగా భక్తులకు అందించింది.

సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించినపుడు మొదలయ్యే ఈ గోదావ్రతం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే వరకు కొనసాగుతుంది. వ్రత సమయంలో భక్తులు తోటి వారితో పరుషంగా, కఠినంగా పలుకరాదు. చాడీలను చెప్పరాదు. ఆహార నియమాలను పాటించాలి. సహృదయంతో మెలగాలి. పరమాత్మ గుణాలను వినాలి. భగవంతుడి పాదాల వైభవాన్ని గూర్చి నోరారా పాడాలి. భగవన్నామ సంకీర్తనం చేయాలి. తెల్లవారు జామునే నిదుర లేచి త్వరగా స్నానం చేయాలి. తమ శక్తి మేరకు దానధర్మాలు చేయాలి. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయాలనే సంకల్పాన్ని కలిగియుండాలి. పుష్పాలతో శ్రీహరిని పూజించాలి. శరణాగతి భావంతో సాత్త్వికమైన ఈ ధనుర్మాస వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించాలి అని తెలిపి, తాను ఆచరించి మనకు అందించింది గోదా దేవి.

– సముద్రాల శఠగోపాచార్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.షష్ఠి సా.6.29 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.6.35 వరకు, తదుపరి శతభిషం తె.4.49 వరకు (తెల్లవారితే మంగళవారం), **వర్జ్యం:** ప.1.17 నుండి 2.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.19 నుండి 1.07 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** రా.10.09 నుండి 11.36 వరకు, సుబ్రహ్మణ్యషష్ఠి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.25.

తెలంగాణ

వామనావతారంలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం భద్రాద్రి రామయ్య వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు దివ్య ప్రబంధం పఠించారు. అనంతరం మేళ తాళాలు, వేదపండితుల మంత్రోఛ్చారణలు, భక్తుల కోలాహలం, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్దకు తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చి హారతి సమర్పించారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ మాఢ వీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కొండపై, కొండ కింద గల బస్టాండ్లు భక్తులతో నిండుగా కనిపించాయి. కొండపైన, కొండ కింద భక్తుల వాహనాలతో పార్కింగ్ నిండిపోయింది. కాగా శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి రెండున్నర గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయంరూ.54,09,081 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలో తొలి చరిత్ర గ్రంథాలయం ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో తొలిచరిత్ర గ్రంథాలయాన్ని నిజామాబాద్‌లో ప్రారంభించినట్లు ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర సంఘటన మంత్రి వేదుల నరసింహం తెలిపారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఆదివారం ఇతిహాస సంకలన సమితి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో అశ్మక చరిత్ర గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ చరిత్ర అధ్యయనం అనేది యజ్ఞంతో సమానమన్నారు. అలాంటి చరిత్ర అధ్యయనం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందకుర్తి యాదవరావు అని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయం కోసం యాదవరావు 60 ఏళ్లుగా తాను పోగుచేసిన నాలుగు వేలకుపైగా చరిత్ర పుస్తకాలను అందజేసి, తన ఇంటిని చరిత్ర గ్రంథాలయ నిర్వహణ కోసం ఉచితంగా కేటాయించారని పేర్కొన్నారు. మన చరిత్ర వక్రీకరణకు గురైందని, వక్రీకరణలే వాస్తవాలనే భ్రమలో చాలా మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దౌర్భాగ్యస్థితి నుంచి సమాజాన్ని వాస్తవచరిత్ర వైపు నడిపించడం కోసం ఆధారాలతో కూడిన నిజమైన చరిత్రను సేకరించి పునర్లిఖించడమే ధ్యేయంగా ఇతిహాస సంకలన సమితి పనిచేస్తోందన్నారు. సంస్థకు అందరూ సహకరించాలని కోరారు. రూ.15 వేలతో పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయానికి అందజేసిన జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్‌ను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో రచయితలు కందకుర్తి యాదవరావు, తాటి వీరేశం, మోహన్ దాస్, ఋషి, కందకుర్తి ఆనంద్, శ్రీమన్నారాయణ విరాట్ పాల్గొన్నారు.

నేడు పీఏసీ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం సోమవారం జరగనుంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, పీఏసీ సభ్యులు హాజరవుతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ పక్షాన గెలిచిన ఎమ్మెల్యేలకు అభినందనలతో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధత లాంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

గిరిజన ఉపాధిలో వికాసం

గిరిజన ఉత్పత్తుల కొనుగోలు. అమ్మకాలకు ఊతం

- గిరిజనులకు లాభం.. కొన్న వాళ్లకు ప్రయోజనం
- సూపర్ మార్కెట్లను తలపిస్తున్న వన్ ధన్ వికాస్ కేంద్రాలు
- రాష్ట్రంలో 8 ఐటీడీఏల పరిధిలో 415 కేంద్రాలు
- గిరిజనులు సేకరించిన ఫలసాయం. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్
- గిరిజన పల్లెల్లో సత్ఫలితాలిస్తున్న వన్ ధన్ వికాస్ కేంద్రాలు



అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరులో వన్ ధన్ వికాస్ కేంద్రం

సాక్షి, అమరావతి: ఏజెన్సీలోని వన్ ధన్ వికాస్ కేంద్రాలు(వీడీవీకే)లతో గిరిజన ఉపాధిలో వికాసం కనిపిస్తోంది. వీటి ఏర్పాటుతో గిరిజనులకు ఉన్నతమైన జీవనోపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. గిరిజనులు సేకరించిన ఫలసాయంతోపాటు గిరిజన రైతులు పండించిన ఉత్పత్తులను నాణ్యత చెడిపోకుండా అందమైన ప్యాకింగ్‌తో అమ్మకాలు చేయిస్తోంది. గిరి ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తూ అడవి బిడ్డలకు లాభదాయకంగా మలుస్తోంది. కొనుగోలుదారులకు సైతం ప్రయోజనాలను అందిస్తోంది. రాష్ట్రంలోని 8 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల పరిధిలో వీడీవీకేలు అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ గిరిజనులకు ఎంతో మేలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన వీడీవీకేల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఆయా ఐటీడీఏల పరిధిలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ వాటిని పర్యవేక్షిస్తున్నారు.

విక్రయిస్తున్న ఉత్పత్తులివీ..

అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయంతోపాటు వారు పండించిన ఉత్పత్తులు కూడా అందంగా ప్యాక్‌చేసి వీడీవీకేల్లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా తేనె, కాఫీ, పసుపు, మిరియాలు, రాజ్మా, రాగులు, రాగి పిండి, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, అడవి దుంపల నుంచి తీసిన పాలపిండి, జీడి పప్పు, నల్లజీడి పిక్కలు, మినుములు, చింత పండు, శీకాయ, శీకాయ పొడి, కుంకుడు, చీపుర్లు, అడ్డాకులతోపాటు ఇంట్లో తయారు చేసిన ధనియాల పొడి, నువ్వులు, కారం, కరివేపాకు, మునగాకు పొడులు కూడా విక్రయిస్తుండటం విశేషం.

రూ.61.63 కోట్లతో 415 వీడీవీకేలు

రాష్ట్రంలో 2019-20 నుంచి 2021-22 వరకు గిరిజన సంక్షేమ శాఖ 415 వీడీవీకేలను ఏర్పాటు చేయించింది. ఇందుకోసం రూ.61.63 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటివరకు రూ.36.04 కోట్లు విడుదల చేశారు. గిరిజన మహిళలతో గ్రూపులు ఏర్పాటు చేయించి.. వారికి పెట్టుబడి సాయం అందిస్తున్నారు. గిరిజనులు పండించిన ఉత్పత్తులు, సేకరించిన ఫలసాయాలకు వీటిద్వారా కనీస మద్దతు ధర దక్కేలా చేస్తున్నారు. సేకరించిన అటవీ ఉత్పత్తులకు అదనపు విలువను జోడించేలా గిరిజన మహిళలకు శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్‌కు అనుగుణంగా వాటిని సిద్ధం చేయడం వంటి లక్ష్యాలు సాధించడంలో వీడీవీకేల ద్వారా చేస్తున్న ప్రయత్నాల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. గిరిజన ఉత్పత్తుల సేకరణ నుంచి మార్కెటింగ్ వరకు వీడీవీకేల ద్వారా అందిస్తున్న తోడ్పాటు గిరిజన మహిళల ఆర్థిక పురోగతికి దోహదం చేస్తోంది. రాష్ట్రంలో ఏర్పాటైన వీడీవీకేలు సూపర్ మార్కెట్లను తలపిస్తున్నాయి.

నెలకు రూ.25 వేలకు పైనే మిగులుతోంది



గిరిజన మహిళలు గ్రూపుగా ఏర్పడి వీడీవీకే ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీతో కూడిన పెట్టుబడి సాయం అందిస్తుంది. ఐటీడీఏ, డీఆర్‌డీఏ పర్యవేక్షణలో ఇవి గిరిజన ప్రాంతాల్లో వినూత్న సూపర్ మార్కెట్‌ల మాదిరిగా ఆదరణకు నోచుకుంటున్నాయి. వీటికి మంచి డిమాండ్ ఉండటంతో నెలకు కనీసం రూ.లక్షకుపైగా విక్రయాలు జరిగితే పెట్టుబడి పోనూ రూ.25 వేలు లాభం మిగులుతోంది. గ్రూపు సభ్యులు లాభాల్లో వాటా పంచుకుని మెరుగైన జీవనం గడిపేందుకు వీడీవీకేలు దోహదం చేస్తున్నాయి.
– జి.పైడమ్మ, వీడీవీకే నిర్వాహకురాలు, పాడేరు

తిరుపతమ్మ ఆలయ చైర్మన్‌గా బీసీ నేత

ఘనంగా పాలకవర్గ ప్రమాణస్వీకారం



పెనుగంచిప్రోలు (జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయ చైర్మన్‌గా మొదటిసారి బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కింది. ఆలయ పాలకవర్గాలు ఏర్పడిన 1960 నుంచి నేటిదాకా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచన మేరకు జగ్గయ్యపేట మండలం గుండబోయినపాలెం గ్రామానికి చెందిన బీసీ వర్గీయుడు జంగాల శ్రీనివాసరావును ఆలయ చైర్మన్‌గా నియమించారు. ఆలయంలో ఆదివారం శ్రీనివాసరావు చైర్మన్‌గా, 15 మంది పాలకవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

ఎస్వీ జూలో అనారోగ్యంతో ప్రాణాలు విడిచిన సింహం

తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా): శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఆదివారం ఏడు సంవత్సరాల వయసు గల అనురాగ్ అనే మగ సింహం మృతి చెందినట్టు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఈ సింహం అనారోగ్య సమస్యలతో జన్మించిందన్నారు. దీనికి ఒక కన్ను కనిపించదని, పొట్టిగా ఉంటుందని చెప్పారు. అనారోగ్య సమస్యల కారణంగా జూ డాక్టర్లు చికిత్స చేసి సంరక్షించారని, గత ఎనిమిది రోజులుగా ఆహారం తీసుకోవడం లేదని, డాక్టర్ల పర్యవేక్షణలోనే ఉందని వివరించారు. ఈక్రమంలో ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన సింహం మృతి చెందిందని తెలిపారు.

తెలంగాణ

'గగన' విజయం

ఫ్లైట్ కేడెట్ల సక్సెస్ స్టోరీ..

సాక్షి, హైదరాబాద్: కలలు కన్నారు.. ఆ కలను నిజం చేసుకునేందుకు కష్టపడ్డారు.. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుంటూ గగనతలంలో విజయబావుటా ఎగురవేశారు ఈ యువ ఫ్లయింగ్ కేడెట్లు. ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం అయినా..అంతిమ లక్ష్యం మాత్రం భరతమాత సేవలో తాము ఉండాలన్నదే. ఆదివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొని భారత వాయుసేనలోని వివిధ విభాగాల్లోకి అడుగుపెట్టిన సందర్భంగా యువ అధికారులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు ఇలా పంచుకున్నారు.

దేశ సేవలో నేను మూడో తరం..



దేశ సేవలో మా కుటుంబ నుంచి మూడో తరం అధికారిగా నేను ఎయిర్ ఫోర్స్‌లో చేరడం ఎంతో సంతోషంగా ఉంది. మా తాతగారు పోలీస్ అఫీసర్‌గా చేశారు. మా నాన్న కర్నల్ రాజేశ్ రాజస్థాన్‌లో పనిచేస్తున్నారు. నేను ఇప్పుడు ఎయిర్ ఫోర్స్‌లో నావిగేషన్ బ్రాంచ్‌లో సెలక్ట్ అయ్యాను. వెపన్‌సిస్టం ఆపరేటర్‌గా నాకు బాధ్యతలు ఇవ్వనున్నారు. ఇది ఎంతో చాలెంజింగ్ జాబ్. శిక్షణ సమయంలో ఎన్నో కఠిన పరిస్థితులను దాటిన తర్వాత నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎలాంటి బాధ్యత అయినా నిర్వర్తించగలనన్న నమ్మకం పెరిగింది. మా స్వస్థలం జైపూర్. నేను బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టం అమేథీలో చేశాను. – ఫ్లయింగ్ కేడెట్ థాన్యాసింగ్, జైపూర్

నాన్నే స్ఫూర్తి...



మాది వికారాబాద్ జిల్లా చీమల్‌దరి గ్రామం. నాన్న పేరు శేఖర్. ప్రైవేటు ఉద్యోగి, అమ్మ బాలమణి టైలర్. చిన్నప్పటి నుంచి నాన్న స్ఫూర్తితోనే నేను డిఫెన్స్ వైపు రాగలిగాను. కార్గిల్ యుద్ధంలో సూర్యకిరణ్ పైలెట్ బృందం ఎంతో కీలకంగా పనిచేసిందన్న వార్తలను చూసి మా నాన్న నాకు సూర్యకిరణ్ అని పేరు పెట్టారు. చిన్నప్పటి నుంచే నన్ను డిఫెన్స్‌కు వెళ్లేలా ప్రోత్స హించారు. అలా నేను ఏడో తరగతిలో డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీకు ప్రవేశ పరీక్ష రాసి 8వ తరగతిలో చేరాను. అందులో రాష్ట్రానికి ఒక్క సీటు మాత్రమే కేటాయిస్తారు. అంత పోటీలోనూ నేను సీటు సాధించాను. అక్కడే ఇంటర్మీడియెట్ వరకు చదివాను. ఆ తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీలో రెండేళ్లు శిక్షణ తీసుకున్న తర్వాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి సెలక్ట్ అయ్యాను.
– సూర్యకిరణ్, చీమల్‌దరి, వికారాబాద్ జిల్లా

ఓటీపీలతో రూ.6.90 లక్షలకు కుచ్చుటోపీ

- ప్రభుత్వం నుంచి డబ్బులొస్తాయని ఆశచూపి దోచుకున్న మోసగాళ్లు
- ఐనముక్కలలో సైబర్ మోసానికి గురైన సోదరులు

పెద్దదోర్నాల: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తం మీ అకౌంట్లోకి జమ చేస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్‌లోని నగదు మొత్తాన్ని కాజేసిన ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని ఐనముక్కలలో ఆదివారం వెలుగు చూసింది. ఈ ఘరానా మోసంలో గ్రామానికి చెందిన ఇద్దరు సోదరులు నగదు పోగొట్టుకున్నారు. ఎస్సై అంకమరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14వ తేదీన గ్రామానికి చెందిన చిట్యాల ఆంజనేయరెడ్డి అనే యువకుడికి గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తం ఒక్కసారే అకౌంట్‌లో పడుతుందని, ఫోన్ పే ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి మాట్లాడాలని సూచించాడు. తొలుత అకౌంట్ నుంచి కొంత మొత్తం కట్ అయి తిరిగి పడుతుందని మోసగాళ్లు నమ్మబలికారు. తనది ఆండ్రాయిడ్ ఫోన్ కాకపోవడంతో ఆ యువకుడు గ్రామానికి చెందిన లింగాల శ్రీను నంబర్ నుంచి గుర్తు తెలియని నంబర్‌కు కాన్ఫరెన్స్ కాల్ మాట్లాడాడు. అయితే.. శ్రీను అకౌంట్‌లో అమౌంట్ తక్కువగా ఉందని చెప్పడంతో శ్రీను తమ్ముడు లింగాల రమేష్ నంబర్ నుంచి ఫోన్‌చేసి కాన్ఫరెన్స్ కాల్ కలిపి ముగ్గురూ సైబర్ నేరగాళ్లతో మాట్లాడారు. అతని మాటలు నమ్మిన రమేష్ తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌లతో పాటు ఫోన్‌పేకు సంబంధించిన పాస్‌వర్డ్‌ను చెప్పటంతో లింగాల రమేష్ అకౌంట్‌లోని రూ.6.90 లక్షల నగదు మాయమైంది. అయితే.. మాయమైన డబ్బు నుంచి రూ.79 వేల నగదు తిరిగి బాధితుడి అకౌంట్‌కు జమ అయినట్లు ఎస్సై తెలిపారు. తమకు వచ్చిన ఫోన్ నంబర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా అది స్విచ్ఛాఫ్ వస్తుండటంతో తాము మోసపోయినట్లు సోదరులు గ్రహించారు. హుటాహుటిన పోలీస్ స్టేషన్‌తో పాటు స్థానిక బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు ఢిల్లీ, మధ్యప్రదేశ్ నుంచి ఫోన్లు వచ్చాయని, ఏ రాష్ట్రానికి ఫోన్ చేయాలనుకుంటే అదే భాషలతో మాట్లాడే వాళ్లతో ఫోను చేయిస్తారని, డబ్బులు వస్తాయని నమ్మకంగా ఆశ చూపి అకౌంట్లలోని డబ్బులు మాయం చేస్తారని ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని నంబర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బందరు బీచ్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి

స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్లడంతో ఘటన



తోకల అఖిల్ (ఫైల్)

నూజివీడు: సముద్ర స్నానానికి వెళ్లిన నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ తృతీయ సంవత్సరం విద్యార్థి తోకల అఖిల్ (21), ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు వీవీఎస్ సాయి, ఎ.నితిన్ కన్నా, ఎస్.శివదత్తా, బి.రమేష్, పి.గోపి, తృతీయ సంవత్సరం విద్యార్థి బి.నితిన్ మొత్తం ఏడుగురు మెడికల్ చెకప్ పేరుతో శనివారం రాత్రి 8.30 గంటలకు రెండు రోజుల సెలవు పెట్టి ట్రిపుల్ ఐటీ నుంచి బయటకు వెళ్లారు. వీరిలో తోకల అఖిల్ మాత్రం సాయికల్యాణ్ పేరుపై బయటకు వెళ్లడం గమనార్హం. ట్రిపుల్ ఐటీ వద్ద నుంచి వీరందరూ మంగినపూడి బీచ్‌కు స్నానాలకు వెళ్లారు. తోకల అఖిల్‌కు ఈత వచ్చి ఉండటంతో మిగిలిన వారికంటే ముందుగా సముద్రంలోకి వెళ్లాడు. సముద్రంలో అలల తాకిడి ఉద్ధృతంగా ఉండటంతో లోపలికి కొట్టుకుపోయాడు. అతన్ని గమనించిన స్నేహితుడు నితిన్ రక్షించేందుకు సముద్రంలోకి వెళ్లాడు. దీంతో అతను కూడా అలల ఉధృతికి కొట్టుకుపోతుండటంతో మిగిలిన విద్యార్థులు అక్కడే ఉన్న జాలర్లకు చెప్పారు. వారు వెంటనే పడవలు వేసుకొని వెళ్లి నితిన్‌ను రక్షించారు. అఖిల్ మాత్రం అప్పటికే నీటిలో మునిగిపోయాడు. కొట్టుకుపోయిన రెండు మూడు గంటల తర్వాత అఖిల్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతుడు అఖిల్ స్వగ్రామం ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరు మండలం మోపాడు. ట్రిపుల్ ఐటీ అధికారుల సమాచారం మేరకు అఖిల్ తండ్రి మచిలీపట్నం చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత స్వగ్రామానికి తీసుకెళ్లారు.

సుల్యారీలో ఏపీ ఎండీసీ సామాజిక కార్యక్రమాలు

- ఆధునిక ప్రమాణాలతో పాఠశాల, ఆస్పత్రి ఏర్పాటు
- వీటి నిర్వహణకు ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందాలు



సుల్యారీలో స్కూల్, ఆస్పత్రి నిర్వహణకు డీఏవీఎస్, హెచ్‌ఎల్‌ఎల్ సంస్థలతో ఒప్పందం

సాక్షి, అమరావతి: మధ్యప్రదేశ్‌లోని సుల్యారీలో బొగ్గు గనులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీ ఎండీసీ) సామాజిక బాధ్యత కింద ఆ సమీపంలో కార్యక్రమాలు ప్రారంభించింది. అక్కడ బొగ్గు గనులను ఏపీ ఎండీసీయే నిర్వహిస్తుండటంతో స్థానికంగా పబ్లిక్ స్కూల్, హెల్త్ సెంటర్ నిర్మించింది. పబ్లిక్ స్కూల్ నిర్వహణపై దయానంద్ ఆంగ్లో వేదిక్ సొసైటీతోనూ, హెల్త్ సెంటర్ నిర్వహణకు హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ సంస్థలతో ఏపీ ఎండీసీ ఒప్పందాలు చేసుకుంది. ఆదివారం విజయవాడలో ఏపీ ఎండీసీ కార్యాలయంలో సంస్థ ఎండీ అండ్ వీసీ వీజీ వెంకటరెడ్డి ఆయా సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. మధ్యప్రదేశ్‌లో 1,450 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న సుల్యారీ బొగ్గు గనిని వేలంలో సొంతం చేసుకున్న ఏపీ ఎండీసీ ఉత్పత్తి ప్రారంభించింది. బొగ్గు గనుల నిర్వహణలో భాగంగా ఆ ప్రాంతంలో నిర్వాసితులైన ప్రజల పునరావాసం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టింది. అక్కడి ప్రజలకు పునరావాస కాలనీలు, రహదారులు, కాలువలు, రక్షిత మంచినీటి సరఫరా, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాల, వైద్యశాల, మురుగునీటి శుద్ధి ప్లాంట్, పచ్చదనాన్ని పెంపొందించే చర్యలను చేపట్టి అమలు చేస్తోంది. అందులో భాగంగానే అక్కడ అన్ని వసతులతో కూడిన ఏపీ ఎండీసీ పబ్లిక్ స్కూల్‌ను నిర్మించింది. ఈ స్కూల్ నిర్వహణకు దేశంలో అకడమిక్ ఎక్సలెన్స్‌కు ప్రసిద్ధి చెందిన దయానంద్ ఆంగ్లో వేదిక్ ట్రస్ట్ సొసైటీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం విద్యార్థుల కోసం ఆధునిక ల్యాబ్, లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, ప్లే గ్రౌండ్స్, అందుబాటులో క్రీడా పరికరాలను సమకూర్చడం ద్వారా ఆ ప్రాంతంలో విద్యా ప్రమాణాలు పెంచే చర్యలు చేపట్టింది. మైనింగ్ కోసం ఇతర ప్రాంతాలకు తరలించిన కుటుంబాలకు ఈ అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యావసతిని అందుబాటులో తీసుకువచ్చింది. అలాగే నామమాత్రపు వైద్య సదుపాయాలున్న సుల్యారీలో ఆధునిక వసతులతో ఆస్పత్రిని నిర్మించింది. దీన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్‌తో కలిసి ఏపీ ఎండీసీ నిర్వహించనుంది. ఆర్థోపెడిక్, గైనకాలజీ సౌకర్యాలతో కూడిన 24 గంటలు సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ సలహాదారు డీఎల్ఆర్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బిపిన్ కుమార్, రామన్ నారాయణ్ పాల్గొన్నారు.

తెలంగాణ


ఇంజనీరింగ్ కాలేజీల ఎదురీత

8 ఏళ్లలో 75 కాలేజీల మూత... జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువ

రాజధాని పరిసరాల్లో 20 కాలేజీలు క్లోజ్... దూసుకొస్తున్న ప్రైవేటు వర్సిటీలు

కంప్యూటర్ కోర్సుల విజృంభణ... ఈ దిశగా పోటీ పడలేని కాలేజీలు

విదేశీ వర్సిటీలొస్తే ఇంకా ప్రమాదమే.. సర్కార్‌కు ఉన్నత విద్యామండలి నివేదిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. దశాబ్ద కాలంగా ఏటా కళాశాలలు మూతపడు తున్నాయి. 2015 నాటికి రాష్ట్రంలో 234 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, ప్రస్తుతం వాటి సంఖ్య 159కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాలకు చేరువగా ఉండే కాలేజీలే ఎక్కువగా మూతపడుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 48 కాలేజీలుంటే, ఇప్పుడు వాటి సంఖ్య 11కు తగ్గింది. ఖమ్మం జిల్లాలో 28 ఉంటే, ఇప్పుడు 8 మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11కుగాను ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. ఇలా ప్రతీ జిల్లాలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఆఖరుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ 2015లో 74 కాలేజీలుంటే, 20 కాలేజీలు మాయమై 54 మిగిలాయి. ఇటీవల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మరికొన్ని కాలేజీలు కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదని ఉన్నత విద్యామండలి అధికారులు అంటున్నారు.

ఎందుకీ పరిస్థితి?

సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో డిమాండ్ బాగా తగ్గింది. ఈ కోర్సుల్లో 40 శాతం కంటే తక్కువే అడ్మిషన్లు జరుగుతున్నాయి. కొన్ని కాలేజీల్లో మెకానికల్, సివిల్ బ్రాంచీల జోలికే వెళ్లడం లేదు. 2023 ప్రవేశాల్లో దాదాపు 30 కాలేజీల్లో సివిల్ బ్రాంచ్‌లో సగానికి పైగానే సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా 58 శాతం కంప్యూటర్ కోర్సుల్లోనే ప్రవేశాలుంటున్నాయి. సీఎస్ఈ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సుల వైపే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యకు ఎక్కువ మంది హైదరా బాద్‌ను ఎంపిక చేసుకుంటుండగా, ఆ తర్వాత ఇంజనీరింగ్ విద్యనూ ఇక్కడే పూర్తి చేయాలని భావిస్తున్నారు. చదువుకునే సమయంలోనే పార్ట్ టైం ఉద్యోగం వెతుక్కునే అవకాశం నగరంలో ఉందని భావిస్తున్నారు. అరకొర విద్యార్థులతో జిల్లాల్లో కాలేజీలను నడిపే పరిస్థితి లేదని నిర్వాహకులు అంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులకు మౌలిక వసతుల కల్పనపై ఖర్చు చేయడానికి ఇష్టపడటం లేదు. దీంతో విద్యార్థులు ఆ కాలేజీల వైపు వెళ్లే పరిస్థితి లేదు. అందువల్ల అవి క్రమంగా మూతపడుతున్నాయి.

ప్రైవేటు వర్సిటీలొస్తే మరీ ప్రమాదం

ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కేంద్ర విద్యాశాఖ ఆహ్వానం పలుకుతోంది. అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీలోని ప్రధాన కాలేజీలు ఇక్కడ బ్రాంచీలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులను ఆకట్టుకునేందుకు అవి ప్రయత్నిస్తాయని నిపుణులు చెబుతు న్నారు. ఈ పోటీని మన ఇంజనీరింగ్ కాలేజీలు తట్టుకునే అవకాశం తక్కువనే వాదన విన్పిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 80 శాతం కాలేజీల నాణ్యత పెంచాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) రాష్ట్రానికి సూచించింది. న్యాక్ అక్రిడిటేషన్ పరిధిలోకి వస్తేనే అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ తరహా పోటీని తట్టుకునే ప్రైవేటు కాలేజీలు 20కి మించి లేవు. ఇంజనీరింగ్ విద్యలోనూ మార్పులు వస్తున్నాయి. బోధన ప్రణాళికను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ భవిష్యత్‌లో మరికొన్ని కాలేజీలు మూతపడేందుకు కారణాలవుతాయని అంటున్నారు.

పోటీ పెరిగితే మనుగడ



ప్రైవేటు యూనివర్సిటీలు పెరుగు తున్నాయి. కొత్త కోర్సుల దిశగా అవి దూసుకెళ్తున్నాయి. భవిష్యత్ లోనూ ఇదే ట్రెండ్ కన్పిస్తుంది. ముఖ్యంగా కంప్యూటర్ కోర్సులకే ప్రాధాన్య మిస్తున్నారు. జిల్లాల్లోని ప్రైవేటు కాలేజీలు ఈ పోటీని తట్టుకునేలా లేవు. ఇందుకు తగ్గట్టుగా ముందుకెళ్లే పరిస్థితి రావాలి. అప్పుడే వాటికి మనుగడ ఉంటుంది.
– ప్రొఫెసర్ డి.రవీందర్, ఉస్మానియా వర్సిటీ వీసీ

తెలంగాణ

అయ్యప్ప యాత్రలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వాముల దుర్మరణం

తమిళనాడులో ఘటన

మంగపేట: శబరిమల అయ్యప్ప దర్శనం చేసుకుని కారులో తిరిగి వస్తున్న ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన స్వాములు తలారి సుబ్బయ్య నాయుడు, నర్రా సాంబయ్య, కొట్టు రాజు ఆదివారం తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారితో పాటు కారులో ఉన్న కూనూరి అజయ్, జర్పుల రాము తీవ్ర గాయాలపాలయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14న ఇరుముడి సమర్పించేందుకు ఐదుగురు భక్తులు కారులో శబరిమల వెళ్లారు. స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం పేణి జిల్లా, దేవదాన గ్రామంలో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన అజయ్, రామును స్థానికుల సహకారంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

అయ్యప్ప స్వామి భక్తులు మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎంఓ ఆఫీస్‌కు ఫోన్ చేసి మరణించిన వారి మృతదేహాలను స్వస్థలాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మహిళా రైతు దుర్మరణం

సొంత పొలంలో నూర్పిడి చేయిస్తుండగా ప్రమాదం

అనంతపురం జిల్లా ఉప్పరపల్లి గ్రామంలో ఘటన



రాములమ్మ (ఫైల్)

రాప్తాడు రూరల్: పొలంలో వరి పంటను నూర్పిడి చేయించే క్రమంలో మిషన్‌లో పడి మహిళా రైతు దుర్మరణం చెందిన ఘటన అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిల్లా గోపాల్, చిల్లా రాములమ్మ (57) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమార్తెలకు వివాహం చేశారు. కుమారుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరి కుటుంబానికి గతంలో ప్రభుత్వం 1.70 ఎకరాల భూమిని కేటాయించింది. చిల్లా గోపాల్ అనారోగ్యానికి గురి కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఉన్న భూమిలో చిల్లా రాములమ్మ వరి పంట సాగు చేశారు. వారం కిందట పంట కోత కోసి పొలంలోనే ఉంచారు. ఆదివారం ఉదయం వరిగడ్డి మిషన్‌ను అద్దెకు పిలిపించారు. ఈ మిషన్ వరిగడ్డిని, ధాన్యాన్ని వేరు చేస్తుంది. మరో ఐదు నిమిషాల్లో పంట నూర్పిడి పూర్తవుతుందనగా..యంత్రం సమీపంలో పడి ఉన్న గడ్డిని రాములమ్మ సేకరించే ప్రయత్నం చేస్తుండగా చీరకొంగు యంత్రంపై పడింది. అంతే.. క్షణాల్లో ఆమెను లాగేసుకుంది. శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసేసింది. తల, చేతులు, మొండెం..ఇలా శరీర భాగాలన్నీ విడిపోయాయి. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ సావిత్రి ఘటనాస్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్

ధరణితో పాటు భూసంబంధిత అంశాలే ప్రధాన ఎజెండా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో తొలిసారి సమావేశం కానున్నారు. ఈనెల 21న జరగనున్న జిల్లా కలెక్టర్ల సమావేశానికి సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వ ఆలోచనా విధానాలను స్పష్టం చేయడంతో పాటు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేసేందుకు గాను ఈ భేటీ ఏర్పాటు చేసినట్టు సీఎంవో వర్గాలు చెపుతున్నాయి. తొలిసారి జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ధరణి పోర్టల్‌పై కీలక సమీక్ష ఉంటుందని, దీంతో పాటు పలు భూ సంబంధిత అంశాలు, జీవో 58, 59 అమలు, ప్రజావాణి కార్యక్రమం పట్టణాలు, జిల్లా కేంద్రాలకు విస్తరించడం, గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారుల ఎంపికపై మార్గదర్శకాల ఖరారు, రైతు భరోసా అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కౌలు రైతుల గుర్తింపు కోసం అనుసరించాల్సిన పద్ధతి.. తదితర అంశాలపై చర్చ ఉంటుందని తెలుస్తోంది. ముఖ్యంగా గృహలక్ష్మి పథకాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు ఉండి, ఇళ్లు లేని పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేసే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించాలని సీఎం రేవంత్ యోచిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇండ్ల స్థలాల గుర్తింపు, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల పంపిణీ కోసం మార్గదర్శకాల ఖరారుపై కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం.

కేరళలో కోవిడ్ వేరియంట్

పత్తనంతిట్ట: కేరళలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసు బయటపడింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జి ఆదివారం ప్రకటించారు. అయితే, దీనితో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని స్పష్టం చేశారు. 'కొన్ని నెలల క్రితం సింగపూర్ ఎయిర్‌పోర్టులో భారతీయ ప్రయాణికుల స్క్రీనింగ్ సందర్భంగా ఈ సబ్ వేరియంట్‌ను గుర్తించారు. దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ కొత్త వేరియెంట్లను గుర్తించారు. తాజాగా, జేఎన్.1 ఉప వేరియెంట్ తిరువనంతపురం కరకుళంలో బయటపడింది. దీనితో కంగారు పడాల్సిన పనిలేదు'అని మంత్రి అన్నారు. అయితే, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సార్స్–కోవ్–2 జెనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్)సాధారణ పరీక్షల్లో భాగంగా ఒక శాంపిల్‌లో ఈ వేరియంట్‌ను నవంబర్ 18న గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి పేర్కొంది. 79 ఏళ్ల బాధిత మహిళ ఇన్‌ఫ్లూయెంజా వంటి తేలికపాటి లక్షణాలతో ఆస్పత్రిలో చేరి కోలుకున్నారని వివరించింది.

మహారాష్ట్రలో ఫ్యాక్టరీలో పేలుడు...

తొమ్మిది మంది దుర్మరణం

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా బజార్‌గావ్‌లోని ఓ పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో సంభవించిన పేలుడులో తొమ్మిది మంది చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోలార్ ఇండస్ట్రీస్‌లోని కాస్ట్ బూస్టర్ విభాగంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆర్మీకి అవసరమైన డ్రోన్లు, పేలుడు పదార్థాలు ఈ యూనిట్‌లో తయారవుతాయి. ఉత్పత్తయిన బూస్టర్లకు సీల్ చేస్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఆ తీవ్రతకు ఫ్యాక్టరీ భవనం కుప్పకూలింది. ఘటన సమయంలో అక్కడ 12 మంది సిబ్బంది విధుల్లో ఉన్నట్లు కంధాలి పోలీస్‌స్టేషన్ అధికారి ఒకరు చెప్పారు. తొమ్మిది మంది మృతుల్లో ఆరుగురు మహిళలున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు.

నాలుగు గగనతల లక్ష్యాలను...

ఒకేసారి ఛేదించిన ఆకాశ్

న్యూఢిల్లీ: గగనతల రక్షణలో భారత్ అసాధారణ ప్రతిభాపాటవాలను ప్రదర్శించింది. ఒకేసారి నాలుగు గగనతల లక్ష్యాలను ఛేదించి ప్రపంచంలోనే ఈ తరహా సామర్థ్యమున్న మొట్టమొదటి దేశంగా అవతరించింది. డీఆర్‌డీఓ ఆదివారం ఈ మేరకు 'ఎక్స్'లో పేర్కొంది. ఆకాశ్ క్షిపణి వ్యవస్థ సాయంతో కేవలం ఒక్క ఫైరింగ్ యూనిట్ నుంచి భిన్న దిశల్లో 25 కిలోమీటర్ల దూరంలోని నాలుగు గగనతల లక్ష్యాలను ఒకేసారి విజయవంతంగా ఛేదించినట్టు తెలిపింది. గగనతల దాడుల నుంచి సున్నిత ప్రాంతాలను రక్షించేందుకు ఆకాశ్ క్షిపణులను వినియోగిస్తారు.

టోర్నడో ఎగరేసుకుపోయినా...

చెక్కుచెదరలేదు!

ఈ బుడతడు మృత్యుంజయుడు

గాల్లో 30 అడుగుల దూరం ఎగిరి పడ్డా ఏమీ కాలేదు

అమెరికాలోని టెన్నెసీలో జరిగిన అద్భుతం



అమెరికాలోని టెన్నెసీలో గత వారం ఓ అద్భుతమే జరిగింది. రెండు భయానక టోర్నడోలు రాష్ట్రాన్ని నిలువునా వణికించాయి. ఓ చిన్నారితో సహా ఆరుగురు వాటి బారిన పడి దుర్మరణం పాలయ్యారు. వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఎన్నో ఆస్తులు ధ్వంసమయ్యాయి. కానీ భయానకమైన అంతటి టోర్నడోలో అమాంతం గాల్లోకెగిసి ఏకంగా 30 అడుగుల దూరం ఎగిరిపోయిన ఓ నాలుగు నెలల బుడతడు మాత్రం చెక్కు చెదరలేదు! అంతటి ప్రమాదం నుంచి నిక్షేపంగా బయటపడి ఔరా అనిపించాడు. సినిమాల్లోనే కన్పించే అద్భుతం తమ జీవితంలో నిజంగా జరిగిందంటూ అతని తల్లిదండ్రులు దేవునికి దండం పెట్టుకుంటున్నారు.

ఇలా జరిగింది..

సిడ్నీ మూర్ (22), అరామిస్ యంగ్‌బ్లడ్ (39) దంపతులది టెన్నెసీలోని క్లార్క్స్‌విల్లే. మొబైల్ వ్యాన్లోనే నివాసం. వారికిద్దరు కొడుకులు. పెద్దవాడు ప్రిన్స్‌టన్‌కు ఏడాది కాగా రెండో వాడు లార్డ్‌కు నాలుగు నెలలు. గత శనివారం హఠాత్తుగా టోర్నడో (భారీ సుడిగాలి) క్లార్క్స్‌విల్లేను కకావికలు చేసి పారేసింది. స్థానిక అధికార యంత్రాంగం టోర్నడో సైరన్ ఇవ్వకముందే వారి మొబైల్ వ్యాన్‌పై విరుచుకుపడింది. చూస్తుండగానే పైకప్పును లేపేసింది. దాంతో మూర్ హుటాహుటిన ప్రిన్స్‌టన్‌ను హృదయానికి హత్తుకుని నేలకు కరుచుకుపోయింది. ఊయలలో నిద్రిస్తున్న లార్డ్‌ను కాపాడేందుకు తండ్రి పరుగులు తీశాడు. అప్పటికే ఆ చిన్నారిని టోర్నడో అమాంతంగా ఎగరేసుకుపోయింది. సుడిగాలి, అందులో అప్పటికే చిక్కిన అనేకానేక శిథిలాల మధ్య పాపం పసివాడు సుడులు తిరుగుతూ కొట్టుకుపోయాడు. ఆ వెంటనే మొబైల్ వ్యాన్ పూర్తిగా నేలమట్టమైంది. హోరు గాలులు, వాటిని మించిన జోరు వానతో పరిస్థితి భీతావహంగా తయారైంది. శిథిలాల్లోంచి పెద్ద కొడుకుతో పాటుగా మూర్ పాక్కుంటూ సురక్షితంగా బయటికి రాగలిగింది. కానీ పసివాడితో పాటు అతన్ని కాపాడబోయిన తండ్రి సైతం సుడిగాలి దెబ్బకు కొంత దూరం ఎగిరిపడ్డాడు. అంతెత్తు నుంచి అమాంతంగా కిందపడి భుజం విరగ్గొట్టుకున్నాడు. అంతటి నొప్పితోనే బాబు కోసం 10 నిమిషాల పాటు శిథిలాల దిబ్బలన్నీ ఆత్రంగా వెదికాడు. చివరికి 30 అడుగుల దూరంలో పడిపోయిన చెట్టు కింద చిన్నారి లార్డ్ గుక్కపట్టి ఏడుస్తూ కన్పించాడు. అంత దూరం ఎగిరిపోయి అమాంతంగా కింద పడ్డా గాయాలు కాకపోవడం విశేషం. ఇదంతా ఏదో సినిమాలో సన్నివేశంలా తోస్తోందంటూ జరిగిన భయానక ఘటనను మూర్ గుర్తు చేసుకుంది. ''హోరు వానలో జారిపోయిన భుజంతో నిలువెల్లా తడిసి చేతుల్లో మా చిన్న కొడుకుతో నా భర్త తిరిగొస్తున్న దృశ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను'' అంటూ హర్షాతిరేకాలు వెలిబుచ్చింది.

టెన్నెసీలో అంతే...

టెన్నెసీ రాష్ట్రం అమెరికాలో భారీ టోర్నడోలకు పెట్టింది పేరు. గత శనివారం గంటకు ఏకంగా 125 మైళ్ల వేగంతో కూడిన గాలులు, భారీ వర్షంతో విరుచుకుపడ్డ టోర్నడోలు పెను విధ్వంసమే సృష్టించాయి. వాటిలో ఒక టోర్నడో అయితే మాంట్‌గొమెరీ కౌంటీ నుంచి లొగాన్ కౌంటీ దాకా ఏకంగా 43 మైళ్ల దూరం ప్రయాణించింది. దారిపొడవునా సర్వాన్నీ తుడిచిపెట్టేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

నా మూడో ఇన్నింగ్స్ పక్కా!

సూరత్ డైమండ్ బోర్స్ భవన ప్రారంభంలో మోదీ

సూరత్: ప్రధానమంత్రిగా తన మూడో ఇన్నింగ్స్‌లో మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. తద్వారా తాను వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. గుజరాత్‌లోని సూరత్ నగరంలో ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య సముదాయంగా అభివృద్ధి చేసిన 'సూరత్ డైమండ్ బోర్స్' భవనాన్ని ఆయన ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాణిజ్య కేంద్రం నూతన భారతదేశ బలానికి, అంకితభావానికి ఒక ప్రతీక అని చెప్పారు. సూరత్ వజ్రాల పరిశ్రమ 8 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని ప్రశంసించారు. కొత్త వాణిజ్య సముదాయంతో మరో 1.5 లక్షల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. సూరత్ కీర్తికిరీటంలో మరో వజ్రం చేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఇది చిన్న వజ్రం కాదని, ప్రపంచంలోనే అత్యుత్తమమైన వజ్రమని వ్యాఖ్యానించారు. దీని వెలుగుజిలుగుల ముందు ప్రపంచంలోనే పెద్దపెద్ద భవనాలు కూడా వెలవెలబోతాయని అన్నారు. ప్రపంచంలో వజ్రాల పరిశ్రమ గురించి ఎవరూ మాట్లాడుకున్నా ఇకపై సూరత్‌ను ప్రస్తావించాల్సిందేనని చెప్పారు.

సూరత్ భాగస్వామ్యం పెరగాలి

వచ్చే 25 ఏళ్లలో సాధించాల్సిన లక్ష్యాలకు ప్రభుత్వం నిర్దేశించుకుందని మోదీ చెప్పారు. దేశాన్ని దాదాపు 10 ట్రిలియన్ డాలర్ల(10 లక్షల కోట్ల డాలర్లు) ఆర్థిక వ్యవస్థగా మార్చడంతోపాటు ఎగుమతుల్లో కొత్త రికార్డులు సృష్టించాలన్నదే తమ ధ్యేయమని వివరించారు. దేశం నుంచి ఎగుమతుల విషయంలో సూరత్ సిటీ భాగస్వామ్యం మరింత పెరగాలని పిలుపునిచ్చారు. వజ్రాలు, ఆభరణాల పరిశ్రమకు ఇదొక గొప్ప అవకాశమని అన్నారు.



'సూరత్ డైమండ్ బోర్స్' భవనం. (ఇన్‌సెట్లో) భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

'డైమండ్ భవన్' కథా కమామిషు...

- మొత్తం విస్తీర్ణం: 35 ఎకరాలు
- భారీ దుకాణాలు: 4,700
- ఆఫీస్ స్పేస్: 71 లక్షల చదరపు అడుగులు
- ఎలివేటర్లు: 131
- బిల్డింగ్ రేటింగ్: ప్లాటినమ్
- మొత్తం వ్యయం: రూ.3,200 కోట్లు

భారత్ వైపు ప్రపంచ దేశాల చూపు

నేడు ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఎన్నో అంశాల్లో మనపై ఆధారపడుతున్నాయని, మన దేశ పేరు ప్రతిష్టలు పెరిగాయని, మేడిన్ ఇండియా ఇప్పుడు బలమైన బ్రాండ్‌గా మారిందన్నారు. లక్షలాది మంది యువతకు సూరత్ డ్రీమ్ సిటీగా మారిందని, ఇక్కడ ఐటీ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. సూరత్ ఎయిర్‌పోర్టులో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను మోదీ ఆదివారం ప్రారంభించారు.

కాశీ తమిళ సంగమం ప్రారంభం

- కాశీ తమిళ సంగమం ఎక్స్‌ప్రెస్‌కు ప్రధాని మోదీ పచ్చజెండా
- నేడు వారణాసిలో 37 ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని నమో ఘాట్‌లో కాశీ తమిళ సంగమం రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకూ జరిగే ఈ వేడుకలో తమిళనాడు, పుదుచ్చేరి నుంచి 1,400 మంది ప్రతినిధులు పాల్గొంటారు. గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధూ, కావేరి పేరిట పలు బృందాలుగా కాశీకి తరలిరానున్నారు. వారణాసితోపాటు ప్రయాగ్‌రాజ్, అయోధ్యను వారు సందర్శిస్తారు. తమిళనాడు, కాశీ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక సంగమాన్ని మరింత బలోపేతం చేయడమే కాశీ తమిళ సంగమం ప్రధాన లక్ష్యం. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు అందులో పాలుపంచుకుంటున్నాయి. వారణాసి–కన్యాకుమారి మధ్య నడిచే కాశీ తమిళ సంగమం ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. ఆయన సోమవారం వారణాసిలో రూ.19,155 కోట్లకు పైగా విలువైన 37 అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో రోడ్లు, వంతెనలు, ఆరోగ్యం, విద్య, పోలీసు సంక్షేమం, స్మార్ట్ సిటీ, పట్టణాభివృద్ధి, రైల్వే, ఎయిర్‌పోర్టు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.

అంబులెన్స్‌కు దారిచ్చిన మోదీ కాన్వాయ్

వారణాసిలో ఆదివారం ప్రధాని మోదీ వాహన శ్రేణి ఓ అంబులెన్స్‌కు దారి ఇచ్చింది. నాదేసర్ ప్రాంతంలోని కటింగ్ మెమోరియల్ స్కూల్ వైపు మోదీ కాన్వాయ్ దూసుకెళ్తుండగా దాని వెనుకే హారన్ మోగిస్తూ అంబులెన్స్ వచ్చింది. దారి కోసం ఎదురు చూస్తోంది. అది గమనించిన మోదీ కాన్వాయ్‌లోని వాహనాలు వేగం తగ్గించుకొని కాస్త పక్కకు వెళ్లాయి. వాటిని దాటుకొని అంబులెన్స్ ముందుకెళ్లిపోయింది.



అంబులెన్స్‌కు దారిస్తున్న ప్రధాని కాన్వాయ్

21న సీడబ్ల్యూసీ కీలక భేటీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అమలుచేయాల్సిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) డిసెంబర్ 21వ తేదీన సమావేశం కానుంది. డిసెంబర్ 19వ తేదీన విపక్షాల 'ఇండియా' కూటమి భేటీ పూర్తయిన రెండు రోజులకు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరగనుంది. వివిధ రాష్ట్రాల్లో కూటమి పార్టీలతో సీట్లు పంపకం, ఎన్నికల ప్రచార వ్యూహాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. హిందీ ప్రాబల్య రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఓటమిపై సమీక్ష జరగొచ్చు. నిరుద్యోగం, పెరిగిన ధరలను ప్రధాన విమర్శనాస్త్రాలుగా తీసుకుని పశ్చిమ–ఈశాన్య భారతాల మధ్య రాహుల్‌గాంధీ మరోమారు పాదయాత్ర చేసే అంశాన్నీ చర్చించే వీలుంది.

19న ఇండియా 'కీలక' భేటీ

'ఇండియా' కూటమి విపక్ష పార్టీలు ఢిల్లీలో ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం సమావేశం కానున్నాయి. సీట్ల పంపకం, కనీస ఉమ్మడి కార్యాచరణ, సీట్ల పంపకం జరిగిన చోట్ల ఉమ్మడిగా ప్రచార ర్యాలీలు చేపట్టడం వంటి సవాళ్ల నేతలకు స్వాగతం పలకనున్నాయి. వీటిపై సమావేశంలో ఒక స్పష్టత వచ్చే వీలుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ''నేను కాదు, మనం'' అనే కొత్త నినాదంలో జనంలోకి వెళ్లాలని విపక్షాల కూటమి నిర్ణయించిన సంగతి తెల్సిందే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

నేలకొరిగిన సీఆర్‌పీఎఫ్ ఎస్సై

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల ఘటనలో సీఆర్పీఎఫ్ 165వ బెటాలియన్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి వీరమరణం పొందగా రాము అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో బద్రేలోని సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి ఉర్సంగల్ వైపు జవాన్లు కూంబింగ్ సాగిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఎస్సై సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు. సుధాకర్‌రెడ్డి సొంతూరు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు. ఈ నెలలో బస్తర్ డివిజన్‌లో మావోయిస్టుల సంబంధిత ఘటనల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారు. 13న నారాయణ్‌పూర్ జిల్లా మావోయిస్టుల దాడిలో ఒక జవాను, 14న కాంకేర్ జిల్లా నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి మరో బీఎస్ఎఫ్ జవాను ప్రాణాలు కోల్పోయారు.



పోప్ ఫ్రాన్సిస్ 88వ పడిలోకి ప్రవేశించారు. ఆదివారం తన 87వ జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాటికన్‌లో ఆయన పుట్టినరోజు కేకును రుచి చూస్తున్న బాలలు.

'సామాజిక' దూరంతో

మానసిక ఆరోగ్యం, ఉద్యోగ తృప్తి

సోషల్ మీడియా వాడకం తగ్గిస్తే ఎంతో మేలు ● అధ్యయనంలో వెల్లడైన పలు ఆసక్తికర అంశాలు

న్యూఢిల్లీ: అస్తమానం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో మునిగిపోయేకంటే కాస్తంత సేపు వాటిని పక్కనబెడితే మానసిక ఆరోగ్యంతోపాటు ఉద్యోగంలో సంతృప్తి పెరుగుతాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చి చెప్పింది. జర్మనీలోని ప్రఖ్యాత రూహర్–యూనివర్సిటీ బూచమ్, జర్మనీ మానసిక ఆరోగ్య కేంద్రం నిర్వహించిన అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సామాజిక మాధ్యమాల్లో గడిపేవారు తమ ఉద్యోగంపై దృష్టిపెట్టలేకపోతున్నారు. వీరు ఒక 30 నిమిషాలు సోషల్ మీడియా వాడకాన్ని తగ్గిస్తే మానసిక ఆర్యోగం మెరుగవడంతో పాటు వృత్తిజీవితం పట్ల సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు
- సోషల్‌మీడియాలో ఆన్‌లైన్‌లో లేనపుడు ఏదో మిస్ అవుతున్నామే అనే భావన ఈ 30 నిమిషాల దూరం తర్వాత తగ్గిందట



- ఇంతకాలం సోషల్ మీడియాలో గడుపుతూనే పని చేసిన వాళ్లు అతిగా పనిచేశామని భావించేవారట. 30 నిమిషాలు సోషల్‌మీడియా పక్కనబెడితే 'అతిపని' భావన కొంచెం తగ్గిందట
- పని మధ్యలో వదిలేసి వాట్సాప్, ఫేస్‌బుక్ చూసేవాళ్లు తిరిగి పని మీద పూర్తి ఫోకస్ చేయలేకపోతున్నారు. దీంతో పనిలో చక్కని ఫలితాలు అందుకోలేకపోతున్నారు
- రోజుకు కనీసం 35 నిమిషాలు సోషల్‌మీడియాలో గడిపేవారిపై అధ్యయనం చేశారు
- అధ్యయనంలో భాగంగా సగం మంది పాత అలవాట్లనే కొనసాగించగా, మిగతా వారిని పూర్తిగా మీడియాకు దూరంపెట్టారు
- ఒక ఏడు రోజుల తర్వాత వారి పనిభారం, ఉద్యోగంలో సంతృప్తి, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి స్థాయిలు, పని పట్ల అంకితభావం, మీడియాకు ఎందుకు అతుక్కుపోవాల్సి వస్తోంది? వంటి ప్రశ్నలడిగి విశ్లేషించారు.
- దైనందిన జీవితంలో కోల్పోయిన భావోద్వేగాలను 'సోషల్ మీడియా' ద్వారానైనా పొందేందుకు కొందరు వాటికి అతుక్కుపోయారని అధ్యయనం అభిప్రాయపడింది
- కొందరు మెరుగైన ఉద్యోగం కోసం లింక్డ్ఇన్ వంటి వేదికను ఆశ్రయించారు.
- వాస్తవిక ప్రపంచం నుంచి తప్పించుకునేందుకు కొందరు సోషల్ నెట్‌వర్క్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇవిలాగే కొనసాగితే ప్రతికూల ప్రభావం చూపుతాయని అధ్యయనం హెచ్చరించింది.

భద్రతా వైఫల్యం తీవ్రమైన అంశం

దీనిపై అనవసర వాదులాట వద్దు ● ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ: లోక్‌సభలోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి పొగపెట్టిన ఘటనను తీవ్రమైన అంశంగా ప్రధాని మోదీ ఆదివారం అభివర్ణించారు. గత బుధవారం జరిగిన ఈ ఘటనపై ఓ హిందీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తొలిసారిగా స్పందించారు. ''పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం తీవ్రమైన అంశమే. ఈ ఘటన నన్నెంతగానో బాధించింది. దీనిపై విపక్షాలు ఉభయ సభల్లో ఆందోళనలు చేస్తూ అనవసర వాదులాటకు దిగడం వ్యర్థం. ఈ చొరబాటు వెనుక ఉన్న శక్తుల గుట్టుమట్లు బయటపెడతాం. ఇవి పునరావృతం కాకుండా ఉమ్మడిగా పరిష్కారం కనుగొందాం'' అని సూచించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్లలో ముఖ్యమంత్రులైన వారు కొత్తవాళ్లు కాదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. సుప్రీంకోర్టు నేపథ్యంలో 370ను ఎవరూ ఎప్పటికీ తిరిగి అమల్లోకి తేలేరన్నారు. ''2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేయబోతోంది. ఇకనైనా విపక్ష పార్టీలు తమను ప్రజలు ఎందుకు గెలిపించట్లేదనే ఆత్మావలోకనం చేసుకుంటే మంచిది' అని సూచించారు.

ప్రధాని పారిపోతున్నారు: కాంగ్రెస్

లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై చర్చించకుండా ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. నిందితులకు లోక్‌సభలోకి పాస్‌లిచ్చింది బీజేపీ ఎంపీ కావడమే ఇందుకు కారణమని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.



కాలిన ఫోన్లు స్వాధీనం

లోక్‌సభలో కలకలం ఘటనలో నిందితుల తాలూకు కాలిన ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన సూత్రధారి లలిత్ ఝా బసచేసిన రాజస్తాన్‌లోని నాగౌర్‌లో అవి లభించాయి. వాటిని కాల్చేయడంతో సాక్ష్యాధారాల ధ్వంసం సెక్షన్లను ఎఫ్ఐఆర్‌కు జతచేశారు. ఈ ఘటనలో సాగర్ శర్మ, మనోరంజన్, అమోల్ షిండే, నీలం దేవి, లలిత్ ఝా, మహేశ్ కుమావత్‌లను అరెస్ట్ చేసి కఠిన ఉపా చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు పెట్టడం తెలిసిందే. లోక్‌సభ ఛాంబర్‌లో మనోరంజన్, సాగర్‌శర్మ, పార్లమెంట్ ప్రాంగణంలో నీలం దేవి, అమోల్ షిండే పొగ గొట్టాలు విసిరి కలకలం రేపడం తెలిసిందే. సంబంధిత వీడియోలను వైరల్ చేయాలంటూ లలిత్ తన మిత్రుడు సౌరవ్‌కు పంపాడు. తర్వాత రాజస్థాన్‌లోని నాగౌర్‌లో తమ ఫోన్లను తగలబెట్టాడు. ఢిల్లీ వచ్చి లొంగిపోయాడు.

అయోధ్యలో మసీదు నిర్మాణం..

మేలో ప్రారంభం

లక్నో: రామజన్మభూమి– బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అయోధ్యలో ప్రతిపాదిత మసీదు నిర్మాణ పనులు వచ్చే ఏడాది మేలో ప్రారంభం కానున్నాయి. అయోధ్యలోని ధన్నిపూర్‌లో మసీదు నిర్మాణ బాధ్యతలను ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ తీసుకుంది. మసీదు నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జుల నియామకాలు చేపట్టాలని ట్రస్ట్ యోచిస్తోంది. ఫిబ్రవరిలో మసీదు తుది డిజైన్‌ను ఖరారు చేసి అధికారుల ఆమోదానికి పంపుతామని ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ చీఫ్ ట్రస్టీ జుఫర్ ఫరూకీ తెలిపారు. '15 వేల చదరపు అడుగులకు బదులు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మసీదు నిర్మాణం జరగనుంది. జవాబుదారీతనం, పారదర్శకత పాటిస్తూ నిధులు సేకరిస్తాం. ప్రభుత్వమిచ్చే భూమిలో మసీదుతో పాటు ఆస్పత్రి, లైబ్రరీ, కమ్యూనిటీ కిచెన్, మ్యూజియంలను కూడా నిర్మిస్తాం. నిర్మాణ పనుల కోసం ముంబైకి చెందిన సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నాం. నిధుల లభ్యతపైనే నిర్మాణ పనుల వేగం ఆధారపడి ఉంటుంది'' అని ట్రస్ట్ సెక్రటరీ అథార్ హుస్సేన్ చెప్పారు. మధ్యప్రాచ్య మసీదుల శైలిలో రూపొందిన తొలి డిజైన్ తిరస్కరణకు గురవడం కూడా ఆలస్యానికి ఒక కారణమన్నారు. ప్రతిపాదిత మసీదు, ఇతర భవనాల డిజైన్‌ను మసీదు కమిటీ 2021లో అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీకి సమర్పించగా ఈ ఏడాది మార్చిలో అనుమతులు లభించాయి. కేంద్రం అయోధ్యలో ఐదెకరాలను యూపీ సున్నీ సెంట్రల్ వక్ఫ్‌బోర్డ్‌కు అందజేయగా, బోర్డ్ మసీదు నిర్మాణ బాధ్యతలను ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్‌కు అప్పగించింది.

అయోధ్యకు రాకండి!

స్థానిక మందిరాల్లోనే పూజలు చేయండి: నిర్వాహకులు

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగే జనవరి 22న అయోధ్యకు పోటెత్తొద్దని ఆలయ నిర్వాహకులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ''ఆ రోజు అయోధ్యలో ఊహించనంతటి రద్దీ ఉంటుంది. కనుక ఎలాగైనా కార్యక్రమాన్ని కళ్లారా చూడాలని అయోధ్య దాకా రాకండి. మీరున్న చోటే ఆలయాల్లో పూజలు చేయండి'' అని భవ్య రామమందిరం ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ విజ్ఞప్తి చేశారు. జనవరి 16వ తేదీ నుంచే వైదిక కార్యక్రమాలు మొదలవుతాయని చెప్పారు. 80 వేల మంది భక్తులకు బస, భోజన వసతి కల్పించేలా అయోధ్యలో 'టెంట్ సిటీ'ని నిర్మిస్తున్నారు.

ఆలయ పూజారుల్లో తిరుపతి పూర్వ విద్యార్థి

అయోధ్య రామాలయ పూజారిగా ఎంపికైన మోహిత్ పాండే తిరుపతిలో గతంలో వేద విద్య అభ్యసించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయంలో ఎంఏ (ఆచార్య) పట్టా సాధించారు. లక్నోలోని సీతాపూర్‌కు చెందిన మోహిత్ గాజియాబాద్‌లోని దుధేశ్వర్ వేద్ విద్యాపీఠ్‌లో ఏడేళ్ల సామవేదం అభ్యసించారు. తర్వాత వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వేద విద్యాభ్యాసం కొనసాగించారు.

'వేగంగా బెయిల్ దరఖాస్తుల పరిష్కారం'

న్యూఢిల్లీ: బెయిళ్లు, ముందస్తు బెయిళ్ల మంజూరులో జాప్యం వద్దని, వాటిపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పేర్కొంది. ఇటీవల ఓ ఫోర్జరీ కేసులో విచారణ సందర్భంగా జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్‌పై కీలక వ్యాఖ్యలు చేసింది. బెయిల్ అనేది వ్యక్తుల స్వాతంత్ర్యానికి సంబంధించి అత్యంత ముఖ్యమైన అంశమని స్పష్టం చేసింది. బెయిల్ దరఖాస్తులను లిస్టింగ్ చేయడంలో, వాటిని ఆమోదించడం లేదా తిరస్కరించడంలో జాప్యం జరిగితే అది వ్యక్తుల స్వేచ్ఛను హరించినట్టే అవుతుందని స్పష్టం చేసింది.

'మధ్యధరా'లో పడవ మునిగి 60 మంది మృతి

కైరో: మధ్యధరా సముద్రంలో పడవ మునిగి 60 మందికి పైగా వలసదారులు దుర్మరణం పాలయ్యారు. యూరప్‌కు బయల్దేరిన ఈ పడవ లిబియా తీర ప్రాంతంలో బోల్తాపడింది. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువని ఐరాస వలసల విభాగం ఆదివారం వెల్లడించింది. ఈ మార్గంలో కిక్కిరిసిన అక్రమ పడవల్లో ప్రయాణిస్తూ వేలాది మంది నిర్భాగ్యులు పడవ ప్రమాదాలకు బలయ్యారు. ఈ ఏడాదే 2,250 మంది మరణించారని ఐరాస తెలిపింది.

ఇంకా లింగ వివక్ష: సీజేఐ



బెంగళూరు: ప్రాంతీయ భేదాలకు అతీతంగా చాలా కుటుంబాల్లో నేటికీ లింగ వివక్ష సూక్ష్మ రూపంలో కొనసాగుతూనే ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు. పైగా వాటిని ఎవరూ ప్రశ్నించరాదన్న ధోరణి కూడా గూడుకట్టుకుని పోయిందని ఆక్షేపించారు. ''ఎవరు ఔనన్నా, కాదన్నా చేదు నిజం మాత్రం ఇదే. పైగా న్యాయస్థానాలు వ్యక్తిగత స్వేచ్ఛ కంటే వివాహ వ్యవస్థను నిలబెట్టడానికే ప్రాధాన్యతనిస్తూ రావడం ద్వారా దీనికి కొంతవరకు పరోక్షంగా ఆమోదముద్ర వేశాయి'' అని అభిప్రాయపడ్డారు. ఆదివారం బెంగళూరులో ఆయన జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య శతాబ్ది స్మారక ప్రసంగం చేశారు. సంతానంలో ఒకరికి మించి పై చదువులు చదివించలేకపోతే అత్యధిక కుటుంబాల్లో ఆ అవకాశం కచ్చితంగా మగ సంతానానికే దక్కుతుంది. స్త్రీకి ఉండే ఆంక్షలు, ఒత్తిళ్లు మగవాడికి ఉండవన్నది కూడా వాస్తవం'' అని సీజేఐ అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



గతేడాది బెంగళూరు బ్రిగేడ్ రోడ్డులో కొత్త సంవత్సర వేడుకలు (ఫైల్)

న్యూస్‌రీల్



ఆదివారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో దివంగత నటుడు విష్ణువర్ధన్ అభిమానుల ధర్నా. నగరంలో విష్ణు స్మారకం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు

అడవిలో దారితప్పి తిప్పలు



క్షేమంగా బయటపడిన యువతులు

దొడ్డబళ్లాపురం: ట్రెక్కింగ్ టూర్‌కి వచ్చిన ఆరు మంది యువతులు దారితప్పిన సంఘటన రామనగరలోని హందిగొంది కొండలో చోటుచేసుకుంది. శనివారంనాడు బెంగళూరు నుండి వచ్చిన ఆరుమంది యువతులు హందిగొంది కొండపైకి ఎక్కసాగారు. అయితే మధ్యలో దారి తెలియక అడవిలో దిక్కుతోచకుండా రాత్రి వరకూ తిరిగారు. చివరకు ఒకచోట మొబైల్‌ఫోన్ సిగ్నల్ రావడంతో 112కు కాల్ చేసి కాపాడమని కోరారు.

పోలీసులు స్థానికులను తీసుకుని అడవిలో గాలింపు జరిపి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. హందిగొంది కొండమీద అడవి జంతువులు విరివిగా తిరుగుతుంటాయి. అందులోనూ చీకటి పడిందంటే మరింత ప్రమాదం. యువతులకు ఏం జరుగుతుందో అని అందరూ ఆందోళన చెందారు. చివరకు క్షేమంగా రావడంతో వారిని బెంగళూరుకు పంపించారు.

మైసూరు జిల్లాలో కోవిడ్ అలర్ట్

మైసూరు: మైసూరు, దక్షిణ కన్నడ తదితర జిల్లాలను ఆనుకుని ఉన్న కేరళ రాష్ట్రంలో కోవిడ్‌లో కొత్తరకం జేఎన్ 1 వేరియంట్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఒక మరణం కూడా సంభవించింది, కాబట్టి జిల్లాలో హై అలర్ట్‌ను ప్రకటించినట్లు జిల్లా ఆరోగ్యాధికారి పిసి కుమారస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడారు. కోవిడ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కేరళలో కొత్త కోవిడ్ కేసులు పెరిగితే సరిహద్దుల్లోని బావలి చెక్ పోస్ట్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలోని హెచ్‌డి కోటె ప్రాంతంలో నివారణ చర్యలు చేపట్టారన్నారు. అన్నిచోట్లా మాక్ డ్రిల్ నిర్వహిస్తారని, జిల్లాలో ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని, దగ్గు, జలుబు, జ్వరం ఉన్నా అశ్రద్ధ చేయరాదని సూచించారు.

ఇంట్లో గ్యాస్ పేలుడు... 7 మందికి గాయాలు



పేలుడు వల్ల బీటలు వారిన గోడలు

యశవంతపుర: ఇంటిలో వంటగ్యాస్ సిలిండర్ పేలి ఒకే కుటుంబానికి చెందిన ఏడు మంది గాయపడ్డారు. బెళగావి జిల్లా గోకాక్ తాలూకా అక్కతంగేరిహళ గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఘటనలో 9 నెలల చిన్నారి బసనగౌడతో పాటు రాజశ్రీ, అశోక, సోమనగౌడ, దీపా, చిన్నారులు నవీన, విద్యకు కాలిన గాయాలయ్యాయి. వారు బెళగావిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. సిలిండర్ నుంచి లీకై మంటలు వ్యాపించి సిలిండర్ పేలిపోయింది. దీంతో నిద్రిస్తున్న అందరూ మంటల్లో చిక్కుకున్నారు. చుట్టుపక్కలవారు మంటలను ఆర్పడానికి ఎంతో శ్రమించారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు చీలిపోయాయి, సామగ్రి ధ్వంసమైంది.

నాడప్రభుపై చేతన్ హేళన పోస్టు

యశవంతపుర: బెంగళూరు నగర నిర్మాత, నాడ ప్రభు కెంపేగౌడపై అవహేళనంగా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన ఆరోపణలతో నటుడు, సామాజిక కార్యకర్త చేతన్ అహింస పై నగరంలోని శేషాద్రిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కెంపేగౌడ ఒక జాతితో లాబీ చేయడం వల్ల కర్ణాటకకు ఐకాన్ అయ్యారు. అత్యల్ప చరిత్ర వ్యక్తి.. ఒక చరిత్ర ఉన్న టిప్పుసుల్తాన్ గుర్తింపునకు అడ్డు పడుతున్నారంటూ చేతన్ పెట్టిన పోస్ట్ వివాదంగా మారింది. ఆయన పోస్టును అనేకమంది వ్యతిరేకించగా కొందరు సమర్థించారు.

సిగ్నల్ జంప్.. మెసేజ్ పంపు

- ట్రాఫిక్ ఉల్లంఘించే టెక్కీలు, ప్రైవేటు ఉద్యోగులపై కంపెనీలకు ఫిర్యాదు
- బెంగళూరు తూర్పు విభాగంలో ప్రయోగాత్మకంగా అమలు
- అతిక్రమణల కట్టడికి పథకం





బెంగళూరులో బైకర్లు, ఇక నుంచి ఇష్టానుసారం రైడింగ్ కుదరదు

బనశంకరి: ఉద్యోగి మీద పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటే కొంత భయపడతారు. అదే మాదిరిగా ట్రాఫిక్ పోలీసులు ఆలోచించారు. రాజధానిలో ఇకపై టెక్కీలు మాత్రమే కాదు ప్రైవేటు కంపెనీల ఉద్యోగులు అతివేగం, సిగ్నల్ జంప్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే ఆ సమాచారం వారు పనిచేసే కంపెనీలకు వెళ్తుంది. ఈ కొత్త విధానాన్ని బెంగళూరు తూర్పు విభాగంలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అమల్లోకి తీసుకువచ్చారు. ఇక్కడ విజయవంతమైతే నగరవ్యాప్తంగా విస్తరించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ఇ-మెయిల్ లేదా ఫోన్ ద్వారా

నగర తూర్పు విభాగంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎక్కువగా ఉండగా అక్కడ ఉద్యోగులు అధికంగా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. కార్యాలయానికి వెళ్లాలనే తొందరలో ఇష్టానుసారం బైక్‌లు, కార్లను నడుపుతూ ఇతరులకూ ఇబ్బంది కలిగిస్తుంటారు. అలాంటి వాహనదారుల సమాచారాన్ని వారు పనిచేస్తున్న కంపెనీకి ఈ-మెయిల్ లేదా ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. మీ ఉద్యోగులు ట్రాఫిక్ రూల్స్‌ని పాటించాలని సూచిస్తారు. అవసరమైతే ఆయా కంపెనీల సిబ్బందికి ట్రాఫిక్ భద్రతపై పోలీసులు జాగృతి సమావేశాలు కూడా నిర్వహిస్తామని ట్రాఫిక్ విభాగం డీసీపీ కులదీప్‌కుమార్‌జైన్ తెలిపారు.

ఉల్లంఘనలు అనేకం



హై బీమ్ లైట్లను వాహనాలకు అమర్చడం, నిషేధిత ప్రాంతాల్లో హార్న్ కొట్టడం, సైలెన్సర్లు మార్చడం, ఫుట్‌పాత్‌లపై డ్రైవింగ్, రిజిస్ట్రేషన్, డీఎల్ లేకపోవడం, ట్రిబుల్ రైడింగ్, తాగి నడపడం, అతివేగం, హెల్మెట్ లేదా సీటు బెల్టు లేకపోవడం, అక్రమ పార్కింగ్ ఇలాంటి అనేక అతిక్రమణలపై కంపెనీలకు సమాచారం పంపుతారు. సీసీ కెమెరాల్లో చిక్కే బండి నంబరు ఆధారంగా యజమానిని గుర్తించి, వారు ఎక్కడ పనిచేస్తారో కనుక్కుని సమాచారం ఇస్తారు. ఆటో డ్రైవర్లపై కూడా నిఘా వేస్తారు. అధిక చార్జీ, బాడుగకు పిలిచినా రాకపోవడం, డిస్‌ప్లే కార్డు లేకపోవడం తదితరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు.

సిరిధాన్య నడక



సిరిధాన్య నడకలో నటి సప్తమి గౌడ, నగరవాసులు

శివాజీనగర: వ్యవసాయ శాఖ త్వరలో బెంగళూరులో నిర్వహించే సేంద్రియ, సిరిధాన్యాల అంతర్జాతీయ వాణిజ్య మేళా ప్రచారంలో భాగంగా ఆదివారం బెంగళూరు కబ్బన్‌పార్క్‌లో వాకథాన్ జరిగింది. సినీ నటి సప్తమి గౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నడ పాటలకు సందర్శకులు చిందులేశారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరిగిన తరుణంలో సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ వస్తోంది. పిల్లలకు ఆరంభం నుండే సిరిధాన్యాల ఆహార ఉత్పత్తులను ఇవ్వటం ద్వారా రుచి చూపించాలని ఆమె తెలిపారు.

కారు- ఆర్టీసీ బస్సు ఢీ

- కారులోని ఐదుమందికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

మండ్య: మండ్య జిల్లాలోని మద్దూరు తాలూకాలో కేఎస్ ఆర్‌టిసీ బస్సు- కారును ఢీకొన్న ప్రమాదంలో నెలమంగళకు చెందిన కారు డ్రైవర్‌తో పాటు ఐదుమంది తీవ్రంగా గాయపడ్డారు. మద్దూరు పట్టణంలోని కేఎస్‌ఆర్‌టీసీ డిపో వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. బెంగళూరు రూరల్ నెలమంగళకు చెందిన ప్రతాప్ (30), మహేష్ (40), కెంపరాజు (27), అరుణ (27), ప్రకాశ్ (37) అనేవారు మళవళ్లికి కారులో బయల్దేరారు. ఘటనాస్థలం వద్ద రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. బాధితులను మద్దూరు, మండ్య ఆస్పత్రులకు తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మద్దూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సులో ఎవరికీ ఏమీ కాలేదు.



బెంగళూరులోని ఓ మాల్‌లో అలరిస్తున్న బృహత్ క్రిస్మస్ చెట్టు. చిత్రంలో శాంటాక్లాజ్ తాత, మోడల్ భామలు

సీఐడీకి వంటమురి దాడి కేసు

బనశంకరి: బెళగావి జిల్లా వంటమురి గ్రామంలో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. పెద్ద ఎత్తున గగ్గోలు రేగడంతో పాటు జాతీయ మహిళా, మానవ హక్కుల కమిషన్లు, హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. దీంతో సత్వర విచారణకు సీఐడీకి అప్పగించింది. ఈ ఘటనలో బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుందని, కానీ బీజేపీ రాజకీయం చేస్తోందని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ఆరోపించారు. ఆదివారం బెంగళూరు ఎగ్జిబిషన్ సెంటర్‌లో డీకే మాట్లాడారు. బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని, ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నప్పటికీ కఠినచర్యలు తీసుకుంటామని, మహిళల భద్రత కు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

చిరుత పట్టివేత



మైసూరు: మైసూరు జిల్లా టి. నరిసిపుర తాలూకాలోని కేతుపురలో ఉక్కలగెరె మల్లికార్జున స్వామి కొండ వద్ద చిరుతపులి చిక్కింది. ఇటీవల నింగెగౌడ అనే వ్యక్తి కొండ వద్ద పశువులను మేపుతున్న సమయంలో చిరుత దాడి చేసి ఆవును చంపి భక్షించింది. గ్రామస్తుల ఫిర్యాదుతో అటవీ అధికారులు కొండ చుట్టుపక్కల బోనులు పెట్టారు. ఆదివారం సుమారు 4 సంవత్సరాల వయసు ఉన్న మగ చిరుత ఒక బోనులోకి పడింది. అటవీ సిబ్బంది చిరుతను తరలించారు.

ఎముకల షెడ్డు వైరల్



షెడ్డులో ఎముకల గుట్ట

మండ్య: మండ్య జిల్లాను ఆడశిశు భ్రూణహత్యల ఉదంతం కుదిపేస్తోంది. వందలాది మంది గర్భిణులకు అక్రమంగా అబార్షన్లు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక షెడ్డులో శిశువుల ఎముకలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. మండ్య తాలూకాలోని తూబినకెరె గ్రామం వద్ద లింగరాజు అనే వ్యక్తి పొలం వద్ద కొందరు వ్యక్తులు కబేళాల నుంచి పశువుల ఎముకలను తెచ్చి వాటిని ఎండబెట్టి పొడి చేసి కంపెనీలకు అమ్ముతారు. కొన్నిరోజులుగా ఆ షెడ్డులో నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. జంతువుల ఎముకలతో పాటు అబార్షన్లు చేసిన శిశువుల మృతదేహాల ఎముకలను ఇక్కడ నిల్వ చేసి ఉంటారని ప్రచారం మొదలైంది. ఆ షెడ్డు వీడియోలో వైరల్‌గా మారాయి.

అర్ధరాత్రి 1 గంట వరకూ న్యూ ఇయర్

- నగరంలో కొత్త ఏడాది సంబరాల మార్గదర్శకాల జారీ

బనశంకరి: కొత్త ఏడాది అంటే ఐటీ సిటీలో ఉత్సవ వాతావరణం నెలకొంటుంది. డిసెంబరు ఆఖరి రోజు సాయంత్రం నుంచి జనవరి 1వ తేదీ తెల్లవారేవరకూ రోడ్లు, కూడళ్లలో నగరవాసులు మజా చేస్తారు. ఈ నేపథ్యంలో రాబోయే నూతన సంవత్సర సంబరాలపై బీబీఎంపీ, పోలీస్‌శాఖ మార్గదర్శకాలను విడుదల చేశాయి.

- 31వ తేదీ అర్ధరాత్రి 1 గంటలోగా న్యూ ఇయర్ వేడుకలను ముగించాలి.
- బెంగళూరు ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, ఇందిరా నగరలో న్యూ ఇయర్ సంబరాలకు అనుమతి ఉంది.
- ఆ రోజు రాత్రి 10 గంటల అనంతరం 31 తేదీ రాత్రి నగరంలోని ప్రముఖ ఫ్లై ఓవర్లు బంద్.
- ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డులో 200 కు పైగా సీసీటీవీ అమర్చడంతో ఎలాంటి అసాంఘిక ఘటనలు జరగకుండా నియంత్రణ. రాత్రి 8 గంటల నుంచి ఈ రోడ్లలో వాహన సంచారం నిషేధం
- సంబరాలకు వచ్చేవారికి ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థ. మహిళల భద్రత కోసం భారీగా మహిళా పోలీసుల మోహరింపు
- అర్ధరాత్రి 1 గంట తరువాత బార్, పబ్‌లను మూసివేయాలి
- సామూహిక న్యూ ఇయర్ విందు వినోదాలకు అనుమతి తప్పనిసరి
- లౌడ్ స్పీకర్లు, టపాసుల కాల్చడంపై ఆంక్షలు
- రాత్రి 1 గంట వరకు మెట్రో రైలు, సిటీ బస్సుల సంచారం.



ఆదివారం మంగళూరు దగ్గర మూడబిద్రిలో జరిగిన కంబళ పోటీల్లో దూసుకెళ్తున్న దున్నలు

కొత్త ఏడాది మత్తుకు చెక్

- కట్టుదిట్టంగా నిఘా వేయాలి
- బెంగళూరు పోలీస్ కమిషనర్



బనశంకరి: నూతన సంవత్సర సంబరాలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుండగా రాజధాని బెంగళూరులో డ్రగ్స్ వినియోగం కూడా భారీగా పెరిగే ప్రమాదముంది, ఈ నేపథ్యంలో అడ్డుకట్టకు చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. డ్రగ్స్ దందాలో నిమగ్నమైన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలి. పార్టీలు జరిగే ప్రదేశాలపై కన్నేసి ఉంచాలి, ఇటీవల జైలు నుంచి విడుదలైన డ్రగ్స్ దందాదారులపైనా దృష్టి సారించాలని పోలీసులకు ఆదేశించారు. ఇటీవల సుమారు 180 మంది విడుదల కాగా, చాలామంది మళ్లీ మాదకద్రవ్యాల సరఫరాలో నిమగ్నమైనట్లు సమాచారం ఉందని అన్నారు. అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాలని తెలిపారు. రిసార్ట్స్, రేవ్‌పార్టీలు జరిగేప్రదేశాలు, ఫాంహౌస్‌లు, స్టార్ హోటల్స్, పబ్స్‌బార్లు యజమానులను పిలిపించి హెచ్చరించాలని తెలిపారు.

బడా పెడ్లర్‌కు నటీనటులతో లింకులు

యశవంతపుర: కన్నడ సినిమా రంగంపై మళ్లీ డ్రగ్స్ ఆరోపణలు వస్తున్నాయి. మూడేళ్ల క్రితం కొందరు నటీనటులను విచారించి అరెస్టు చేయడం తెలిసిందే. ఇటీవల సీసీబీ పోలీసులు విదేశీ డ్రగ్స్ వ్యాపారిని అరెస్టు చేసి విచారించగా, కొంతమంది నటీనటులతో అతడు సంప్రదించినట్లు విచారణలో బయటపడింది. కొత్త ఏడాదికి బెంగళూరుకు విదేశీ డ్రగ్స్ చేరినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇటీవల రామమూర్తి నగర పరిధిలో ఆఫ్రికాకు చెందిన బడా పెడ్లర్ లియోనార్డ్ ఒక్పుడిలి(44)ని అరెస్ట్ చేసి విచారించగా, కొందరు శాండల్‌వుడ్ నటీనటులను కలిసినట్లు మొబైల్‌ఫోన్లో ఆధారాలు లభించాయి. దీంతో డ్రగ్స్ కేసు బిగుసుకునే అవకాశముంది.

విహారయాత్రలో అపశ్రుతి



రోడ్డు పక్కన పడిపోయిన బస్సు

- బస్సు బోల్తా పడి 16 మంది విద్యార్థులకు గాయాలు



ధ్వంసమైన బస్సు

తుమకూరు: పర్యాటక ప్రాంతాలను చూడడానికి వస్తున్న పాఠశాల బస్సు పల్టీ కొట్టిన ప్రమాదంలో 16 మంది విద్యార్థులు గాయాల పాలైన సంఘటన తుమకూరు జిల్లాలోని శిర తాలూకాలోని మానంగి గ్రామం వద్ద జరిగింది. బీదర్ జిల్లా బాల్కి పట్టణంలోని చెన్నబసవేశ్వర పియు కళాశాల విద్యార్థులు టూర్ కోసం బయల్దేరారు. చిత్రదుర్గ, హిరియూరు మార్గంలో జాతీయ రహదారిలో తుమకూరు వైపు వస్తుండగా అతి వేగం వల్ల అదుపు తప్పి పల్టీలు కొట్టింది. రోడ్డుపక్కనున్న డ్రైనేజీలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 16 మంది విద్యార్థినీ విద్యార్థులు గాయపడగా వారిని శిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొందరిని మెరుగైన చికిత్స కోసం తుమకూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. శిర పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎన్నటికీ హిందూ దేశం కాదు

- సీఎం సిద్దరామయ్య

సాక్షి, బళ్లారి: భారత దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు ఎన్నటికీ సాధ్యపడదని, ఇక్కడ అన్ని మతాలకు చెందిన వారు ఎంతో సఖ్యతతో జీవనం సాగిస్తున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. ఆయన ఆదివారం గదగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ హిందూ దేశంగా అవతరించాలన్న ఉడుపి మఠం విశ్వ ప్రసన్న తీర్థ స్వామిజీ వ్యాఖ్యలపై స్పందించారు. మన దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు తదితర అన్ని మతాల వారు జీవిస్తున్నారు, 1950లో జనసంఘ్ ప్రారంభించి దేశాన్ని హిందూ దేశంగా మారుస్తామని చెప్పారు, బీజేపీ నేతలు ప్రజలను మోసగించేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని ఆయన విమర్శించారు.

హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

గదగ్ పర్యటనకు వచ్చిన సీఎం సిద్దరామయ్య హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. హెలికాప్టర్ ల్యాండ్ కాలేక చాలాసేపు గాలిలో రౌండ్లు కొట్టింది. తరువాత పైలట్ చాకచక్యంతో హెలికాప్టర్‌ను నేలకు దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రాయచూరు రూరల్: తాలుకాలోని రాజోళ్లిలో ఆంజనేయస్వామి జాతర రథోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాయచూరు రూరల్ శాసన సభ్యుడు బసన గౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లిఖార్జున గౌడ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రార్థనలు



చద్దర్ తీసుకెళ్తున్న అబ్దుల్ లతీఫ్ తదితరులు

బనశంకరి:2024 ఎన్నికల్లో ఏపీలో మరోమారు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని కోరుతూ హెబ్బగోడికి చెందిన ఆ పార్టీ నాయకుడు, వీ.కోట మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌లతీఫ్ రాజస్తాన్‌లోని అజ్మీర్‌దర్గాలో చద్దర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేసి అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడ్డారని ఆయన తెలిపారు. జగనన్న మళ్లీ సీఎంగా ఎన్నిక కావాలని దర్గాలో ప్రార్థన చేసినట్లు తెలిపారు. మైనార్టీ నేతలు మునావర్, ఖలీఫ్, జబీ, జాకీర్, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన పూజలు



సిరుగుప్ప: పట్టణంలోని శ్రీనివాస, ఆంజనేయ, శనేశ్వర ఆలయంలో శ్రీమధ్వాచార్యుల మూల మహాసంస్థానం శ్రీ రాజేంద్ర తీర్థ పూర్వ దిమఠంలో సోసలె శ్రీ వ్యాసరాజ మఠానికి చెందిన శ్రీవిద్యామనోహర తీర్థులు సంస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థులు తన ఆశీర్వాద వచనాలు తెలియ జేస్తూ, ధర్మం, ఆచారాలను మరవకూడదన్నారు.

విగ్రహం దిమ్మె నేలమట్టంపై ధర్నా



ఆందోళన చేస్తున్న ఎస్.నాగరాజు, స్థానికులు

బనశంకరి: జయనగర నాలుగో బ్లాక్ బైర సంద్రవార్డు తిలక్‌నగరలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెను నేలమట్టం చేయడంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. దిమ్మెను కూలగొట్టడాన్ని నిరసిస్తూ బీబీఎంపీ మాజీ పాలనా విభాగం నేత నాగరాజు ఆదివారం ధర్నా నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహాన్ని జనవరి 1న ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేసుకోగా బీబీఎంపీ అధికారులు ఎమ్మెల్యే సీకే.రామమూర్తితో కుమ్మక్కై, విగ్రహ దిమ్మెను కూలగొట్టారని ఆరోపించారు. విగ్రహం ఏర్పాటు చేసేవరకూ తమ ఆందోళన ఆగదన్నారు.

విద్యుత్ తీగ తెగి వ్యక్తికి గాయాలు

యశవంతపుర: బెంగళూరు నందిని లేఔట్‌లో ఈనెల 8న సెల్‌ఫోన్ టవర్ కూలిన ఘటనలో ఓ వ్యక్తిపై కరెంట్ తీగపడి గాయపడ్డాడు. టవర్ కూలిన సమయంలో శకలాలు విద్యుత్ స్తంభంపై పడగా వైర్ తెగి అదే ప్రాంతంలో వెళ్తున్న వ్యక్తిపై పడ్డాయి. దీంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

సమసమాజ నిర్మాణం జరగాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న నటుడు చేతన్

మండ్య : అంటరానితనం, మూఢనమ్మకాలను వీడి సమసమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నటుడు చేతన్ పేర్కొన్నారు. భీమరావ్ ఫౌండేషన్ జిల్లా శాఖ నగరంలోని కృష్ణాకాం ప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎంబీఆర్‌ఎఫ్ నీట్ అకాడమిని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బుద్ధుడు, బసవ, అంబేడ్కర్, పెరియార్, నాల్వడి, కువెంపు సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. సినీ నటులు, క్రికెటర్లు, ధనవంతులు, వ్యాపారవేత్తలు స్టార్లు కాదని, సమాజానికి మంచి చేసేవారు అసలైన స్టార్లు అని అన్నారు.

అంజూర సాగుతో లాభాలు

- కరువును అధిగమించిన యువరైతు
- 25 ఎకరాల్లో పంట
- ఎకరాకు రూ. 50 వేల ఆదాయం
- తక్కువ నీటితో మేలిమి సాగు



తోటలో అంజూర మొక్కలను నాటుతున్న దృశ్యం



అంజూర మొక్కలు

సాక్షి బళ్లారి: ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతులు ఏదో రకంగా ఏటా పంట నష్టపోతూనే ఉన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు పంటలకు తెగుళ్ల వంటి కారణాలతో వారికి కన్నీరే మిగులుతోంది. వరుణుడు కరుణ చూపకపోవడం, దిగుబడులు రాక పెట్టుబడులు కూడా కోల్పోవాల్సి వస్తోంది. ఇటువంటి తరుణంలో ఓ యువరైతు వ్యాపారం, ఇతర రంగాలలో పనిచేసి అందులో ఎటువంటి సంతృప్తి లేకపోవడంతో వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో స్థిరపడిన రైతు రవి తనకు సొంత **భూమి లేక** పోయినా కౌలుకు ఆయకట్టు **భూము**లను తీసుకుని అందులో అంజూ**రు** తోటను సాగు చేసి లాభాలను ఆర్జిస్తున్నాడు.



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని..:

ఏటా తుంగభద్ర ఆయకట్టుతో పాటు వర్షాధారిత భూముల్లో, పండ్ల తోటలను సాగు చేసి**న** రైతులు కూడా తీవ్రంగా నష్టపో**తు**న్నారు. అంజూర పండ్లకు అధిక **డిమాం**డ్, రోగాలు కూడా తక్కువగా రా**వడంతో అం**జూర రైతులు ఎందరో కష్టాల నుంచి బయటపడుతున్నారు. ఇందులో భాగంగానే రవి అనే యువరైతు ముందుగా కురుగోడు తాలూకా **ముష్టిగట్టి** గ్రామంలో 10 **ఎకరాలు** కౌలుకు **తీసు**కుని అంజూర **సా**గు చేసి లాభా**ల**ను గడిస్తున్నారు. **ప్ర**స్తుతం 25 **ఎ**కరాల్లో అంజూ**ర**ను సాగు చేసి **ఖ**ర్చులకు పోను **లక్ష**లాది రూపా**యలు** గడిస్తున్నారు. **ఈసారి** వర్షాలు సరిగా **లేనందున,** అంజూర పంట కూడా దెబ్బతింది. దీంతో కిలో కిలో అంజూర రూ.100లకు పైగా ధర పలుకుతోంది. ప్రస్తుతం కురుగోడు తాలూకాలో 25 ఎకరాల్లో సాగు చేసిన రవి ఎకరంలో 100 నుంచి 150 బాక్స్‌లు అంజూరు పండ్లను పండించేందుకు సాధ్యం కావడంతో రైతుకు అధిక లాభాలను తెచ్చిపెడుతున్నాయి.

ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసే ఈ పండుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అంజూర సాగుతో కరువులోను ముష్టిగట్టి గ్రామానికి చెందిన రవి కురుగోడు తాలూకాలతో పాటు జిల్లాలో విస్తారంగా సాగు చేసిన అంజూర రైతులందరూ అంతో ఇంతో ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సాధ్యమైంది. బళ్లారి జిల్లాతో పాటు కర్ణాటకలోని వివిధ జిల్లాలు, పొరుగు ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి అంజూరు పండ్లను కొనుగోలు చేస్తుండటంతో డిమాండ్ అంతకంతకు పెరుగుతోంది.



యువ రైతు రవి



చెట్టుకు అంజూర పండ్లు



ఆకట్టుకున్న చిన్నారుల సంత

కోలారు : నగరంలోని కారంజి కట్టలోని ఎంఇఎస్ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించిన పిల్లల సంత కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడిన సీనియర్ న్యాయవాది సతీష్ విద్యార్థులు విద్యతో పాటు వ్యవహార జ్ఞానాన్ని కూడా పెంచుకోవాలని, దీనికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నివృత్త ఏఎస్‌ఐ రవి, ఎస్ ఫల్గుణ, మంజునాథ్ శివకుమార్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో చలి తీవ్రత పెరుగుతోంది. చలి బారి నుంచి కాపాడుకోవడానికి ప్రజలు స్వెటర్లను కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం నగరంలోని మల్లేశ్వరంలో రోడ్డుపై స్వెటర్లు విక్రయిస్తున్న దృశ్యం

వంచన కేసులో ఏడుగురికి ఏడాది జైలు

హుబ్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా బెళగావి జిల్లా సహపుర శాఖలో జరిగిన రుణ కుంభకోణం కేసుకు సంబంధించి ధార్వాడ సీబీఐ ప్రత్యేక కోర్టు ఏడుగురికి ఏడాది జైలుతో పాటు రూ. 1.60 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ఆ బ్యాంక్ మేనేజర్ బీవీ నర్వేకర్, పూనం ట్రేడింగ్ కంపెనీ డైరెక్టర్ ఆనంద్ శేషు ఆ కంపెనీ ఉద్యోగి ఎస్.ఆదినారాయణతో పాటు దేవరాజ, హేమలత దంపతుల శిక్షకు గురైన వారు. వీరు 2001లో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బీవీ నార్వేకర్, డిజోయ్ చేతన్, పునాల చేతన్ తదితరులు పూనం ట్రేడింగ్ కంపెనీ పేరుతో బెంగళూరులో దుస్తుల వ్యాపారం కోసం రూ.75 లక్షల రుణం తీసుకున్నారు. అయితే ఎటువంటి వ్యాపారం చేయకుండా మోసం చేశారు. ఆ కంపెనీ సీఏ ఆదినారాయణ, డైరెక్టర్ ఆనంద్ తప్పుడు పత్రాలు బ్యాంకుకు సమర్పించారు. ఈ రుణానికి బెంగళూరు నివాసులైన దేవరాజ్, హేమలత ఇచ్చిన ల్యాండ్ రికార్డులు నకిలీవిగా తేలుస్తూ సీబీఐ చార్జ్‌షీట్ వేసింది. కీలక నిందితులైన డిజోయి చేతన్, పునాల చేతన్ జాంబియా దేశానికి పరారయ్యారు. వీరిపై లుకౌట్ నోటీసులు ఇచ్చారు. ఆ మేరకు డిజోయి చేతన్, పునాల చేతన్ దంపతులు నేరం చేసి విదేశాలకు పారిపోయినందున ధార్వాడ ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి సుబ్రమణ్య 23 ఏళ్ల తరువాత తీర్పు వెలువరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నగరంలోని విద్యానగర కళాశాల వెనుక భాగంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాగలకోట జిల్లా జమకండి తాలూకా గోటెగ్రామకు చెందిన రాజు పాటిల్‌గా గుర్తించారు.

బైక్ షోరూంలో భారీ అగ్నిప్రమాదం



షోరూమ్ ముందు గుమికూడిన స్థానికులు

శివమొగ్గ : శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి పట్టణంలోని బైక్ షోరూమ్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగి ఏడు బైక్‌లు దగ్ధమయ్యాయి. లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. అగుంబె బస్టాండ్ వద్ద ఉన్న షోరూమ్ నుంచి మంటలు, పొగ రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు ఆర్పేందుకు శ్రమించారు. అయితే అప్పటికే ఏడు బైక్‌లు, కంప్యూటర్లు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. మరో 20 బైకులు చాలా వరకు కాలిపోయాయి.

రాజీనామా చేయాలనడం తగదు

మైసూరు : పార్లమెంట్‌లో చోటు చేసుకున్న పొగబాంబు ఘటనపై ఎంపీ ప్రతాప్ సింహను రాజీనామా చేయాలని డిమండ్ చేయడం తగదని జేడీఎస్ కోర్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీ.టి. దెవెగౌడ అన్నారు. ఆదివారం ఆయన మైసూరులో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో భద్రతావైఫల్యంపై సంబంధిత అధికారులపై, పార్లమెంట్‌లో అలజడి సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి తప్ప ఎంపీ ప్రతాప్‌సింహను రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం తగదన్నారు. పార్లమెంట్ సమావేశాలను వీక్షించేందుకు ఎంపీలు పాస్‌లు మంజూరు చేయడం సహజమేనన్నారు. అదేవిధంగా ఎంపీ కార్యాలయం నుంచి పాస్‌లు మంజూరై ఉంటాయన్నారు.

వేతనాలు అందక వెతలు

కంప్లి: తోరణగల్లు సమీపంలోని బళ్లారి విద్యుత్ ఉత్పాదన కేంద్రం ఆవరణలో ఉన్న అగ్నిమాపక శాఖలో41 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ. 12 వేల జీతం, కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన అధ్యక్షురాలిగా పుష్పలత

కంప్లి: కొట్టూరు తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారుల క్షేమాభివృద్ధి సంఘం నూతన అధ్యక్షురాలిగా పుష్పలతను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులు కే.మరుతేష్, కోశాధికారిగా హెచ్‌ఎం గంగాధర స్వామిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో పీడీఓలు మాట్లాడుతూ..తమ గళం వినిపించేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయడం శ్లాఘనీయమన్నారు.

కుడితినిలో తాగునీటి ఎద్దడి

కంప్లి: కుడితిని పట్టణంలో 20 రోజులుగా తాగునీటి సమస్యతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ పంచాయతీ అధికారులు తాగునీటి సమస్య నివారణకు కృషి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. 5, 6 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు హాలప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

బళ్లారి అర్బన్: వాహనాలు నడిపే డ్రైవర్లు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. పోలీస్ శాఖ, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బళ్లారి డ్రైవర్లకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక డీఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే సురక్ష ప్రయాణం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్లు, ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపకూడదన్నారు. ఈ



సందర్భంగా పలువురు డ్రైవర్లకు కంటి పరీక్షలు, చెవి, గుండె పరీక్షలు నిర్వహించారు. సిటీ డీవైఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, డీఏఆర్ డిఎస్పీ తిప్పేస్వామి, సీఐ ఐయన్నగౌడ పాటిల్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సురేష్, ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీప్రియా, కంటి వైద్యుడు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో బంగారం పట్టివేత

యశవంతపుర: మంగళూరు విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు 17.73 లక్షల విలువైన 286 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇండిగో విమానంలో దుబై నుంచి వచ్చిన ప్రయాణికుడి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో తనిఖీ చేశారు. ప్యాంట్‌లో బంగారం కనిపించడంతో స్వాధీనం చేసుకొని ప్రయాణికుడిని అరెస్ట్ చేశారు. దుబై నుంచి అక్రమంగా బంగారం తెచ్చి మంగళూరు ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు విచారణలో బయట పడింది.

కారు ఢీకొని చిన్నారి మృతి


బనశంకరి: కారు ఢీకొని మూడేళ్ల చిన్నారి మృత్యువాతపడిన ఘటన కసవనహళ్లి సమృద్ధి అపార్టుమెంట్ వద్ద జరిగింది. జోగ్‌జతార్ అనే వ్యక్తి సమృద్ధి అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈయన తన భార్యతో కలిసి గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరి కుమార్తె అర్పినా(3) ఈనెల 9న అపార్టుమెంట్ ముందు ఆడుకుంటుండగా అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్ నుంచి వచ్చిన కారు బాలికపై దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన బాలికను నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. జోగ్‌తార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బెల్లందూరు పోలీసులు అపార్టుమెంట్ సీసీ కెమెరా దృశ్యాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

భీమనగుండి నదిలో విషాదం

- ఈతకు వెళ్లి ఒకరి మృతి, నలుగురు గల్లంతు

బనశంకరి: ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకా భీమనగుండి శాల్మలానదిలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఈత కొట్టడానికి వచ్చిన ఐదుమందిలో ఒకరు నీటిలో మునిగిపోతుండగా అతన్ని రక్షించడానికి మిగతా నలుగురు నదిలోకి దూకారు. అయితే ఎవరూ బయటకు రాలేకపోయారు. స్థానికులు గమనించి అగ్నిమాపకసిబ్బంది, శిరసి గ్రామాంతర పోలీసులకు సమాచారం ఇచ్చిరు. వారు వచ్చి గాలింపు చేపట్టగా ఒకరి మృతదేహం లభ్యమైంది. మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నారు. మృతుడు, గల్లంతైన వారు ఏ ప్రాంతవారనేది తెలియరాలేదు.

దత్త జయంతి వేడుకలు ప్రారంభం



దత్తమాల ధరిస్తున్న భక్తులు

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లా పాలన యంత్రంగాం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 26 వరకు దత్తపీఠంలో దత్తజయంతి వేడుకలు నిర్వహించనున్నారు. దీంతో ఆదివారం నుంచి భక్తులు కామదేను గణపతి ఆలయంలో దత్తమాలను ధరించారు. విశ్వ హిందూపరిషత్, భజరంగదళ్ కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే సీటీ రవి దత్తమాలను ధరించారు. 24న అనుసూయ జయంతి, 25న చిక్కమగళూరులో శోభాయాత్ర, 26న భక్తులకు దత్తపాదుక దర్శనం ఉంటుంది.

కోలారు వార్తలు...

కోలారు జిల్లాలో అమానుషం

- విద్యార్థులతో పిట్ శుభ్రం చేయించిన మొరార్జి దేశాయి వసతి పాఠశాల సిబ్బంది
- ప్రిన్సిపాల్, వార్డెన్ సహా నలుగురిపై వేటు



హాస్టల్‌లో లెట్రిన్ పిట్‌ను శుభ్రం చేస్తున్న విద్యార్థులు



సస్పెండైన ప్రిన్సిపాల్ భారతమ్మ



ఉపాధ్యాయులు మునియప్ప, అభిషేక్

కోలారు: కోలారు జిల్లాలో అమానుషం చోటుచేసుకుంది. చిట్టి చేతులతో లెట్రిన్ పిట్ శుభ్రం చేయించిన ఘటన మాలూరు తాలూకా యలువహళ్లి మొరార్జి దేశాయి వసతి పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మేల్కొన్న జిల్లా యంత్రాంగం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్ సి మహదేవప్ప ఆదేశాలతో వసతి పాఠశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, వార్డెన్ మంజునాథ్‌తో పాటు ఉపాధ్యాయుడు మునియప్పను కలెక్టర్ అక్రం పాషా సస్పెండ్ చేయగా అతిథి ఉపాధ్యాయుడు అభిషేక్‌ను విధుల నుంచి తొలగించారు. వివరాలు... యలువహళ్లి వద్ద ఉన్న మొరార్జి దేశాయి ప్రభుత్వ వసతి పాఠశాలలో తాలూకాతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుతున్నారు. రెండు రోజుల క్రితం పిట్‌ను క్లీన్ చేయడానికి ప్రిన్సిపాల్, ఓ ఉపాధ్యాయుడు కలిసి 7 నుంచి 9వ తరగతి చదువుతున్న ఐదారుగురు విద్యార్థులను లెట్రిన్ పిట్‌లోకి దింపి శుభ్రం చేయించారు.

ఇక్కడ చదువుకోలేము :

తమతో లెట్రిన్ పిట్ శుభ్రం చేయించారని, తాము ఐదారు మంది పిల్లలు ఉన్నామని, ఇక్కడ పెట్టే హింసను భరించలేమని విద్యార్థులు తమ గోడును సోషల్ మీడియాలో వెళ్లబోసుకోవడం వైరల్‌గా మారింది. విషయం బయటకు పొక్కగానే పిల్లల రక్షణ విభాగం అధికారి నాగరత్న వసతి పాఠశాలకు వెళ్లి పరిశీలన జరిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పిల్లలనుంచి సమాచారం సేకరించారు. విషయం తెలిసి వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాఠశాల వద్దకు వెళ్లి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీసీలు ఇచ్చేయండి :

వసతి పాఠశాలలో ప్రిన్సిపాల్, వార్డెన్‌తో సహా ఎవరు ఉండరని, పాఠశాలలో హింసను తాళలేక విద్యార్థులు చాలా మంది టీసీలు తీసుకుని వేరే పాఠశాలల్లో చేరారని తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. భోజనం, టిఫిన్ సరిగా ఉండదని, టాయిలెట్ పిట్‌లోకి పిల్లలను దించినట్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాలలో లైట్‌లు ఆర్పి విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టి శిక్షలు ఇస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలను తరగతి గదిలో ఇష్టానుసారంగా కొడతారని ఇదంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని అంటున్నారు. అంతే కాకుండా వసతి పాఠశాలలో విద్యార్థినులను కూడా వేధిస్తున్నారని, వారు దుస్తులు మార్చుకుంటున్న సమయంలో రహస్య కెమెరాలతో చిత్రీకరిస్తున్నారని దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



వార్డెన్ మంజునాథ్

సస్పెండ్‌కు ఆదేశం : మంత్రి మహదేవప్ప

పిల్లలను టాయిలెట్ పిట్‌లోకి దింపి శుభ్రం చేసిన ఘటనపై బెంగుళూరులో స్పందించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప ఇది అమానుష ఘటన అని, విషయం తెలిసిన వెంటనే ప్రిన్సిపల్ సెక్రెటరీ మణివణ్ణతో చర్చించానని ప్రిన్సిపాల్, వార్డెన్ సహా ఘటనకు కారణమైన వారందరిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపి దోషులను శిక్షిస్తామని ఆయన తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

కెజీఎఫ్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి సాధన చేయాలని భగవాన్ మహావీర్ జైన్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖాసేథీ తెలిపారు. నగరంలోని మహావీర్ జైన్ కళాశాలలో 17వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవితంలో సంపాదించిన ఆస్తి ఇతరుల పాలు కావచ్చు అయితే విద్య ఇతరులు కాజేయడానికి సాధ్యం కాదన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను కలిగి అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 340 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.

ప్రజా సమస్యలకు స్పందించాలి

శ్రీనివాసపురం: ప్రజల వద్దకు వెళ్లే ముందు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటికి స్పందించాలని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. తాలూకాలోని దళసనూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ భారత వికాస సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కౌశల్యాలు కలిగిన వారికి కేంద్ర ప్రభుత్వం తగిన శిక్షణ, రుణాలు ఇచ్చి వారు స్వయం ఉపాధి పొందే విధంగా కృషి చేస్తోందని అన్నారు. శిక్షణ సమయంలో రూ. 500 స్టయిఫండ్ కూడా అందిస్తోందని, శిక్షణ అనంతరం వానే శిక్షణకు అనుగుణంగా రూ. 15 వేల కిట్‌లను కూడా అందిస్తోందని తెలిపారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తల్లి పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తోందన్నారు. ప్రసవం అనంతరం మహిళలకు రూ. 6 వేలు కేంద్రం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీంద్ర, లీడ్ బ్యాంకు మేనేజర్ సుధీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమావేశాన్ని విజయవంతం చేయండి

సాక్షి,బళ్లారి: ఈనెల 23, 24వ తేదిల్లో దావణగెరె అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ 24వ మహా సమావేశం నిర్వహిస్తున్న అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ రాష్ట్ర,జిల్లా నేతలు శ్రీనివాసరెడ్డి, చానాల్ శేఖర్ పేర్కొన్నారు. వారు ఆదివారం నగరంలోని అల్లం సుమంగళమ్మ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి ఐదులక్షల మంది వీరశైవ లింగాయత్‌లు వస్తారని, మాజీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు, కేంద్ర నేతలు కూడా హాజరువుతారన్నారు. హక్కులు, సాధన, సమస్యలను వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

శ్రీనివాసపురం: తాలూకాలో ఎక్కడా తాగునీటి సమస్య ఎదురు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జి కె వెంకటశివరెడ్డి అన్నారు. శనివారం తాలూకా కార్యాలయంలో నిర్వహించిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాలూకాలో వర్షాభావ పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో పశుగ్రాసం కొతర రాకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయం, పశువుల ఆస్పత్రికి ఎంజి రోడ్డు నుంచి నేరుగా రహదారి నిర్మించడం జరుగుతుందని కాంట్రాక్టర్లు త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న శౌచాలయాల సముదాయాన్ని తొలగించి ప్రజలకు అనుకూలమయ్యే మరో చోట నిర్మించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సుధీంద్ర, తాపం ఈఓ ఎస్ శివకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కె ఎల్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

మహిళలు రాజకీయాల్లోకి రావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీ.బీ. జ్యోతిగణేష్

తుమకూరు : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ప్రధాని మోదీ కల్పించారని, వాటిని వినియోగించుకొని రాజకీయంగా రాణించాలని తుమకూరు నగర ఎమ్మెల్యే జీ.బీ. జ్యోతిగణేష్ సూచించారు. నగరంలోని మారుతీ నగరలో సంజీవిని ఉద్యానవనంలో ఉన్న బయలు రంగ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన బాంధవ్య మహిళా సమాజం 21వ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాంధవ్య మహిళా సమాజం చేస్తున్న సమాజ సేవలు ప్రశంసనీయమన్నారు.

అహింసా తత్వాన్ని పాటించాలి



పద్మినిని సన్మానిస్తున్న మహిళలు

గౌరిబిదనూరు: జైన సామాజిక వర్గం యువత ముందుతరాల వారికి ఆదర్శవంతులుగా నిలవాలని అఖిల కర్ణాటక జైన మహిళా ఐక్య వేదిక అధ్యక్షురాలు పద్మిని పద్మరాజు తెలిపారు. గుండ్లహళ్లిలో వెలసిన శీతలనాథ తీర్థంకరులు, బ్రహ్మదేవుని 37వ వార్షిక పూజా కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. ఆయన పాల్గొని సన్మానం పొందారు. జైన సంప్రదాయాలను తాము అలవరచుకొని ముందు తరాల పిల్లలకు నేర్పాల్సిన బాధ్యత మీపై వుందని యువతకు సూచించారు. ప్రధానంగా అహింసా తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదువుకొని విద్యావంతులు కావాలన్నారు. జిన చంద్రయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: మాజీ సీఎం కుమారస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జేడీఎస్ కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు అందజేశారు. జెడీఎస్ మాజీ అధ్యక్షుడు సిఆర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

బోనుకు చిక్కిన చిరుత

మైసూరు : మైసూరు జిల్లా హుణసూరు తాలూకా ఆకుప్పె గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో పడింది. కొంతకాలంగా చిరుత గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ ఆవులు, గేదెలు తదితర మూగజీవాలను హతమార్చుతోంది. దీంతో అటవీశాఖ అధికారులు గ్రామ సమీపంలో బోను ఏర్పాటు చేశారు. ఆహారం కోసం వచ్చిన చిరుత శనివారం రాత్రి బోనులో పడింది. ఆదివారం ఉదయం అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించగా చిరుతకు మూడేళ్ల వయస్సు ఉంటుందని గుర్తించి వెంట తీసుకెళ్లారు.

చిరుతపులి, కూనలు ప్రత్యక్షం

హుణసూరు పట్టణ సమీపంలోని నాగరనహళ్లిలో నాగేష్ అనే వ్యక్తికి చెందిన తోటలో చిరుతపులి కూనలతో కలిసి సంచరిస్తోంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గాలింపు చేపట్టారు.

ధార్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో శాంతి



నరసింహస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

గౌరిబిదనూరు: ధార్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతిస్థాపన జరుగుతుందని మాజీ మంత్రి ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి అన్నారు. తాలూకాలోని డీ పాళ్య హోబళీ సిద్దనహళ్లిలో ఆదివారం జరిగిన నరసింహ స్వామి పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామంలో నరసింహస్వామికి శాంతి పూజలు నిర్వహించి 80 సంవత్సరాలైందన్నారు. ప్రస్తుతం గ్రామస్తులు ధార్మిక కార్యక్రమం చేపట్టడం మంగళదాయకమన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ మరళూరు హనుమంతరెడ్డి, జీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సిటీలో వీధికుక్కల గోల

ఐటీ బీటీ సిటీలో కొంతకాలంగా వీధి కుక్కల దాడులు గణనీయంగా పెరిగాయి. ఇటీవల ఆర్‌ఆర్ నగరలో కుక్క కొరికిందని ఒక మహిళ ఏకంగా ప్రముఖ నటుడు దర్శన్‌పైనే కేసు పెట్టింది. దీంతో ఒకరకంగా శాంతిభద్రతల సమస్యగా కూడా మారింది. కుక్క కాటుకు రేబీస్ వ్యాక్సిన్ తీసుకోకుంటే ప్రాణాలే పోయే ప్రమాదముంది.

- భయపెడుతున్న దాడులు
- ఆరు నెలల్లో 15,285 మందికి కుక్క కాట్లు
- సెంట్రల్‌లో ఎక్కువ బెడద



సాక్షి బెంగళూరు: భారత సిలికాన్ రాజధానిలో ప్రతిరోజూ సగటున 85 మంది కుక్క కాటుకు గురవుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఆరు నెలల్లోనే 15,285 మందిని కుక్కలు కరిచినట్లు బీబీఎంపీ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రకారం ప్రతిరోజు నగరంలో సగటున 85 మంది ఈ కుక్క కాటుకు గురవుతున్నారు. దీని వల్ల కుక్కల మీద దాడి చేసి హింసించడంతో పాటు బాధితులకు విలువైన సమయం, డబ్బు వృథా అవుతున్నాయి.

నగరంలో 2.79 లక్షల వీధి కుక్కలు

- ఇటీవల బీబీఎంపీ, నివేది సంస్థ సహకారంతో వీధి కుక్కలపై సర్వే నిర్వహించింది. బెంగళూరులో మొత్తం 2.79 లక్షల వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. పెంపుడు కుక్కల సంఖ్య సుమారు 2 లక్షల దాకా ఉండొచ్చు.
- 2019తో పోలిస్తే ఈ వీధి కుక్కల సంఖ్య 10 శాతం తగ్గినట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో వాటి దాడులు మాత్రం బాగా పెరిగాయని తేల్చారు.
- అందులోనూ బెంగళూరు సెంట్రల్ భాగంలో ఈ కుక్క కాటు ఘటనలు ఎక్కువగా ఉన్నాయి. బీబీఎంపీ తూర్పు జోన్ పరిధిలో సుమారు 4 వేల మందికి పైగా నగరవాసులు కుక్కకాటుకు గురయ్యారు.
- మిగిలిన పశ్చిమ జోన్‌లో 3 వేల మంది, దక్షిణ జోన్‌లో 2,500 మందిని కుక్క కొరికాయి.

ఏటా వేల మందిపై దాడి

- 2017–18లో బెంగళూరులో 36,672 కుక్క కాటు కేసులు రికార్డయ్యాయి. 2018–19లో 38,978 కేసులు, 2019–20లో 42,818, 2020–21లో 18,629, 2021–22లో 17,610, 2022–23 ఆర్థిక ఏడాదిలో 22,945 కుక్కకాట్లు సంభవించాయి.
- తాజాగా ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 15,285 కేసులు రికార్డయ్యాయి. ఈ ఆర్థిక ఏడాది ముగిసే నాటికి ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు భావిస్తున్నారు.

ఎన్ని చర్యలు తీసుకున్నా ఇంతే

ఈ కుక్క కాటు ఘటనలపై అధికారుల స్పందన మాత్రం వేరేలా ఉంది. నగరంలో 10 శాతం మేర వీధి కుక్కల సంఖ్య తగ్గిపోయిందని చెబుతున్నారు. అలాగే వీధి కుక్కలకు టీకాలు, సంతానహరణ చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. నగరవాసుల్లో, చిన్నారుల్లో కుక్క కాటు ప్రమాదాలపై అవగాహన కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంత చేసినా బెంగళూరులో మాత్రం వీధి కుక్కల తాకిడిని మాత్రం బీబీఎంపీ నిలువరించలేకపోతుందని నగరవాసుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

గత ఆరు నెలల్లో కుక్క కాటు కేసులు

జోన్లు	మొత్తం వీధి కుక్కలు	కుక్క కాటు కేసులు
బెంగళూరు తూర్పు	37,685	4,109
బెం.పశ్చిమ	22,025	3,654
బెం.దక్షిణ	23,241	2,045
దాసరహళ్లి	21,221	659
ఆర్.ఆర్. నగర	41,266	871
బొమ్మనహళ్లి	39,183	1,025
యలహంక	36,343	1,041
మహదేవపుర	58,371	1,781
మొత్తం	2,79,335	15,285



ఓ బస్టాప్‌లో దర్జాగా కూర్చున్న శునకం



పెంపుడు శునకాలతో నగరవాసులు

వేకువజామున మృత్యుఘోష

- రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొన్న మరోలారీ
- ఇద్దరు కూలీలు, డ్రైవర్ మృతి
- మృతులు చిత్రదుర్గ జిల్లా హిరియూరువాసులు
- అనంతపురం శివార్లలో ఘటన



ధ్వంసమైన లారీ



మహలింగ,లింగరాజు, ప్రశాంత్ మృతదేహాలు

రాప్తాడు రూరల్: ఏపీలోని అనంతపురం నగర శివార్లలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని చిత్రదుర్గ జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. శనివారం రాత్రి అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న బండల లారీ అనంతపురం నగరం దాటిన తర్వాత కురుగుంట సమీపంలో టైర్ పంక్చరైంది. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపారు. మరో వైపు కర్ణాటకలోని హిరియూరుకు చెందిన లారీ పశువుల దాణా లోడుతో అనంతపురం వచ్చింది. అన్‌లోడ్ చేసిన తర్వాత ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో బయలుదేరింది. 2.30 గంటల సమయంలో కురుగుంట వద్ద ఆగివున్న బండల లారీని బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో చిత్రదుర్గం జిల్లా హిరియూరు ప్రాంతానికి చెందిన డ్రైవరు ప్రశాంత్ (25), కూలీలు మహలింగ (28), లింగరాజు (23) మృతి చెందారు. డ్రైవర్ స్నేహితుడు సుభాష్ చంద్రబోస్ గాయలతో బయటపడ్డాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న 108 వాహనంలో సుభాష్ చంద్రబోస్‌ను ఆస్పత్రికి తరలించారు. అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది వచ్చి జేసీబీ సాయంతో లారీలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు.

అతి వేగమే కారణమా?:

ఇంత పెద్ద ప్రమాదానికి లారీ అతి వేగమే కారణమని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డుపై ఆగివున్న బండల లోడు లారీకి పార్కింగ్ సిగ్నల్స్ వేయకపోవడం వెనుక నుంచి స్పీడుగా వచ్చిన లారీ అంచనా వేయలేక బలంగా కొందని పోలీసులు చెబుతున్నారు. పంక్చర్ కావడంతో రోడ్డుపైనే వాహనం ఆగిపోయిందని ఇలాంటి సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. రాత్రివేళల్లో అతివేగం చాలా ప్రమాదకరమన్నారు.

నటుడు రిషబ్‌శెట్టి పెద్దమనస్సు

బనశంకరి: నటుడు రిషబ్‌శెట్టి పెద్ద మనస్సును చాటుకున్నాడు. తాను విద్యనభ్యసించిన పాఠశాలను దత్తత తీసుకున్నారు. మంగళూరు కాసరగూడు తాలూకాలోని కెరాడి ప్రభుత్వ పాఠశాలను ఇటీవల సందర్శించిన రిషబ్‌శెట్టి.. ఆ స్కూల్ స్థితిగతులపై ఆరా తీశారు. అభివృద్ధిచేసి విద్యార్థులకు సదుపాయాలు కల్పించాల్సి ఉందని భావించిన ఆయన ఆ పాఠశాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు.

ఇదో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్

బనశంకరి: ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్ నిలిచిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. శివాజీనగరలో ఆదివారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్పీడిజిటల్ వాహనాన్ని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వీక్షించి మాట్లాడారు. అత్యధిక మానవవనరులు కలిగిన భారత్ స్వాతంత్ర్యానంతరం 75 ఏళ్ల తరువాత అభివృద్ధి చెందిన దేశంగా పిలుస్తున్నారని తెలిపారు. మోదీ నేతృత్వంలోని పాలనలో పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. ఇంగ్లాడ్‌ను పక్కకు నెట్టి ఐదో స్థానంలో నిలిచామన్నారు. రానున్న మూడేళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా దేశాన్ని నిలపాలని మోదీ కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఎంపీ పీసీమోహన్, బెంగళూరు సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు మంజునాథ్, బీజేపీ నేతలు చంద్రు, సంపత్‌కుమార్, గోపి, గుణశేఖర్, బాలాజీమణి పాల్గొన్నారు.

క్లినిక్‌లపై వైద్యాధికారుల దాడి

యశవంతపుర: ఉడిపి జిల్లా వ్యాప్తంగా ల్యాబ్, క్లినిక్‌లపై ఆదివారం జిల్లా వైద్యాధికారులు దాడులు చేశారు. అనుమతి లేని క్లినిక్, ల్యాబ్‌ను సీజ్ చేశారు. కుందాపురలోని ల్యాబ్ యజమానిపై కేసు నమోదు చేశారు.

సమస్యలపై స్పందన లేకపోతే ఎలా?



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే టీబీ జయచంద్ర

తుమకూరు : ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శిరా ఎమ్మెల్యే టీబీ జయచంద్ర అన్నారు. పట్టణంలోని మినీ విధానసౌధ వద్ద ఏర్పాటు చేసిన జనతా దర్శన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. అధికారులు ఉన్నది సమస్యలు పరిష్కరించేందుకేనన్నారు. ఇకపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించగా వాటిని లబ్ధిదారులకు అందజేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు.

యువకుడి వాట్సాప్ స్టేటస్‌లో యువతి ఫొటో

- ఆత్మహత్య చేసుకున్న బాధితురాలు

మైసూరు: ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోను ఒక యువకుడు వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. దీంతో కలత చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరు జిల్లా హుణసూరులోని రంగనాథ లేఔట్‌లో జరిగింది. ఈ కాలనీకి చెందిన యువకుడు ఇదే కాలనీకి చెందిన శృతి అనే యువతితో గతంలో ఫొటో దిగాడు. ఈక్రమంలో ఇటీవల ఆ ఫొటోను ఆ యువకుడు తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. తనను ఇబ్బంది పెట్టేందుకు యువకుడు ఇలా వ్యవహరించాడని శృతి తీవ్ర ఆవేదనకు గురైంది. ఫొటో స్టేటస్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడనే ఆవేదనతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీఐ కార్యకర్తపై దాడి



చికిత్స పొందుతున్న ధనుంజయ

తుమకూరు : ఆర్‌టీఐ కార్యకర్తపై క్రషర్ల యజమానుల అనుచరులు దాడికి పాల్పడ్డారు. వివరాలు తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకాలోని తరికెరె గ్రామంలో సర్వే నంబర్ 80,81లో అక్రమగా 7 క్రషర్లు ఏర్పాటు చేశారు. క్రషర్లతో వాయు కాలుష్యం ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆర్‌టీఐ కార్యకర్త ధనుంజయ సంబంధిత క్రషర్ల యజమానులు సమర్పించిన దాఖలాలు సేకరించాడు. అవి తప్పుల తడకగా ఉన్నాయని, నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని ఇటీవల ధనుంజయ ధర్నా నిర్వహించాడు. దీంతో క్రషర్ల యజమానుల అనుచరులు ధనుంజయపై దాడి చేశారు. తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కుణిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంజినీరింగ్ విద్యార్థి జల సమాధి

దొడ్డబళ్లాపురం: ఇంజినీరింగ్ విద్యార్థి జల సమాధి అయిన ఘటన కనకపుర తాలూకా చుంచి ఫాల్స్ వద్ద చోటుచేసుకుంది. దేవనహళ్లి తాలూకా నారాయణపురకు చెందిన వరుణ్(19) బెంగళూరులోని దయానంద్ సాగర్ కాలేజీలో సెకండ్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి చుంచిఫాల్స్ చూడడానికి వెళ్లాడు. ఈతకొడుతూ వరుణ్ నీటమునిగి మృతిచెందాడు. సాతనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

గోళూరు గణపతికి బైబై

తుమకూరు : గోళూరులో మూడు నెలలుగా పూజలందుకున్న గోళూరు శ్రీమహాగణపతి నిమజ్జనం ఘనంగా జరిగింది. బలిపాడ్యమి రోజున వినాయకుడిని ప్రతిష్టాపన చేసిన రోజు నుంచి ఆదివారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం గోళూరుకు చెందిన యజమానుల ఇంటి వద్ద నుంచి నంది ధ్వజం, కరడి వాద్యం బృందంతో మహిళలు గణపతి ఆలయానికి కళశాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి హారతి ఇచ్చారు. ఆదివారం వేకువజామున 3 గంటలకు హొన్నెనహళ్లి బోవి సముదాయంతో పాటు 18 సముదాయాల భక్తుల సమక్షంలో స్వామివారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి గోళూరు చెరువులో నిమజ్జనం చేశారు. జైజై గణేషా, బైబై గణేషా అంటూ నినాదాలతో గ్రామం మార్మోగింది. యువకులు డ్యాన్సులు చేస్తూ ఆకట్టుకున్నారు.

త్వరలో ఆర్టీసీ సరుకు రవాణా సేవలు

శివాజీనగర: కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ (కేఎస్‌ఆర్‌టీసీ) రవాణేతర ఆదాయాన్ని వృద్ధి చేసేందుకు సిద్ధం కాగా, ఈ నెల 23న కార్గో సేవలను ఆరంభించనుంది. కార్గో పార్శిల్, కొరియర్ సేవలను ఆరంభించనుంది. ఇందుకోసం 20 ట్రక్‌లను కొనుగోలు చేసింది. రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, కేఎస్‌ఆర్‌టీసీ ఎండీ అనుప్‌కుమార్, అధికారులు కార్గో సేవల ట్రక్‌లను పరిశీలించారు. మొదట్లో 109 కేంద్రాల్లో చిన్న స్థాయి పార్శిల్‌లను బస్సు ద్వారా తీసుకెళ్తారు. ఆ తరువాత అన్ని బస్టాండ్‌లకు విస్తరిస్తామని తెలిపారు. బరువైన వస్తు సామగ్రిని ట్రక్‌ల ద్వారా తరలిస్తారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

దొడ్డబళ్లాపురం: ఏనుగు దాడిలో రైతు మృతి చెందిన ఘటన హారోహళ్లి తాలూకా హళ్లికెరె గ్రామం వద్ద చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప(64) ఆదివారం తెల్లవారుజామున తన తోటలో చెట్లకు నీరు వలదడానికి వెళ్లాడు. అతను పనిలో నిమగ్నమై ఉండగా అక్కడే పొంచి ఉన్న ఏనుగు దాడి చేసి కాళ్లతో తొక్కి హతమార్చింది. తోటకు వెళ్లిన తిమ్మప్ప ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఈఘోరం వెలుగు చూసింది. పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

ఏనుగు దాడిలో మృతిచెందిన తిమ్మప్ప కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలియజేశారు.

పేదలకు కళ్లద్దాల పంపిణీ



కళ్లజోళ్లను అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక యువకుల సంఘం ఆరోగ్య శిబిరం నిర్వహించింది. ఇందులో దృష్టి సమస్యలు ఉన్న పేద రోగులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. బీజేపీ నేత మంజునాథ్, నరేంద్రబాబు, బాబు రెడ్డి, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

పంటలపై ఏనుగుల దాడులు



పంటను ధ్వంసం చేసిన దృశ్యం

హోసూరు: హోసూరు, డెంకణీకోట ప్రాంతాల్లో రైతుల పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్న ఏనుగులను దట్టమైన అటవీ ప్రాంతాలకు మళ్లించాలని రైతులు డిమాండ్ చేశారు. నెల రోజులుగా హోసూరు, డెంకణీకోట అటవీ ప్రాంతాల్లో వందకు పైగా ఏనుగులు సంచరిస్తూ రైతుల పండిస్తున్న టమోటో, బీన్స్, క్యారెట్ వంటి పంటలతో పాటు వర్షాధార పంటలైన రాగి, ఉలవ, కంది తదితర పంట పొలాల్లో తిరుగుతూ పాడు చేస్తున్నాయి. లక్షల రూపాయల ఖర్చుపెట్టి పండించిన పంటలను నష్టపోతున్నామని, ఈ సమస్య నుంచి శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. శనివారం రాత్రి డెంకణీకోట తాలూకా దిన్నూరు సమీపంలోని పాపరెడ్డిపాళ్యం, వరదరెడ్డిపాళ్యం, ఉళిమంగలం, ఉబ్బరాయనపల్లి తదితర ప్రాంతాల్లో ఏనుగులు దాడి చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళ కిడ్నాప్‌పై ఫిర్యాదు

హోసూరు: గార్మెంట్స్‌లో పనికి వెళ్లిన తన భార్యను డ్రైవర్ కిడ్నాప్ చేశాడని భర్త డెంకణీకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు అంచెట్టి తాలూకా తమ్మగొండనూరు గ్రామానికి చెందిన గోవిందరాజ్ భార్య పద్మ (30) డెంకణీకోటలోని గార్మెంట్స్ కంపెనీలో కార్మికురాలిగా పని చేస్తుంది. రెండు రోజుల క్రితం కంపెనీకెళ్లిన ఈమె తిరిగి రాకపోవడంతో అంతటా గాలించారు. స్థానికుల సమాచారం మేరకు మాడక్కల్ గ్రామానికి చెందిన డ్రైవర్ మల్లేష్ (30) పద్మను కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలిస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

హోసూరు: నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్‌లను దొంగిలించుకెళ్లిన దొంగను హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. కుముదేపల్లిలో శనివారం రాత్రి కూలీ కార్మికుని ఇంట్లోకి దొంగలు దూరి రెండు సెల్‌ఫోన్‌లను తీసుకొని ఉడాయించారు. ఇంతలో బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు ఒకరిని పట్టుకొని హడ్కో పోలీసులకు అప్పగించారు. నిందితుడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన వడివేల్ (28) అని తెలిసింది. వేలూరు జిల్లాకు చెందిన కుమార్ అనే మరో దొంగ కోసం గాలిస్తున్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

హోసూరు: మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రైతు బజారులో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు బజారు ఆవరణలో సుమారు 200 మొక్కలకుపైగా నాటారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, గోపాలక్రిష్ణన్, సుమన్, శక్తివేల్, మాణిక్యవాసగం, అక్రమ్‌అహమ్మద్ పాల్గొన్నారు.

ప్రియురాలి భర్త నరికివేత



హతుడు దుర్గేష్ (ఫైల్)

క్రిష్ణగిరి: తన భార్యతో వివాహేతర సంబంధం వద్దని చెప్పిన వ్యక్తిని ఇద్దరు హత్య చేశారు. వివరాలు.. సూళగిరి తాలూకా బేరికె సమీపంలోని ముదుగురికి గ్రామానికి చెందిన దుర్గేష్ (25), భార్య సోనియ (22) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సోనియాతో అదే గ్రామానికి చెందిన నాగరాజ్(30)కు వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలుసుకొన్న భర్త దుర్గేష్ నాగరాజ్‌ను నిలదీశాడు. దీంతో ఆవేశానికి గురైన నాగరాజ్, చిన్ననాన్న కొడుకు మధుతో కలిసి ఆదివారం వేకువజాము దుర్గేష్ ఇంటికెళ్లి వేటకొడవలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన అతన్ని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చనిపోయాడు. బేరికె పోలీసులు నిందితులు నాగరాజ్, మధును అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

అంబారీపై అయ్యప్పస్వామి



అంబారీపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

కెలమంగలం: కెలమంగలం పట్టణపంచాయతీలోని శ్రీ సిద్ధలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం అయ్యప్పస్వామి భక్తమండలిచే ఘనంగా జరుపుకొన్నారు. వేకువజాము నుంచి మహాగణపతి హోమం, అయ్యప్పస్వామి హోమం, నవగ్రహ హోమం, కళశ హోమాలు జరిపించారు. అనంతరం పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు, మహిళలు పాలకుండలతో ఊరేగింపు చేపట్టారు. అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఏనుగు అంబారీపై పట్టణంలో ఊరేగించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పాలాభిషేకం, పూల అలంకారం, భక్తి కీర్తనలను నిర్వహించారు.

క్లుప్తంగా...

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది కోసం సోమవారం సాయంత్రం నాలుగు గంటల 55 నిమిషాలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వస్తున్నారు. రాష్ట్రపతి దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ విమానాశ్రయంలో దిగనున్నారు. రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్తా, మేడ్చల్ జిల్లా కలెక్టర్, రాచకొండ కమిషనర్ తదితరులు స్వాగతం పలకనున్నారు. రాష్ట్రపతి ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈనెల 20వ తేదీన భూదాన్ పోచంపల్లిలో ఆమె పర్యటించనున్నారు. అక్కడ చేనేత ప్రదర్శన తిలకిస్తారు. ఈనెల 23 వరకు శీతాకాల విడిది చేస్తారు. ఈ విడిది సమయంలో రాష్ట్రపతి పలువురు ప్రముఖులను, సామాన్యులను కలిసే అవకాశమున్నట్టు సమాచారం. రాష్ట్రపతి రాక సందర్భంగా పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు, పర్యటన సందర్భంగా ట్రాఫిక్ దారి మళ్లించే చర్యలను అధికారులు చేపట్టారు. ఈనెల 23వ తేదీన రాష్ట్రపతి తిరిగి ఢిల్లీ బయల్దేరి వెళ్తారని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

భారత వాయుసేనలో నూతన విభాగం


సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనలో అత్యంత కీలకంగా మారనున్న నూతన విభాగం వెపన్ సిస్టం బ్రాంచి అధికారుల శిక్షణ వచ్చే జనవరిలో ప్రారంభం కానుంది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత వాయుసేనలో ప్రారంభిస్తున్న తొలి ప్రత్యేక విభాగం ఇదే కావడం గమనార్హం. 2022లో చండీగఢ్‌లో నిర్వహించిన ఎయిర్ ఫోర్స్ డే వేడుకల్లో భాగంగా ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఈ నూతన విభాగం ఏర్పాటు గురించి ప్రస్తావించారు. కాగా, వెపన్‌సిస్టం బ్రాంచి అధికారుల శిక్షణను దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 2024 జనవరిలో ప్రారంభించనున్నట్టు వాయుసేన ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ శిక్షణ 2024 డిసెంబర్‌లో ముగుస్తుందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తు యుద్ధ అవసరాలకు అనుగుణంగా మిస్సైల్స్, డ్రోన్లు, స్పేస్ బేస్ట్ ఆయుధాలను నియంత్రించడంలో ఈ వెపన్‌సిస్టం బ్రాంచి కీలకంగా మారనుంది.

ఓట్లు.. కేటుగాళ్లు

తెలంగాణలో నివాసం, ఓటు.. ఏపీలోనూ ఓటర్లుగా నమోదు • పోలింగ్ ముగిసిన మర్నాడే హైదరాబాద్‌లో టీడీపీ నేతల మేళా



జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సోదరుడు నాగేంద్రరావు కొణిదల, ఆయన భార్య పద్మజ, కుమారుడు సాయి వరుణ్ తేజకు తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్‌లో జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు ఉన్నాయనడానికి ఆధారం ఇదీ



తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అంటే డిసెంబర్ 4న రాష్ట్రంలో మంగళగిరి నియోజకవర్గం వడ్డేశ్వరంలో నివాసం ఉన్నామని చెబుతూ ఓటరుగా నమోదు చేయించుకోవడానికి ఫారం-6లు దరఖాస్తుచేసిన కొణిదల నాగేంద్రరావు, పద్మజ, సాయి వరుణ్ తేజ

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లోనూ 2019కి మించి ఘోర పరాజయం తప్పదని నిర్ధారణకు వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓటమికి ఇప్పట్నుంచే సాకులు వెతుక్కుంటున్నారు. ఒకవైపు ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెడుతున్న ఆయన మరోవైపు నిబంధనలను కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ యథేచ్ఛగా దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17, 18 ప్రకారం దేశంలో ఒక నియోజకవర్గంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలి. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు నమోదు చేయించుకోవడం చట్ట ప్రకారం నేరం. రాజకీయాల్లో 1978 నుంచి ఉన్న చంద్రబాబుకు ఇది తెలిసినా తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. తెలంగాణలోనూ, ఏపీలోనూ రెండు చోట్లా ఓట్లు ఉన్న వారు (డూప్లికేట్లు) 4,30,264 మంది ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఏపీలోనూ సరిహద్దు నియోజకవర్గాల్లో చేర్పించారు. వాటిని తొలగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాలని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పరిశీలకులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో పోలింగ్ ముగిసిన మర్నాడే..

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న పూర్తయింది. ఆ మరుసటి రోజే అంటే డిసెంబర్ 1 నుంచే హైదరాబాద్‌లో ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా చేర్పించేందుకు ఆ పార్టీ భారీ ఎత్తున శిబిరాలు నిర్వహించింది. కూకట్‌పల్లి, నిజాంపేట, వనస్థలిపురం, మణికొండ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో శిబిరాల ఇన్‌ఛార్జ్‌లను నియమించిన టీడీపీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ సానుభూతిపరులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వయసు, చిరునామా ధ్రువీకరించే ఆధార్ కార్డును వాట్సప్‌లో పంపితే తామే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేయిస్తామని, ఎన్నికల సంఘానికి తామే ఫారం 6 సమర్పిస్తామంటూ సందేశాలు పంపించింది. టీడీపీని భుజానికెత్తుకునే మోసే ఓ సామాజిక వర్గం నాయకులు ఈ ప్రచారంలో ప్రధాన భూమిక పోషించారు. ఇలా హైదరాబాద్, తెలంగాణలో నివాసం ఉంటున్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరులను ఏపీలోని పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా చేర్చేందుకు ఫారం 6 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. ఈ ప్రక్రియను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.



తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ పూర్తయిన మరుసటి రోజే అంటే డిసెంబర్ 1 నుంచి హైదరాబాద్‌లో టీడీపీ సానుభూతిపరులను రాష్ట్రంలో ఓటర్లుగా చేర్పించేందుకు ఆపార్టీ కూకట్‌పల్లిలో నిర్వహిస్తున్న శిబిరం

పవన్ కుటుంబం బరి తెగింపు..


ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అనే తరహాలో డూప్లికేటు ఓట్లు చేర్చడంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అదే బాట పట్టారు. ఆయన సోదరుడు కొణిదల నాగేంద్రరావు(నాగాబాబు)కు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నెంబరు 168లో సీరియల్ నెంబరు 323 ఎఫ్‌వైవై 6038202 ఓటరు కార్డు నెంబరుతో ఓటు ఉంది. నాగేంద్రరావు సతీమణి పద్మజ కొణిదలకు సీరియల్ నెంబరు 324, వారి కుమారుడు కొణిదెల సాయివరుణ్ తేజ్‌కు సీరియల్ నెంబరు 325తో అక్కడ ఓట్లున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అంటే డిసెంబరు 4న ఏపీలోనూ ఓటు హక్కు కోసం వారు దరఖాస్తు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారంగా నగర్ మూడో వీధి 5-263 డోర్ నెంబర్ ఇంటిలో తాము నివాసం ఉంటున్నామంటూ కొణిదల నాగేంద్రరావు, పద్మజ, సాయివరుణ్ తేజ్ ఓటర్లుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తు సమర్పించడం గమనార్హం. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే జనసేనను స్థాపించిన సినీనటుడు పవన్ కళ్యాణ్ తాజాగా మరోసారి జత కట్టడం ద్వారా దీన్ని రుజువు చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబుకు బేషరతుగా మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా టీడీపీకి మేలు చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నించారు.

డూప్లికేటు ఓట్లకు సాక్ష్యాలు ఇవిగో..:

- ▲ ఒకే ఓటరు కార్డు నెంబరు (టీజెడ్‌టీ 2164002)తో దీపిక సైలాడకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గంలో ఒక ఓటు ఉండగా రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో మరో ఓటు ఉంది.
- ▲ ఒకే ఓటరు కార్డు నెంబరు (ఎఫ్‌జెడ్‌జెడ్ 8526691)తో పి.వెంకటేష్ తండ్రి పి.రామారావుకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక ఓటు ఉండగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో మరో ఓటు ఉంది.
- ▲ ఒకే ఓటరు కార్డు నెంబరు (కేవైటీ 2765246)తో మారెమ్మ తురపాటి భర్త మారయ్యకు తెలంగాణలోని సత్తుపల్లి నియోజకవర్గంలో ఒక ఓటు ఉండగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో మరో ఓటు ఉంది.
- ▲ ఒకే ఓటరు కార్డు నెంబరు (ఎస్‌డబ్ల్యూడీ 1814962)తో భరణి బిళ్లపాటి భర్త వెంకట రమణమూర్తి బిళ్లపాటికి హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఒక ఓటు ఉండగా రాష్ట్రంలో అనకాపల్లి నియోజకవర్గంలో రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో రెండు ఓట్లు ఉన్నాయి. అంటే మొత్తం మూడు ఓట్లు ఉన్నట్లు.
- ▲ ఒకే ఓటరు కార్డు నెంబరు (జేహెచ్‌జీ 1224126)తో 70 ఏళ్ల వంకదారి నారాయణస్వామి తండ్రి వి.కృష్ణయ్యకు గ్రేటర్ హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ జడ్పీహెచ్‌ఎస్ పోలింగ్ బూత్ పరిధిలో సీరియల్ నెంబరు 750తో ఒక ఓటు ఉండగా వయసును 72 ఏళ్లుగా మార్చి నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం ప్యాపిలిలో సీరియల్ నెంబరు 197తో మరో ఓటు ఉంది.

తెలంగాణలోనూ, ఏపీలోనూ రెండు చోట్లా 4,30,264 ఓట్లు ఇలా..

విభాగం	నకిలీ ఓట్ల సంఖ్య
1.ఒకే ఓటరు కార్డుతో ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	8,180
2.ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయసు, జెండర్ ఒకేలా ఉండి ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	1,01,458
3.ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, జెండర్ ఒకేలా ఉండి వయసును మార్చి ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	1,98,656
4.ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయసు, జెండర్ ఒకేలా ఉండి, ఇంటి నెంబరు మార్పుతో ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	1,05,884
5.ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయసు ఒకేలా ఉండి జెండర్ మార్పుతో ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	1,078
6.ఓటరు పేరు, వయసు, జెండర్ ఒకేలా ఉండి తండ్రి/భర్త పేరు మార్పుతో ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	2,844
7.ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు ఒకేలా ఉండి- ఇంటి నెంబరు, వయసు మార్పుతో ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	830
8.ఇంటి పేరును ముందు, వెనుక పెట్టి ఒకే పేరుతో ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	9,882
9.ఉచ్చరించినప్పుడు ఓటరు పేరు, తండ్రి పేరు ఒకేలా ఉండి ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం	1,452
మొత్తం	4,30,264



ఓటరు కార్డు నెంబరు ఆర్‌డీవీ0159780తో కొసరాజు సాంబశివరావు తండ్రి సూర్యప్రకాశరావుకు తెలంగాణలో కూకటిపల్లిలో ఒక ఓటు.. రాష్ట్రంలో రాజానగరం నియోజకవర్గంలో మరో ఓటు ఉందనడానికి ఆధారం



ఓటరు కార్డు నెంబరు ఆర్‌ఎస్‌యూ0326876తో నూతులపాటి కష్ణచైతన్య తండ్రి పేరు ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్‌కు తెలంగాణలో పటాన్‌చెర్వు నియోజకవర్గంలో ఒక ఓటు.. రాష్ట్రంలో నూజివీడు నియోజకవర్గంలో మరో ఓటు కలిగి ఉన్నారనడానికి సాక్ష్యం

పవన్ ఇంటికి చంద్రబాబు

- లోక్‌సభ ఎన్నికల్లో జనసేనతో పొత్తు ఉండదన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఉంటుందని పలుమార్లు చెప్పిన పవన్
- కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళంలో ఇరు పార్టీలు.. దీంతో పవన్ వద్దకు వెళ్లి చర్చలు జరిపిన చంద్రబాబు
- లోకేశ్ పాదయాత్ర ముగింపు సభకు పవన్‌ను ఆహ్వానించేందుకే బాబు వెళ్లారంటున్న జనసేన
- సీట్ల సర్దుబాటు, బాబు పవన్ ఉమ్మడి సభలపై చర్చ కోసమంటున్న టీడీపీ



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – జనసేన ఉమ్మడిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుకు బీజేపీ కూడా కలిసి వస్తుందని పవన్ గతంలో పలుమార్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళం ఏర్పడింది. దీనిపైనా పవన్, చంద్రబాబు మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. బీజేపీ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాకే కిషన్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారా అన్న దానిపై ఇరువురు నేతలు చర్చించుకొని ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోపక్క.. ఈ నెల 20న విజయనగరం జిల్లాలో లోకేశ్ యువగళం యాత్ర ముగింపు కార్యక్రమం జరగనుంది. దీనికి పవన్ రావడంలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం ప్రకటన చేశారు. ఆ కార్యక్రమానికి పవన్ కూడా హాజరైతే టీడీపీకి మేలు జరుగుతుందని లోకేశ్ భావిస్తున్నారు. లోకేశ్ ఒత్తిడితో ముగింపు కార్యక్రమానికి పవన్‌ను ఆహ్వానించేందుకే చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ వర్గాల కథనం మరోలా ఉంది. ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు, రాష్ట్రమంతటా చంద్రబాబు–పవన్ ఉమ్మడిగా సభల ఏర్పాటుకు సంబంధించి ఇరువురు నేతలు చర్చించుకున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికల్లో వ్యూహాలపై చర్చించారు: నాదెండ్ల మనోహర్

చంద్రబాబు, పవన్ భేటీలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అనేక ఇతర అంశాలపై చర్చించినట్లు జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. చంద్రబాబు, పవన్ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి మేనిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకెళ్లడానికి సమష్టి కార్యాచరణ తీసుకున్నామన్నారు. వైసీపీని దీటుగా ఎదుర్కోవడానికి, వైసీపీ విముక్త రాష్ట్రాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని విషయాల పట్ల పూర్తిస్థాయి చర్చ జరిగిందని తెలిపారు. ఈ భేటీలో చర్చకు వచ్చిన ఇతర కీలకమైన అంశాలపై తర్వాత ప్రత్యేకంగా వెల్లడిస్తామని మనోహర్ చెప్పారు.

అధికార వైఎస్సార్‌సీపీ ముందే రాజకీయం వేడెక్కించడంతో..

2024 ఎన్నికలకు మరికొద్ది నెలలే సమయం ఉండటంతో వైఎస్సార్‌సీపీని సీఎం వైఎస్ జగన్ ముందుండి నడిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత మార్పులకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాల్లో కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలను నియమిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ నేతృత్వంలోని జనసేన అభ్యర్థులని వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఆ రెండు పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు తొందరగా తేల్చాల్సిన పరిస్థితిని వైఎస్సార్‌సీపీ వారి ముందుంచింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ తాజా భేటీ జరిగి ఉంటుందని ఆ పార్టీల నేతలు భావిస్తున్నారు.

ఏపీ విధానాలు నచ్చాయి

▶ మొదటి పేజీ తరువాయి

ఇదొక మంచి విధానమని (గుడ్ ప్రాక్టీస్) పేర్కొంది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతున్న గుడ్ ప్రాక్టీసెస్‌పై అంతర్ రాష్ట్ర మండలి ఇటీవల ఓ నివేదికను వెల్లడించింది. అందులో మన రాష్ట్రానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

సచివాలయాలతో పాలనా వికేంద్రీకరణ

- ▲ ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన పాలనా వికేంద్రీకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తద్వారా వివిధ సంక్షేమ పథకాలతోపాటు పలు ప్రభుత్వ సేవలను పౌరుల ఇంటి వద్దకే చేరవేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అవసరాలను తీర్చడంలో ఈ వ్యవస్థ వన్‌స్టాప్ సొల్యూషన్‌గా నిలిచింది.
- ▲ గ్రామాల్లో 50 ఇళ్లకు.. పట్టణాల్లో 70-100 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున పని చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో 11 మంది చొప్పున, పట్టణ సచివాలయాల్లో 10 మంది చొప్పున ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరు తమ పరిధిలోని ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలను నిర్ణీత కాల వ్యవధిలో అందిస్తున్నారు. ఆరు అంచెల్లో ట్రాక్ చేయడం ద్వారా పథకాలకు అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నారు. ఎవరికైనా అర్హత లేకపోతే అందుకు కారణాలను కూడా చెబుతూ దరఖాస్తు తిరస్కరిస్తున్నారు.

సమగ్ర సర్వేతో భూ రికార్డుల శుద్ధీకరణ

- ▲ దశల వారీగా సమగ్ర భూ సర్వేను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. డ్రోన్స్ ద్వారా ఏరియల్ ఫ్లయింగ్‌తో సర్వే చేయడంతో పాటు గ్రౌండ్ ట్రూథింగ్, రికార్డుల తయారీ, క్షేత్ర స్థాయిలో ధ్రువీకరణ, రికార్డుల అప్‌డేషన్, సరిహద్దు వివాదాలపై అప్పీల్స్, సెక్షన్-13 నోటిఫికేషన్ ప్రచురణ, ఫైనల్ రికార్డ్ ఆఫ్ రైట్స్, స్టోన్ ప్లాంటేషన్, సబ్ డివిజన్స్.. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లను క్రమానుగతంగా అమలు చేస్తున్నారు.
- ▲ సరిహద్దుల ఆన్‌లైన్ పర్యవేక్షణ, జోనల్, నిబంధనలు, భూమిపై భౌతిక మార్పులతో సహా సమగ్ర భూసర్వే చేపట్టారు. ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా కచ్చితమైన భూ హక్కు పత్రాలను భూ యజమానులకు పంపిణీ చేస్తున్నారు. తద్వారా భూ రికార్డులు క్లీన్ అవుతాయి. ఇది చాలా మంచి విధానం.

'ఫ్యామిలీ డాక్టర్'తో ప్రజల్లో నిశ్చింత

- ▲ డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్టం చేసింది. ఇందులో భాగంగా రోగుల ఇంటి వద్దే వైద్య సేవలను అందిస్తోంది. తద్వారా చిన్న చిన్న జబ్బులకు పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం తప్పిందని ప్రజలు నిశ్చింతగా ఉన్నారు. ఇదొక అద్భుతమైన కార్యక్రమం.
- ▲ ఆయుష్మాన్ భారత్ హెల్త్-వెల్నెస్ సెంటర్ల ఏకీకరణ ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోంది.
- ▲ గ్రామీణ ప్రాంతాల్లో 2,500 జనాభాకు ఒకటి చొప్పున డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసింది.
- ▲ ప్రతి విలేజ్ క్లినిక్‌లో ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఒక ఏఎన్‌ఎం, ముగ్గురు నలుగురు ఆశా వర్కర్లను నియమించారు.
- ▲ విలేజ్ క్లినిక్స్ భవనాలను 932 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్వార్టర్‌తో సహా నిర్మించారు. వీటిల్లో 105 రకాల మందులు, 14 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.
- ▲ ప్రతీ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లను అందుబాటులో ఉంచడంతోపాటు ప్రతీ పీహెచ్‌సీకి విలేజ్ క్లినిక్స్‌ను అనుసంధానించారు.
- ▲ 104 మొబైల్ మెడికల్ యూనిట్‌తో సహా ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్నారు. ఒక డాక్టర్ పీహెచ్‌సీలో ఓపీ సేవలను అందిస్తే.. మరో డాక్టర్ విలేజ్ క్లినిక్స్‌కు హాజరవుతున్నారు.
- ▲ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో సాధారణ ఓపీలతో పాటు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ నిర్వహణ, యాంటినేటల్ కేర్.. తల్లులు, నవజాత శిశువులకు పోస్ట్‌నేటల్ కేర్, అంగన్‌వాడీలు, పాఠశాలల సందర్శన, రక్తహీనత పరీక్షలు, పర్యవేక్షణ, మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల సందర్శన, పంచాయతీల సమన్వయంతో గ్రామ పారిశుద్ధ్య పర్యవేక్షణ జరుగుతోంది.
- ▲ ఈ ఏడాది మే 3 నాటికి గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలను 97,11,224 మంది ప్రజలు వినియోగించుకున్నారు.


రైతులకు అండగా ఆర్బీకేలు

గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు మంచి విధానమని, తద్వారా ప్రభుత్వం రైతుల సాగుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్‌ను ఉంటున్న ఊళ్లలోనే పొందే అవకాశం కల్పించిందని అంతర్రాష్ట్ర మండలి నివేదిక పేర్కొంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాతో పాటు వారికి పనికొచ్చే ఇతర సేవలనూ ఆర్బీకేలు అందిస్తున్నాయని తెలిపింది. అన్ని పంటలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేస్తూ, వాస్తవ సాగుదారు సమాచారాన్ని ప్రభుత్వం తెలుసుకుంటోందని.. తద్వారా నిజమైన సాగుదారులకు వైఎస్సార్ సున్నా వడ్డీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలను అందిస్తోందని ప్రశంసించింది. రైతుల నుంచి పంటల కొనుగోలు కూడా ఆర్బీకేల్లోనే చేపడుతోందని తెలిపింది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్నదాతలను అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపిస్తోందని కొనియాడింది.

తెలంగాణ

సాయుధ దళాలు వినూత్నంగా ఉండాలి

- కాలానుగుణంగా కొత్త ఆవిష్కరణలు ఎంతో అవసరం
- కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన 213 మంది ఫ్లైట్ కేడెట్లు



కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్


సాక్షి, హైదరాబాద్: సాయుధ దళాలలో సంప్రదాయ పద్ధతులకు తగిన ప్రాధాన్యత ఇస్తూనే.. కాలానుగుణంగా కొత్త ఆవిష్కరణలు తేవాల్సిన అవసరం ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. కొత్త ఆలోచనలు చేయకుండా చాలా కాలం ఒకే తరహా సంప్రదాయాలను అనుసరిస్తే వ్యవస్థలో జడత్వం వస్తుందని అభిప్రాయపడ్డారు. యువ అధికారులు తమలో నూతనత్వానికి, వినూత్న ఆలోచనలకు ఎప్పటికప్పుడు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ శివార్లలోని దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (CGP) జరిగింది. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న 213 ఫ్లైట్ కేడెట్లు (వీరిలో 25 మంది మహిళలు) పాల్గొన్నారు. పరేడ్‌కు సమీక్ష అధికారిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొని యువ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. యువ కేడెట్లు భారత వాయుసేనలోని వివిధ విభాగాల్లో విధుల్లోకి చేరడానికి సూచికగా వారందకీ అధికారిక హోదా కల్పిస్తూ రాష్ట్రపతి కమిషన్ (అధికారిక బ్యాడ్జీలను)ను ప్రదానం చేశారు. తర్వాత రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు. ''నిరంతరం అభివృద్ధి చెందుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయాలు, ఆవిష్కరణల మధ్య సమతుల్యత సాధించండి. సంప్రదాయాన్ని మాత్రమే పాటిస్తే.. మనం ఎండిపోయిన సరస్సులా మారిపోతాం. మనం ప్రవహించే నదిలా ఉండాలి. ఇందుకు సంప్రదాయంతోపాటు కొత్తదనాన్ని తీసుకురావాలి. వాయుసేన అధికారులుగా మీరు ఆకాశంలో ఎగురుతూ ఉండండి. ఎక్కువ ఎత్తును తాకండి, కానీ నేలతో మీ సంబంధాన్ని కొనసాగించండి'' అని పిలుపునిచ్చారు. అకాడమీలో భారత వాయుసేనకు చెందిన అధికారులతోపాటు నౌకాదళానికి చెందిన ఎనిమిది మంది అధికారులు, కోస్ట్ గార్డ్ (తీర రక్షక దళం) నుంచి తొమ్మిది మంది, స్నేహపూర్వక దేశమైన వియత్నాం నుంచి ఇద్దరు అధికారులు కూడా ఫ్లయింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నుంచి అవార్డులు అందుకున్నారు. శిక్షణలో టాపర్‌గా నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అతుల్ ప్రకాశ్ రాష్ట్రపతి ఫలకాన్ని చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ స్వోర్డ్ ఆఫ్ హానర్‌ను రాజ్‌నాథ్ చేతులమీదుగా అందుకున్నారు. గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లలో మెరిట్లో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అమరీందర్ జీత్ సింగ్‌కు రాష్ట్రపతి ఫలకం లభించింది. అంతకుముందు ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, యువ కేడెట్లతో ప్రమాణం చేయించారు.

ఆకట్టుకున్న కవాతు

శిక్షణలో ప్రథమస్థానంలో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అతుల్ ప్రకాశ్ ఆదివారం నాటి కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా యువ ఫ్లయింగ్ కేడెట్లు చేసిన కవాతు ఆకట్టుకుంది. పరేడ్ అనంతరం భారత వాయుసేన నిర్వహించిన వైమానిక ప్రదర్శన అలరించింది. సారంగ్ హెలికాప్టర్ బృందం, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృంద విన్యాసాలు, సుఖోయ్-30 ఎంకేఐ గగనతల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


నేను ఏ ఉద్యోగం చేయలేను

- ధర్మప్రచారానికి ఉపయోగపడేలా సాయం చేయండి
- రేవంత్‌రెడ్డిని కోరిన మాజీ డీఎస్పీ నళిని



సాక్షి, హైదరాబాద్: తాను ఇప్పుడు ఏ ఉద్యోగం చేసే స్థితిలో లేనని, తనకు ఉద్యోగం ఇవ్వడానికి బదులుగా ధర్మ ప్రచారానికి ఉపయోగపడేలా ఏదైనా సహాయం చేస్తే స్వీకరిస్తానని మాజీ డీఎస్పీ నళినీ చెప్పారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఇన్నాళ్లకు తన పోరాటాన్ని, సంఘర్షణను జనం తెలుసుకొనే ఒక సందర్భం సృష్టించడం సంతోషంగా ఉందన్నారు. అందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అంటూ ఫేస్‌బుక్‌లో బహిరంగ లేఖను పోస్ట్ చేశారు. కొద్దిరోజులుగా మీడియా మిత్రులు తన ప్రతిస్పందన తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, అందుకే ఫేస్‌బుక్‌లో బహిరంగ లేఖ పెడుతున్నానని చెప్పారు. 'తెలంగాణ ఉద్యమంలో బలికి బయటపడి సర్వస్వం కోల్పోయిన వాళ్లలో నేను ముందు వరుసలో ఉన్నానన్న విషయం ప్రజలకు అర్థమైంది. నిజం నిలకడ మీద తెలుస్తుందన్నది నిరూపితమైంది. గతం ఒక రీల్ మాదిరి నా కళ్ల ముందు కదులుతోంది. ఇన్నాళ్లు నేను ఒక సస్పెండ్ ఆఫీసర్‌గా 'సోషల్ స్టిగ్మా (కళంకం)'ను మోశాను. నన్ను ఆనాటి ప్రభుత్వం మూడేళ్లు చాలా ఇబ్బంది పెట్టింది. 'దేవుడు నన్ను క్రిమినాలజీ (నేర శాస్త్రం) నుంచి ఫిలాసఫీ (వేదాంతం) వైపు నడిపించాడు. రెండేళ్ల క్రితం నా జీవితంలోకి మహర్షి దయానంద సరస్వతి ప్రవేశించారు. వేదమాత, యజ్ఞ దేవతలు నాలో తిరిగి ప్రాణం పోశారు. అందుకే నేను నా జీవితాన్ని ఆ మహనీయుని చరణాలకు సమర్పించుకున్నాను. మీరు (సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) రాజు, నేను బ్రాహ్మణిని. మీరు ఇచ్చే ప్రభుత్వ ఫండ్‌ను నేను స్వతంత్రంగా ఉంటూనే వేద, యజ్ఞ, ధార్మిక కేంద్ర ఏర్పాటుకు వినియోగిస్తాను' అని పేర్కొన్నారు.

సన్నిధి



సువార్త

అది చిరస్మరణీయమైన క్రిస్మస్!!

అమెరికాలోని విస్కాన్సిన్ లో ఒక షాపింగ్ మాల్ చిరుద్యోగి, ఏడాదంతా కూడబెట్టిన తన డబ్బుతో బహుమానాలు కొని క్రిస్మస్ సమయంలో శాంటాక్లాజ్ గా వాటిని పిల్లలకు పంచుతాడు. అంతా అతన్ని సాంటా అనే పిలుస్తారు. ఒక క్రిస్మస్ సమయంలో చిన్న పిల్లవాడు, వృద్ధురాలైన అతని తాతమ్మ, చేతిలో ఒక పదేళ్ల పాప ఫోటోతో వచ్చి ఆయన్ను కలిశారు. 'ఎవరీమె?' అనడిగాడు శాంటా. 'నా సోదరి శారా' అన్నాడా పిల్లాడు. అతన్ని దగ్గరికి తీసుకొని 'ఇదిగో ఈ బహుమానాల్లో నీకు, నీ సోదరికి కూడా ఏమి కావాలో తీసుకో' అన్నాడు శాంటా. అపుడతని తాతమ్మ, 'శారా రక్తకణాల కాన్సర్‌తో ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య ఉంది. ఈ క్రిస్మస్ దాకా ఆమె బతకదేమో అంటున్నారు డాక్టర్లు. కాని శారా ఈ క్రిస్మస్ కు శాంటాను చూడాలనుకొంటోంది. వీలైతే ఒకసారి ఆసుపత్రికి రాగలరా? అని ఆమె శాంటాను కన్నీళ్లతో ప్రాధేయపడింది. శారా కథ విన్న శాంటా బాగా కలత చెంది, సరేనన్నాడు. ఆ సాయంత్రమే తన శాంటా డ్రెస్‌లో అతను ఆసుపత్రికి వెళ్ళాడు. గదిలో శారా అస్థిపంజరంలాగా మంచం పైన ఉంది. ఆమె తల్లి, తండ్రి, తమ్ముడు, తాతమ్మ, మరొక ఆంటీ చుట్టూ ఉన్నారు.

కృశించిన ఆమె వంటినిండా మచ్చలున్నాయి. కీమోథెరపీతో వెంట్రుకలు పూర్తిగా ఊడిపోయాయి. గది నిండా మృత్యువు వాతావరణం. శాంటా మనస్సు చివుక్కుమంది. అయినా తమాయించుకొని, శాంటా పద్ధతిలో ఒహ్హో.... అంటూ పెద్దగా ఆనంద శబ్దాలు చేస్తూ గదిలోకి వెళ్ళాడు. అతన్ని చూసి ఆనందం పట్టలేక 'శాంటా ...' అంటూ శారా గట్టిగా అరిచి మంచం మీది నుంచి లేవబోయింది. శాంటా పరిగెత్తుకెళ్లి ఆమె నుదుటిమీద ముద్దుపెట్టి, ఆమె పక్కనే కూర్చున్నాడు. శారా ఆనందం తో సాంటాకు ఏవేవో ఊసులు చెబుతోంది. కన్నీళ్లు ఆపుకొంటూనే సాంటా అవన్నీ వింటూ తాను కూడా చెబుతున్నాడు. శారాలో అంత ఆనందాన్ని చూసిన కుటుంబ సభ్యుల ఆనందానికి కూడా అంతు లేకుండా పోయింది. దానికి కారకుడైన సాంటాకు కృతజ్ఞతలు తెలిపారు. 'శారా, ఒక దేవదూత నీకోసం ప్రత్యేకంగా నియమించమని దేవుని ప్రార్ధిస్తాను' అన్నాడాయన. అంతా కళ్ళు మూసుకోగా, శాంటా ఆమె మంచం వద్ద మోకరిల్లి, శారా తల మీద చేయి పెట్టి, 'దేవా ఈ చిన్నబిడ్డను ముట్టండి, శారా వ్యాధిని బాగుచెయ్యండి' అంటూ ప్రార్థించాడు. అంతా 'ఆమెన్' అన్న వెంటనే, 'సైలెంట్ నైట్...' అనే సంప్రదాయక క్రిస్మస్ కీర్తనను శాంటా శ్రావ్యంగా అందుకోగా, చెమ్మగిల్లిన నేత్రాలతో సారాతో సహా అంతా కలిసి అద్భుతంగా పాడారు.'శారా, నేను చనిపోతున్నాను అని కాక, నేను బాగవుతాను అన్న భావన ఇక నుంచి నీలో బలపడాలి. ఈ వేసవిలో నువ్వు నీ స్నేహితులతో తనివి తీరా ఆడుకోబోతున్నావు. వచ్చే ఏడాది క్రిస్మస్ సమయంలో నా మాల్ కు వచ్చి నన్ను కలుసుకోబోతున్నావు' అని శాంటా శారాకు ధైర్యం చెప్పాడు. మెరిసే కళ్ళతో శారా 'సరే సాంటా' అంది .సాంటా శారాకు ఆటవస్తువులివ్వలేదు, ఆ క్రిస్మస్ కు జీవితంపై 'ఆశ' అనే గొప్ప బహుమతినిచ్చాడు. అంతా ఆయన్ను హత్తుకొని సాగనంపారు.

ఏడాది తరువాత మాల్‌కు ఒకమ్మాయి వచ్చి సాంటాను కలిసి 'నేను గుర్తున్నానా సాంటా?' అనడిగింది. పిల్లలందరితో అన్నట్టే 'ఎందుకు గుర్తులేవు? ఉన్నావు' అన్నాడు శాంటా. 'పోయిన ఏడాది నన్ను చూసేందుకు మీరు ఆసుపత్రికి వచ్చారు' అని ఆమె అంటూండగానే శాంటాకు గుర్తొచ్చి 'నీవు శారావు కదూ' అన్నాడు అత్యాశ్చర్యంగా. అద్భుతం!! జుట్టు బాగా పెరిగి, ఎంతో బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా ఉంది శారా. ఆనంద బాష్పాలతో శారాను శాంటా హత్తుకున్నాడు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులంతా వచ్చారు. ఈసారి ఆమె బొమ్మల కోసం రాలేదు. తనలాంటి పిల్లలకు పంచమంటూ బోలెడు ఆటబొమ్మలు, వస్తువులు తెచ్చిచ్చి వెళ్ళింది. 'ఇది నేను ఎన్నటికీ మర్చిపోలేని క్రిస్మస్' అంటూ, శారాకిచ్చిన 'కొత్త జీవితం' అనే బహుమానానికి ఆకాశం వైపు చూస్తూ సాంటా దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు.

– సందేశ్ అలెగ్జాండర్

మంచిమాట

వ్యక్తం... అవ్యక్తం



పైకి పచ్చగా కనిపించే చెట్టు ఎంత విస్తరించి ఉన్నదో అంత కన్న ఎక్కువగా దాని వేళ్ళు నేలలో పాతుకుని పోయి ఉంటాయి. చెట్టు అంటే పైకి కనిపించే కొమ్మలు, ఆకులు, పూలు, పళ్ళు మాత్రమే అనుకుంటే ఎంత పొరపాటో తెలుస్తోంది కదా. అదే విధంగా మనకి పైకి కనిపించే ప్రపంచం వెనుక ఎంతో ప్రయత్నం ఉంది. కనపడేది ఒక వంతు మాత్రమే... మూలమైనది మూడు వంతులు అని మన ఋషులు దర్శించి తెలియ చేశారు.

ఒక వైద్యుడి దగ్గరకి వెళ్లినప్పుడు ఆయన నాలుగు మాటలు చకచక రాయటం చూసి, ఈ మాత్రానికే రూ. 500 తీసుకున్నాడు అని వాపోతారు. కాని, ఆ నాలుగు మాటలు, అంటే మందుల పేర్లు రాయటానికి ఆయన ఎంత కాలం కృషి చేసి ఉంటారో . ఒకసారి ఒక యంత్రం హఠాత్తుగా ఆగిపోయిందట. అందరూ రకరకాలుగా ప్రయత్నం చేశారు కానీ అది మొండికేసింది. ఒక ఇంజినీర్‌ని పిలిచారు. ఆయన వచ్చి అటు ఇటు పరిశీలించి సుత్తి తీసుకుని సున్నితంగా ఒక దెబ్బ వెయ్యగానే అది పని చెయ్యటం మొదలు పెట్టింది. తన ఫీజు అడగగానే ఒక సుత్తిదెబ్బ ఇంత ఖరీదా? అని అడిగాడట యజమాని. దానికి ఆ ఇంజినీరు సుత్తి దెబ్బకి ఒక రూపాయే. కానీ ఎక్కడ కొట్టాలో, ఎట్లా కొట్టాలో తెలుసుకున్నందుకు మిగిలినది అన్నాడట. నిజమే కదా. సుత్తిదెబ్బ అయితే ఎవరైనా కొట్టి ఉండవచ్చుగా. ఇంజినీరు ని పిలవటం ఎందుకు? పైకి కనిపించే పని వెనక ఉన్న కృషే పనిలో నైపుణ్యానికి కారణం.

''పాదోస్య విశ్వా భూతాని త్రిపాదస్యా మృతమ్ దివి'' అంది పురుష సూక్తం. అది అర్థం కావటానికి మానవుడు స్వయంగా ఇతర ప్రమేయం లేకుండా తయారు చెయ్యగల ఒకే ఒక్కమాటని ఉదాహరణగా తీసుకోవచ్చు.''త్రీణి నిహితా గుహాని తాని విదుర్బ్రాహ్మణా మనీషిణః నేంగయన్తి తురీయమ్ వాచో మనుష్యా వదంతి''పరా, పశ్యంతి, మాధ్యమా అనే మూడుస్థాయిల ప్రయత్నం తరువాత వైఖరి అనబడే అందరికి వినపడే వాక్కు వెలువడుతుంది. మనకి తెలియకుండానే ఇంత ప్రయత్నం జరిగిపోతోంది. ఇది అర్థం చేసుకోగలిగితే సృష్టి రహస్యం చాలా వరకు తెలిసినట్టే. దృశ్యమాన జగత్తుకి కారణమైన అదృశ్యంగా ఉన్న దానిని కనీసం ఊహించగలుగుతాం. ఇది ఇంకా బాగా అర్థం కావాలంటే ఒక నాటక ప్రదర్శననో, చలనచిత్రాన్నో చూడండి. రంగస్థలం మీద ఒక గంటో, రెండుగంటలో ప్రదర్శించే నాటకానికి పూర్వరంగం అంటే ముందు చేసే ప్రయత్నం ఎంతో. తెరమీద కనపడే ఒక దృశ్యాన్ని చిత్రీకరించటానికి ఎంతమంది ఎన్నిరోజులు శ్రమించి ఉంటారో ఈ మధ్య కాలంలో బాగా ప్రచారం చేస్తూనే ఉన్నారుగా. ఒక గంట పాట కచేరీకి ఇన్ని వేలా? అని ప్రశ్నించే వారికి సమాధానం అది ఆ గంట కచేరీకి కాదు, దానికి ముందు చేసిన సాధనకి అని.

ఒక చెట్టుని కొట్టటానికి గంట పట్టింది. ఎంత తేలిగ్గా అయిపోయిందో అని చూసే వాళ్ళు అనుకుంటారు. కాని, గంట సమయంలో కొట్టటానికి గాను గొడ్డలికి తగినంత పదును పెట్టటానికి కనీసం పది గంటలు పట్టి ఉంటుంది. కనపడే పని వెనక కనపడకుండా ఉన్న సంసిద్ధత కోసం చేసిన ప్రయత్నం ఎంత ఉంటుందో అర్థం చేసుకుంటే పని సమయాన్ని సరిగా అంచనా వేసినట్టు అవుతుంది. చాలా సందర్భాలలో చేసే పని విలువని సరిగా అంచనా వెయ్యలేకపోవటానికి ఇటువంటి అవగాహనాలోపమే కారణం.

ఒక మేధావి ఇచ్చిన గంట ఉపన్యాసం వింటే వంద గ్రంథాలు చదివినట్టే అనేది అందుకనే. ఒక్క గంట మాట్లాడటానికి వాళ్ళు అప్పటికి కొన్ని గ్రంథాలు చదువుతారు. అంతకుముందే ఎన్నో గ్రంథాలు చదివి ఉంటారు. దానికి వారి అనుభవం, విశ్లేషణ జోడించబడతాయి. ఈ దృష్టి అలవరచుకుంటే వ్యక్తం నుండి అవ్యక్తానికి ప్రస్థానం ప్రారంభమైనట్టే.

– డా. ఎన్.అనంత లక్ష్మి

వాగ్గేయకార వైభవం

ఇల్లు గుర్తుకు రావడం లేదా..!



శంకరాచార్యులవారికి వారి గురువయిన గోవింద భగవత్పాదులవారి మీద ఎటువంటి గురి ఉంటుందో అంత గొప్ప గురి వాగ్గేయకారులకు కూడా వారి గురువులపట్ల వ్యక్తమయింది. శ్రద్ధాసక్తులతో శుశ్రూష చేసి వారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ముత్తుస్వామి దీక్షితార్ వారి చిన్నతనంలో వారింటికి వయోధికుడయిన చిదంబరనాథయోగి వచ్చి విడిది చేసాడు. ఆయన కాశీ వెడుతూ సహాయంగా తనవెంట ముత్తుస్వామిని పంపమని వారి తండ్రిని అడిగాడు.

శిష్యుడు నాకు ఒక మంచి గురువు కావాలని ఎంత తాపత్రయ పడతాడో అలాగే ఒక గురువు కూడా శిష్యుడిని పొందాలని ఆర్తిపొందుతాడు. జీవితంలో మొదటిసారిగా వివేకానందుడు వచ్చినప్పుడు రామకృష్ణ పరమహంస పిచ్చిగా గంతులు వేస్తూ కౌగిలించుకున్నాడు.'నీ గురించి ఎంత కాలం నుంచి ఎదురు చూస్తున్నాన్రా నాయనా! ఇంత కాలానికి నామీద దయ కలిగిందా... ఇప్పుడు వచ్చావా..' అని మాట్లాడుతుంటే 'ఈయనకు పిచ్చి ఉందని విన్నా. నిజమేననిపిస్తున్నది. ఈయన నాగురించి ఎదురు చూడటమేమిటి?' అనుకున్నాడు వివేకానందుడు. యోగ్యుడయిన శిష్యుడిని గుర్తించి ఉద్ధరించడానికి ఆరాటపడతాడు గురువు. ముత్తుస్వామి వారిలో ఆ యోగికి ఏ తేజస్సు కనబడిందో తన వెంట తీసుకెళ్ళారు. రామచంద్రమూర్తిని విశ్వామిత్ర మహర్షితో పంపించడానికి దశరథ మహారాజు ఎలా సంకోచించారో అలా మథనపడుతున్న ముత్తుస్వామి తండ్రికి ఆయన మిత్రుడు నచ్చచెప్పి అంగీకరింపచేసాడు. ఇంత చిన్నవయసులో అమ్మానాన్నా దగ్గర ఉండకుండా, ఆడుకుంటూ పాడుకుంటూ చదువుకుంటూ తోబుట్టువులతో, తోటి పిల్లలతో ఆనందంగా గడపకుండా... ఎక్కడ కాశీ ...అదేమన్నా పక్క ఊరా దిగబెట్టి రావడానికి ... వంటి ఆలోచనలేవీ చేయకుండా... ఇంతటి మహానుభావుడితో కలిసి వెళ్ళడం, ఆయన మాటలు వినడం నా జీవిత అభ్యున్నతికి కారణం– అని అనుకున్న ముత్తుస్వామి గురువు వెంట బయల్దేరి వెళ్ళాడు. అక్కడ గురువు శిష్యుడికి శ్రీవిద్య మంత్రాన్ని ఉపదేశించారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురువులు ఒక మంత్రం ఇస్తే వాగ్గేయకారులకు ఎంత తిరుగులేని నమ్మకం అంటే.. త్యాగరాజ స్వామివారు రోజుకు లక్షా 25వేల సార్లు తారకనామాన్ని జపిస్తూ గొప్ప గొప్ప కీర్తనలు మనకు అందిస్తూ చివరకు ఆయనలో ఐక్యమయ్యారు. అలాగే ముత్తుస్వామి వారు కూడా అమ్మవారికి మనసులోనే గుడి కట్టి మంత్రజపం, ఆరాధన చేస్తుండేవారు.

ఒక రోజున గురువుగారు ముత్తుస్వామిని పిలిచి –''లేత వయసులో నాతో కలిసి వచ్చేసావు, ఎక్కడో దక్షిణదేశం నుంచి... ఎక్కడ మలవి అగ్రహారం, ఎక్కడ కాశీ పట్టణం! చాలా కాలమయింది నీవిక్కడికి వచ్చి. –నేను మా అమ్మగారిని, నాన్నగారిని చూడాలని ఉంది, తోబుట్టువులు గుర్తుకొస్తున్నారు. వారిని విడిచి వచ్చాను. నేను ఇక ఇంటికి ఎప్పుడు బయల్దేరాలి?'' అని అడగాలి కదా! అడగవేం ..'' అన్నారు. దానికి ముత్తుస్వామి..''గురువుగారికి స్థాన శుశ్రూష, ఆత్మశుశ్రూష, దేహ శుశ్రూష చేస్తున్నా.. ఇలా గురువుగారిని సేవించడం అంటే పరబ్రహ్మాన్ని సేవించినట్టే... ఇంతకన్నా నాకు ఇంకేం భాగ్యం కావాలి'' అని బదులిస్తే గురువు తన్మయత్వం చెందారు.

సినిమా

బాక్సాఫీస్ వేటలో యానిమల్ బ్లాక్ బస్టర్



రష్మిక, రణబీర్ కపూర్

బాక్సాఫీస్ వద్ద 'యానిమల్' వసూళ్ల వేట కొనసాగుతోంది. తొలి చిత్రం 'అర్జున్ రెడ్డి'తోనే సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఆ తర్వాత హిందీ పరిశ్రమ వైపు వెళ్లారు. అక్కడ 'అర్జున్ రెడ్డి' చిత్రాన్నే 'కబీర్ సింగ్'గా రీమేక్ చేసి, మరో సూపర్ హిట్ అందుకున్నారు. ఈ రెండు చిత్రాలు ఒక ఎత్తయితే సందీప్ తెరకెక్కించిన మూడో చిత్రం 'యానిమల్' వసూళ్ల పరంగా మరో ఎత్తు అనాలి. రణబీర్ కపూర్ కథానాయకునిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం డిసెంబర్ 1న విడుదలై, సంచలన వసూళ్లతో దూసుకెళుతోంది. విడుదలైన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ. 116 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇక తొలి వారాంతానికి రూ. 356 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ సినిమా 16 రోజులకు ప్రపంచవ్యాప్తంగా రూ. 817.36 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. రణబీర్ కపూర్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించే దిశగా ఈ చిత్రం దూసుకెళ్తోంది. ఇప్పటివరకూ సాధించిన వసూళ్ల ప్రకారం ఈ ఏడాది విడుదలై, అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో 'యానిమల్' టాప్ ఫైవ్‌లో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది షారుక్ ఖాన్ హీరోగా నటించిన 'జవాన్', 'పఠాన్' చిత్రాలు రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్ కొల్లగొట్టి మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇక 'యానిమల్' చిత్రం తెలుగులోనూ మంచి వసూళ్లు రాబడుతోంది. తెలుగు అనువాదాన్ని 'దిల్' రాజు విడుదల చేశారు. రిలీజ్ అయిన తొలి రోజే రూ. 15 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించిందని 'దిల్' రాజు పేర్కొన్నారు. తెలుగు వెర్షన్ ఇప్పటివరకూ దాదాపు రూ. 60 కోట్ల పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇలా ఈ ఏడాది సందీప్ రెడ్డి బాక్సాఫీస్‌ని షేక్ చేసే చిత్రం తీశారు. ఈ చిత్రానికి ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా ఓ నిర్మాత. రష్మికా మందన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రి కీలక పాత్రలు పోషించారు. 'యానిమల్'కి రెండో భాగం 'యానిమల్ పార్క్' రానున్న సంగతి తెలిసిందే.



సందీప్ రెడ్డి వంగా

రవితేజ మిస్టర్ బచ్చన్



రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్ ఖరారైంది.'నామ్ తో సునా హోగా..!' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. పనోరమా స్టూడియోస్, టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఈ సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి కె. రఘురామకృష్ణ, టీజీ భరత్‌లు కలిసి కెమెరా స్విచ్చాన్ చేయగా, మంగత్ పాఠక్ క్లాప్ ఇచ్చారు. ముహూర్తపు షాట్‌కు ''మిస్టర్ బచ్చన్... నామ్ తో సునా హోగా!'' అని రవితేజ డైలాగ్ చెప్పగా, వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. రవితేజ, విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, రఘురామకృష్ణలు కలిసి హరీష్ శంకర్‌కు ఈ సినిమా స్క్రిప్ట్‌ను అందించారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె. మేయర్, సహ–నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ఊతకొట్టుడు కొట్టేశాడు!

'ఏం చేస్తాన్నాడెంటి.. మీవోడు.. ' (ఆషికా రంగనాథ్), 'నిన్నే మావిడితోటలో ఇరవైమందిని ఊతకొట్టుడు కొట్టేశాడు ('అల్లరి' నరేశ్)', 'ఆడేమైనా కుర్రాడనుకుంటున్నాడా..కొంచెం తగ్గమను (ఆషికా)'...అన్న డైలాగ్స్‌తో విడుదలైంది 'నా సామిరంగ' సినిమా టీజర్. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'నా సామిరంగ' చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. 'ఏం అడగాలో దానికి తెలియదు. ఏం అడుగుతుందో నీకు తెలియదు. ఏం చేయాలో నాకు తెలియదు' (నాగార్జున) అన్న డైలాగ్స్‌తో ఈ టీజర్ సాగుతుంది. ''సినిమాలో నాగార్జునగారి గోదావరి యాస చాలా బాగుంటుంది. రొమాన్స్, స్నేహం, యాక్షన్ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: కీరవాణి.



రాజ్ తరుణ్, నాగార్జున, 'అల్లరి' నరేశ్

రజనీ సినిమాలో రణ్‌వీర్?

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది వేసవిలో ప్రారంభం కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం దర్శకుడు లోకేష్ కనగరాజ్ బాలీవుడ్ స్టార్స్ షారుక్ ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లను సంప్రదించారట. అయితే ఇటీవల కాలంలో ఇతర చిత్రాల్లో ఎక్కువగా గెస్ట్ రోల్స్ చేసిన కారణంతో రజనీ సినిమాకు షారుక్ సున్నితంగా నో చెప్పారని, దీంతో రణ్‌వీర్‌సింగ్‌ను లోకేష్ కలిసి కథ వినిపించారని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... రజనీకాంత్ సినిమాలో రణ్‌వీర్‌సింగ్ నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు రజనీకాంత్ ప్రస్తుతం 'వేట్టయాన్' సినిమాతో బిజీగా ఉన్నారు. అలాగే రజనీకాంత్ ఓ లీడ్ రోల్ చేసిన 'లాల్ సలామ్' చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.



రణ్‌వీర్ సింగ్

విలేజ్ లవ్‌స్టోరీ



అవికా గోర్, అనురాగ్

అనురాగ్, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా సత్య ద్వారపూడి దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన గ్రామీణ ప్రేమకథా చిత్రం 'ఉమాపతి'. ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. రెండు ఊర్ల మధ్య గొడవలు హీరో హీరోయిన్ల ప్రేమకు ఎలా అడ్డంకిగా మారాయి? ఫైనల్‌గా వీరి లవ్‌స్టోరీ ఎలా ముగుస్తుంది? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందన్నట్లుగా విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. పోసాని కృష్ణమురళి, తులసి, ప్రవీణ్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: శక్తికాంత్ కార్తీక్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు.

చలో కోల్‌కత్తా

ప్రేక్షకులను భయపెడతా అంటున్నారు బాలీవుడ్ నటి కాజోల్. ఆమె ప్రధాన పాత్రధారిగా విశాల్ ఫురియా ఓ సినిమాను తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారని బాలీవుడ్ సమాచారం. పూర్తిస్థాయి హారర్ జానర్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావొచ్చాయని, జనవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేలా విశాల్ ప్లాన్ చేశారని టాక్. తొలి షెడ్యూల్ కోల్‌కతాలో మొదలవుతుందట. నెల రోజులకు పైగా అక్కడి లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన చేశారట యూనిట్. ఇక ఈ సినిమాను కాజోల్ భర్త, దర్శక–నటుడు, నిర్మాత అజయ్ దేవగన్ నిర్మించనున్నారని బాలీవుడ్ భోగట్టా.



కాజోల్

కామెడీ ఎక్స్‌ప్రెస్

చైతన్యారావు, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఎన్ఆర్ఐ ఎంటర్‌టైన్మెంట్స్, న్యూ రీల్ ఇండియా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో నాగార్జున విడుదల చేసి, మాట్లాడుతూ–'' వినోదాత్మకంగా సందేశంతో కూడిన ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''లాస్ ఏంజెల్స్‌లో ఉంటూ ఎన్నో హాలీవుడ్ చిత్రాలకు పని చేశాను. కానీ తెలుగు సినిమా చేయాలనేది నా కల. నాగార్జున, అమలగార్ల ప్రోత్సాహంతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేశాను. మా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన నాగార్జునగారికి ధన్యవాదాలు'' అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: కళ్యాణీ మాలిక్, నేపథ్యసంగీతం: ఆర్పీ పట్నాయక్.



హెబ్బా పటేల్, చైతన్యా రావు



పాకిస్తాన్‌తో డేవిస్‌కప్ మ్యాచ్: భారత జట్టులో సాకేత్

ఇస్లామాబాద్ వేదికగా పాకిస్తాన్ జట్టుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగే డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో పాల్గొనే భారత టెన్నిస్ జట్టును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని జట్టులోకి పునరాగమనం చేశాడు. 2022 సెప్టెంబర్‌లో నార్వేతో జరిగిన వరల్డ్ గ్రూప్ తొలి రౌండ్ మ్యాచ్‌లో చివరిసారి సాకేత్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, యూకీ బాంబ్రీ, నిక్కీ పునాచా, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.

ఇషాన్ కిషన్ స్థానంలో కేఎస్ భరత్



దక్షిణాఫ్రికాతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టులో ఒక మార్పు జరిగింది. ముందుగా ప్రకటించిన జట్టులో సభ్యుడిగా ఉన్న ఇషాన్ కిషన్ వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్ నుంచి వైదొలిగాడు. ఇషాన్ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వికెట్ కీపర్ కేఎస్ భరత్‌తో భర్తీ చేశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోనే ఆడుతున్న భారత 'ఎ' జట్టుకు భరత్ కెప్టెన్‌గా ఉన్నాడు. భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్టు సెంచూరియన్‌లో (డిసెంబర్ 26-30), రెండో టెస్టు కేప్‌టౌన్‌లో (జనవరి 3-7) జరుగుతాయి.

అర్ష్‌దీప్, అవేశ్ అదుర్స్

వాండరర్స్ వేదికపై ఆఖరి టి20లో ధనాధన్ మెరుపులతో సునాయాసంగా 200 పైచిలుకు పరుగులు చేసిన భారత్... తర్వాత సఫారీ మెడకు స్పిన్ ఉచ్చు బిగించి మ్యాచ్ గెలిచింది. సిరీస్‌ను సమం చేసింది. మారని వేదికపై మారిన ఫార్మాట్‌లో అలాంటి విజయంతోనే టీమిండియా వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. అయితే ఇందులో ముందు దక్షిణాఫ్రికాను కుప్ప కూల్చేసి తర్వాత సులువైన లక్ష్యాన్ని టీమిండియా చకచకా ఛేదించేసింది. ఈ గెలుపుతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే రేపు పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగుతుంది.

- నిప్పులు చెరిగిన భారత పేస్ బౌలర్లు
- తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై 8 వికెట్లతో భారత్ ఘనవిజయం
- అర్ధ సెంచరీలతో రాణించిన సాయి సుదర్శన్, శ్రేయస్ అయ్యర్



అవేశ్ 4/27



అర్ష్‌దీప్ 5/37



సాయి సుదర్శన్ 55 నాటౌట్

జొహన్నెస్‌బర్గ్: పేస్ బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్ (5/37), అవేశ్ ఖాన్ (4/27)ల అసాధారణ స్పెల్... అరంగేట్రం మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ (43 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు), సీనియర్ శ్రేయస్ అయ్యర్ (45 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు.. వెరసి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో గెలిచి శుభారంభం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 27.3 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. ఎనిమిదో వరుసలో బ్యాటింగ్‌కు దిగిన ఫెలుక్వాయో (49 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్! అనంతరం భారత్ 16.4 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసి గెలిచింది. కెరీర్‌లోని తొలి మూడు వన్డేల్లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయిన అర్ష్‌దీప్ తన నాలుగో వన్డేలో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. అంతేకాకుండా దక్షిణాఫ్రికాపై వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి భారత పేస్ బౌలర్‌గా అర్ష్‌దీప్ గుర్తింపు పొందాడు.

ఆ నలుగురితోనే...

ముందు బౌలింగ్‌లో ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఇద్దరిద్దరు చేసిన ప్రదర్శనతో టీమిండియా గర్జించింది. టాస్ గెలవగానే బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాపై అర్ష్‌దీప్ తన తొలిఓవర్ (ఇన్నింగ్స్ రెండో)లోనే చావుదెబ్బ తీశాడు. వరుస బంతుల్లో హెన్‌డ్రిక్స్ (0), డసెన్ (0)లను డకౌట్ చేశాడు. అడపాదడపా ఫోర్లు, సిక్సలు కొడుతున్న మరో ఓపెనర్ టోని డి జోర్జి (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)ని కూడా అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికా కుదేలైంది. ఆ తర్వాత పదో ఓవర్ ఆఖరి బంతికి క్లాసెన్ (6)నూ అతనే పెవిలియన్ చేర్చితే... 11వ ఓవర్ తొలి రెండు బంతుల్లో అవేశ్... మార్క్‌రమ్ (12), ముల్డర్ (0)లను పడగొట్టడంతో 52 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఫెలుక్వాయో చేసిన ఆ కాస్త పోరాటంతో సఫారీ వంద పైచిలుకు స్కోరు చేయగలిగింది.

సాయి, అయ్యర్ ఫిఫ్టీ-ఫిఫ్టీ

రుతురాజ్ (5) విఫలమైనా... సాయి సుదర్శన్, శ్రేయస్ అయ్యర్ ఆతిథ్య బౌలర్లపై పరుగుల భరతం పట్టడంతో ఏ దశలోనూ భారత్‌కు ఇబ్బందే ఎదురవలేదు. ఇద్దరు బౌండరీలతో స్కోరు వేగాన్ని పెంచారు. ఈ క్రమంలోనే భారత్ 8.4 ఓవర్లో 50 పరుగుల్ని, 15.1 ఓవర్లో వంద పరుగుల్ని అధిగమించింది. 16వ ఓవర్లోనే సుదర్శన్ 41 బంతుల్లో... అయ్యర్ 44 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నారు. లక్ష్యానికి చేరువయ్యాక అయ్యర్ అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తిలక్ వర్మ (1 నాటౌట్)తో సాయి సుదర్శన్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు.

253 భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 253వ ప్లేయర్‌గా తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల సాయి సుదర్శన్ గుర్తింపు పొందాడు.

116 స్వదేశంలో వన్డేల్లో దక్షిణాఫ్రికా జట్టుకిదే అత్యల్ప స్కోరు. 2018లో సెంచూరియన్‌లో భారత్‌పైనే దక్షిణాఫ్రికా 118 పరుగులకు ఆలౌటైంది.

17 భారత్ తరఫున అరంగేట్రం వన్డేలోనే అర్ధ సెంచరీ చేసిన 17వ ప్లేయర్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు.

6 వన్డే మ్యాచ్‌లో ఇద్దరు భారత పేస్ బౌలర్లు నాలుగు అంతకంటే ఎక్కువ వికెట్లు చొప్పున తీయడం ఇది ఆరోసారి మాత్రమే.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (బి) అర్ష్‌దీప్ 0; టోని (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 28; డసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (బి) అవేశ్ 12; క్లాసెన్ (బి) అర్ష్‌దీప్ 6; మిల్లర్ (సి) రాహుల్ (బి) అవేశ్ 2; ముల్డర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ 0; ఫెలుక్వాయో (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 33; కేశవ్ (సి) రుతురాజ్ (బి) అవేశ్ 4; బర్గర్ (బి) కుల్దీప్ 7; షమ్సీ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (27.3 ఓవర్లలో ఆలౌట్) 116. **వికెట్ల పతనం:** 1-3, 2-3, 3-42, 4-52, 5-52, 6-52, 7-58, 8-73, 9-101, 10-116. **బౌలింగ్:** ముకేశ్ 7-0-46-0, అర్ష్‌దీప్ 10-0-37-5, అవేశ్ 8-3-27-4, కుల్దీప్ 2.3-0-3-1.

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముల్డర్ 5; సాయి సుదర్శన్ (నాటౌట్) 55; అయ్యర్ (సి) మిల్లర్ (బి) ఫెలుక్వాయో 52; తిలక్ వర్మ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (16.4 ఓవర్లలో 2 వికెట్లకు) 117. **వికెట్ల పతనం:** 1-23, 2-111. **బౌలింగ్:** బర్గర్ 5.4-1-35-0, ముల్డర్ 4-0-26-1, కేశవ్ 3-0-19-0, షమ్సీ 3-0-22-0, ఫెలుక్వాయో 1-0-15-1.

ఆసీస్ ఘన విజయం

- 360 పరుగుల తేడాతో ఓడిన పాక్
- 500 వికెట్ల క్లబ్‌లో లయన్



లయన్

పెర్త్: పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 360 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. 450 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 30.2 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. పరుగుల తేడా పరంగా టెస్టుల్లో పాకిస్తాన్‌కిది రెండో అతిపెద్ద పరాజయం. పాక్ జట్టులో సౌద్ షకీల్ (24), బాబర్ ఆజమ్ (14), ఇమామ్ ఉల్ హఖ్ (10) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. ఆసీస్ బౌలర్లు మిచెల్ స్టార్క్ (3/31), హాజల్‌వుడ్ (3/13), నాథన్ లయన్ (2/14) పాక్‌ను దెబ్బ తీశారు. రెండు వికెట్లు తీసిన క్రమంలో ఆసీస్ ఆఫ్ స్పిన్నర్ లయన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. తద్వారా లయన్ టెస్టుల్లో 500 వికెట్లు తీసిన ఎనిమిదో బౌలర్‌గా... షేన్ వార్న్ (708), మెక్‌గ్రాత్ (563) తర్వాత ఆస్ట్రేలియా నుంచి ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా గుర్తింపు పొందాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 84/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 5 వికెట్లకు 233 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై పాకిస్తాన్‌కిది వరుసగా 15వ పరాజయం. చివరిసారి 1995లో ఆస్ట్రేలియా గడ్డపై పాకిస్తాన్ టెస్టులో గెలిచింది.



ఫిల్ సాల్ట్

ఇంగ్లండ్ సంచలనం

సెయింట్ జార్జ్: ఉత్కంఠ రేపిన మూడో టి20లో భారీ సిక్సర్లతో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ వేటలో 1-2తో నిలిచింది. మొదట విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగుల స్కోరు చేసింది. పూరన్ (45 బంతుల్లో 82; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెప్టెన్ పావెల్ (21 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత ఇంగ్లండ్ 19.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసి నెగ్గింది. ఇంగ్లండ్ స్కోరు 15 ఓవర్లలో 140/2. ఈ దశలో 30 బంతుల్లో 83 పరుగుల విజయ సమీకరణం ఇంగ్లండ్‌కు క్లిష్టమైంది. అయితే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (56 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 9 సిక్స్‌లు), బ్రూక్ (7 బంతుల్లో 31 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) భారీషాట్లతో అసాధ్యాన్ని సాధ్యం చేశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు 18 సిక్స్‌లు, విండీస్ బ్యాటర్లు 16 సిక్స్‌లు కొట్టడం విశేషం.

జైపూర్ పింక్‌పాంథర్స్ గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ రెండో విజయం నమోదు చేసింది. పట్నా పైరేట్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 29-28తో గెలిచింది. జైపూర్ తరఫున అజిత్ అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేశాడు.

ధ్రువ్-తనీషా జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



కటక్: ఒడిశా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారులకు రెండు విభాగాల్లో టైటిల్స్ లభించాయి. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం విజేతగా నిలువగా... పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్ చాంపియన్ అయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో ధ్రువ్-తనీషా జోడీ 74 నిమిషాల్లో17-21, 21-19, 23-21తో హీ యోంగ్ కాయ్ టెర్రీ-తాన్ వె హాన్ జెస్సికా (సింగపూర్) జంటను ఓడించింది. ధ్రువ్-తనీషా జోడీకి 7,900 డాలర్ల (రూ. 6 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సతీశ్ 21-18, 19-21, 21-14తో ఆయుశ్ శెట్టి (భారత్)పై గెలిచాడు. సతీశ్‌కు 7,500 డాలర్ల (రూ. 6 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. మహిళల డబుల్స్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 14-21, 17-21తో మెలీసా-రాచెల్ రోజ్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ (భారత్) జంట 20-22, 18-21, 17-21తో లిన్ బింగ్ వె-సు చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎంఈ సీఈఈ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2024

వైమానిక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏఎంఈ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2024 ప్రకటన విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా విమానయాన రంగంలో లైసెన్స్/ఇంజనీరింగ్/డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయి.

కోర్సుల వివరాలు

- » **లైసెన్స్ ప్రోగ్రామ్:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(డీజీసీఏ), కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(ఈఏఎస్ఏ).
- » **ఇంజనీరింగ్ ప్రోగ్రామ్:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్.
- » **గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్:** బీబీఏ(ఏవియేషన్), బీఎస్సీ(ఏఎంఈ).
- » **సర్టిఫికెట్ ప్రోగ్రామ్:** క్యాబిన్ క్రూ, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్,ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్.
- » **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత గ్రూపులో 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి లేదా ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు. **వయసు:** 14 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.03.2024
- » **అడ్మిట్ కార్డుల జారీ:**2024 ఏప్రిల్ చివరి వారం
- » **ప్రవేశ పరీక్ష తేది:** 2024 మే మొదటి వారం.
- » **ఫలితాల వెల్లడి తేది:** 2024 మే రెండో వారం
- » **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేది:** 2024, మే మూడో వారం.
- » **వెబ్‌సైట్:** www.amecee.in

ఐఐఎం లక్నోలో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, లక్నో.. జూన్ 2024 సెషన్‌కు సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(పీహెచ్‌డీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **స్పెషలైజేషన్:** అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, డెసిషన్ సైన్స్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.
- » **అర్హత:** డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. గేట్/జీఆర్ఈ/జీమ్యాట్/క్యాట్ లేదా జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్)లో స్కోరు సాధించి ఉండాలి.
- » **వయసు:** 55 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.
- » **వెబ్‌సైట్:** www.iiml.ac.in

కల సాకారం చేసుకోండిలా!

ఉద్యోగార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో శుభవార్త! డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024, జనవరి 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు దశల ఎంపిక ప్రక్రియలో.. తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష తేదీని కూడా ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్, పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » 81 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్
- » బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
- » జనవరి 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- » మొత్తం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ
- » మార్చి 17న ప్రిలిమినరీ ఎగ్జామినేషన్



ఏపీపీఎస్సీ గ్రూప్ 1

మొత్తం 81 పోస్టులు

ఏపీపీఎస్సీ తాజా గ్రూప్1 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 81 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో డిప్యూటీ కలెక్టర్-9 పోస్టులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్-18 పోస్టులు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్)-26 పోస్టులు, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్-6 పోస్టులు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి-3, కో-ఆపరేటివ్ సర్వీస్ డిప్యూటీ రిజిస్ట్రార్-5 పోస్టులు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్-3 పోస్టులు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్-4 పోస్టులు వంటివి ఉన్నాయి.

అర్హత

రాష్ట్ర స్థాయిలో ఎంతో కీలకంగా భావించే గ్రూప్-1 సర్వీసులకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం ఉంది. అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టులకు కామర్స్ గ్రూప్‌ను అర్హతగా పేర్కొనే అవకాశం ఉంది. విద్యార్హతలు, వయసు తదితర పూర్తి వివరాలు.. జనవరి 1, 2024న ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

గ్రూప్-1 పోస్టులకు మొత్తం మూడంచెల విధానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.అవి..ప్రిలిమినరీ పరీక్ష,మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

మొదటి దశలో ప్రిలిమ్స్

గ్రూప్-1 పోస్టుల ఎంపిక ప్రక్రియలో ముందుగా ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో సాగుతుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కుల జాబితాలో నిలిచిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఒక్కో పోస్టుకు 50 మందిని చొప్పున (1:50 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

240 మార్కులకు ప్రిలిమ్స్

- ప్రిలిమినరీ పరీక్షను రెండు పేపర్లు(పేపర్1, పేపర్ 2)గా 240 మార్కులకు నిర్వహిస్తారు. ప్రిలిమ్స్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మూడు గంటల వ్యవధిలో జరుగుతుంది.
- పేపర్-1 నాలుగు విభాగాల్లో మొత్తం 120 ప్రశ్నలు-120 మార్కులకు ఉంటుంది.
- హిస్టరీ అండ్ కల్చర్; రాజ్యాంగం, పాలిటీ; సోషల్ జస్టిస్, అంతర్జాతీయ సంబంధాలు; భారత్, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ,జాగ్రఫీల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్-2 పరీక్ష రెండు భాగాలుగా 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్ ఏలో జనరల్ మెంటల్ ఎబిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ అండ్ సైకలాజికల్ ఎబిలిటీస్ 60 మార్కులకు, పార్ట్ బీలో సైన్స్ అండ్ టెక్నాలజీ (30 మార్కులు), ప్రాంతీయం, జాతీయం, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్(30 మార్కులు) 60 మార్కులకు ఉంటాయి.
- నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కులను తగ్గిస్తారు.

రెండో దశ మెయిన్స్ ఇలా

- తొలి దశలో అర్హత సాధించిన వారికి రెండో దశలో మెయిన్ పరీక్ష ఉంటుంది. మెయిన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఏడు పేపర్లలో నిర్వహిస్తారు. ఇందులో రెండు అర్హత పరీక్షలు లాంగ్వేజ్ పేపర్-తెలుగు 150 మార్కులకు, లాంగ్వేజ్ ఇంగ్లిష్ 150 మార్కులకు ఉంటాయి.
- వీటితోపాటు పేపర్-1 జనరల్ ఎస్సే-150 మార్కులకు; పేపర్-2 ఏపీ, భారత చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం-150 మార్కులకు; పేపర్-3 పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా, ఎథిక్స్-150 మార్కులకు; పేపర్-4 ఎకానమీ, భారత దేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-150 మార్కులకు; పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ అంశాలు-150 మార్కులకు ఉంటాయి. ఈ ఐదు పేపర్లు మొత్తం 750 మార్కులకు జరుగుతాయి.
- ప్రతి పేపర్‌కు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.
- తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్లు కేవలం అర్హత పేపర్లు మాత్రమే. వీటిలో పొందిన మార్కులను మెరిట్‌కు పరిగణనలోకి తీసుకోరు. కానీ వీటిలో కనీస ఉత్తీర్ణత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఓసీ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్ కేటరీ అభ్యర్థులు 35 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 30% మార్కులు సాధించాలి. అప్పుడే మెయిన్ ఎగ్జామినేషన్‌లోని మిగిలిన అయిదు పేపర్ల మూల్యాంకన చేస్తారు. ఈ అయిదు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా.. చివరి దశ ఇంటర్వ్యూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

తుది దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో తుది దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ. మెయిన్ పరీక్షలోని అయిదు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా.. రిజర్వేషన్లు ఇతర నిబంధనలను అనుసరించి 1:2 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయిస్తారు. మెయిన్ 750 మార్కులు, ఇంటర్వ్యూ 75మార్కులు మొత్తం 825 మార్కులకుగాను అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా.. రిజనర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ఖరారు చేస్తారు.

సిలబస్‌పై పట్టుతోనే పరీక్షలో రాణింపు!

గ్రూప్-1 పోస్టులకు తీవ్ర పోటీ ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆగకుండా..ఇప్పటి నుంచే ప్రిపరేషన్‌కు సమాయత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రిపరేషన్ ప్రారంభించే ముందు అభ్యర్థులు సిలబస్ ఆసాంతం అవగాహన చేసుకుని.. వాటికి కల్పిస్తున్న వెయిటేజీని గమనించాలి. దీనికి అనుగుణంగా ప్రిపరేషన్ ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

సమకాలీన అంశాలు, కాన్సెప్ట్‌లు

ప్రిపరేషన్ సమయంలో ఆయా అంశాలను అభ్యసించేటప్పుడు వాటిని సమకాలీన అంశాలతోనూ సమన్వయం చేసుకుంటూ డిస్క్రిప్టివ్ విధానంలో ప్రిపరేషన్ సాగిస్తే.. కోర్ సబ్జెక్ట్ నైపుణ్యంతో పాటు సమకాలీన పరిస్థితుల్లో అన్వయించే నైపుణ్యం కూడా లభిస్తుంది. అభ్యర్థులు ప్రిలిమినరీ సబ్జెక్ట్‌లను, మెయిన్స్ సబ్జెక్ట్‌లతో అనుసంధానం చేసుకుంటూ అభ్యసనం సాగించాలి. దాదాపు 70 శాతం అంశాలు రెండు పరీక్షల్లోనూ ఉన్నాయి. ఈ రెండిటిలో ఉన్న అంశాలకు ఉమ్మడి ప్రిపరేషన్ సాగించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తర్వాత మెయిన్స్‌కు ప్రత్యేకంగా ఉన్న అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి.

డిస్క్రిప్టివ్ అప్రోచ్

గ్రూప్-1 అభ్యర్థులు డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో చదవడం చాలా ముఖ్యం. ప్రిలిమ్స్ దశ నుంచే ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన అంశాలను.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో.. విశ్లేషించుకుంటూ అభ్యసించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు ఇలా అన్ని కోణాల్లో అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ముఖ్యంగా నవరత్నాలు, వాటికింద అమలు చేస్తున్న పథకాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాల ఔపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఇతర ఆర్థిక విధానాలు, వాటి ద్వారా కలిగిన అభివృద్ధిపైనా దృష్టి సారించాలి.

చరిత్ర.. ఆసాంతం

హిస్టరీలో రాష్ట్ర చరిత్రకు సంబంధించి రాష్ట్ర సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలి. జాతీయోద్యమంలో ఆంధ్రదేశ పాత్ర గురించి అవగాహన ఏర్పరచుకోవాలి. ఇదే తీరులో భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరులు గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. అదే విధంగా గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

పాలిటీకి ఇలా

ఈ సబ్జెక్ట్‌లో పట్టు సాధించాలంటే.. రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు (రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజా సేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. వాస్తవానికి దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలు లేనప్పటికీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు కొంత మేలు చేస్తాయి. వీటితోపాటు స్ఫూర్తి దాయక నేతల వివరాలు, వారు పాలించిన తీరు తదితర అంశాలను సేకరించుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా, సివిల్ అండ్ క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి తెలుసుకోవాలి.

ఎకానమీ.. ఎంతో కీలకం

ఎకనామీ విషయంలో ఎంతో విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది. ప్రిపరేషన్ ప్రారంభ దశలో ఎకానమీకి సంబంధించి మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకు గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటి ద్వారా లబ్ధి చేకూరే వర్గాలు, అదే విధంగా జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఇటీవల కాలంలో తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. అంతే కాకుండా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024 జనవరి 1 - 2024 జనవరి 21
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024, మార్చి 17
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	970	71,484
నిఫ్టీ ▲	274	21,457

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,814	▲	52
డోజోన్స్	37,305	▲	57
ఎఫ్‌టీఎస్ఈ 100	7,576	▽	73
డాక్స్	16,751	▽	1
షాంఘై	2,943	▽	16
నికాయ్	32,971	▲	304

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.24	106.80
€	యూరో	ఎస్‌బీఐ	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.67	57.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.18	22.00
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

ఇంటి రుణం.. భారం దింపుకుందాం

గృహ రుణం.. రెండేళ్ల క్రితం వరకు ఇల్లు కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా కనిపించిన సాధనం. కేవలం 6.7 శాతం వార్షిక రేటుపై ఇంటి కొనుగోలుకు రుణం లభించింది. కానీ, స్థూల ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక రేటును 2022 మే నుంచి 2.5 శాతం మేర పెంచింది. ఫలితంగా గృహ రుణం రేట్లు 9.5–10 శాతానికి చేరాయి. దీంతో అప్పటికే ఇంటి కోసం రుణం తీసుకున్న వారికి నెలవారీ ఈఎంఐ భారంగా మారింది. 15 ఏళ్ల కనిష్టాలకు చేరిన గృహ రుణ రేట్లు ఒక్కసారిగా భారంగా మారాయి. ఆ తర్వాత ద్రవ్యోల్బణం గరిష్టాల నుంచి కొంత మేర దిగివచ్చింది. అంతర్జాతీయంగా కఠినతర ద్రవ్య విధానం దాదాపు చివరి దశకు చేరింది. దీంతో వడ్డీ రేట్ల పెంపు సైతం ముగింపునకు వచ్చేసిందని విశ్లేషకుల అభిప్రాయం. ఆర్‌బీఐ సైతం రేట్ల యథాతథ స్థితినే కొనసాగిస్తోంది. అయినా కానీ, వడ్డీ రేట్ల తగ్గింపునకు మరికొన్ని త్రైమాసికాలు వేచి చూడాల్సి రావచ్చని భావిస్తున్నారు. దాదాపు అన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రేట్ల పెంపు భారాన్ని రుణ గ్రహీతలకు బదిలీ చేశాయి. ఈ తరుణంలో ఈఎంఐ భారం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాల్లో బ్యాలన్స్‌ను మరో రుణదాతకు బదిలీ చేసుకోవడం ఒకటి. దాని గురించి వివరించే కథనం ఇది...

ఇంటి కోసం రుణం తీసుకున్న వారికి ప్రస్తుత ఈఎంఐ భారంగా అనిపిస్తే, అప్పుడు ఇతర బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వసూలు చేస్తున్న వడ్డీ రేట్లను ఒక్కసారి పరిశీలించాలి. ఇతర సంస్థలతో పోలిస్తే మీ బ్యాంక్ అధిక రేటు వసూలు చేస్తున్నట్టు గుర్తిస్తే కనుక, అప్పుడు దాన్ని తక్కువ రేటుకు ఆఫర్ చేస్తున్న బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. ఇలా మిగిలి ఉన్న రుణాన్ని మరో సంస్థకు బదిలీ చేసుకునే ముందు, ఇందుకు అనుసరించాల్సిన ప్రక్రియ, ఇందుకు అయ్యే చార్జీలు, అసలు బదిలీ చేసుకోవడం వల్ల మిగిలే ప్రయోజనం ఎంత మేర? తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం. ఫ్లోటింగ్ రేటు విధానంలో రేట్లను ఎలా నిర్ణయిస్తారనేది కూడా తెలుసుకోవాలి.

ఈఎంఐ భారంగా మారితే ప్రత్యామ్నాయాలు
- రుణాన్ని బదిలీ చేసుకోవడం ఒక ఆప్షన్
- తక్కువ రేటు రుణానికి మారిపోవాలి
- దీనివల్ల గణనీయంగా ఆదా
- కాల వ్యవధి ఆధారంగా దీనిపై నిర్ణయం

రేట్ల విధానాలు..

గృహ రుణంపై ఫిక్స్‌డ్ (స్థిర), ఫ్లోటింగ్ (అస్థిర) రేట్ల విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్లోటింగ్ రేటు రుణాలు ఆర్‌బీఐ కీలక రేట్ల సవరణకు అనుగుణంగా మార్పులకు లోనవుతుంటాయి. ఫిక్స్‌డ్ రేట్ విధానంలో నిర్ణీత కాలం పాటు రుణంపై ఒకటే రేటు కొనసాగుతుంది. కనుక ఫ్లోటింగ్ రేట్ రుణాలతో పోలిస్తే ఫిక్స్‌డ్ రేట్ రుణాలపై వడ్డీ రేటు 1.5–2 శాతం వరకు అధికంగా ఉంటుంది. ప్రస్తుతం అధిక శాతం గృహ రుణాలు ఫ్లోటింగ్ రేట్ విధానంలోనే ఉంటున్నాయి. ఆర్‌బీఐ 2016లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. బ్యాంక్‌లు లేదా ఎన్‌బీఎఫ్‌సీలకు నిధులపై అయ్యే వ్యయంతోపాటు, జీ–సెక్ ఈల్డ్స్, బ్యాంకింగ్ రంగంలో లిక్విడిటీ తదితర అంశాలు ఈ విధానంలో రేట్లను ప్రభావితం చేస్తాయి. బ్యాంక్ సొంతంగా రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఎంసీఎల్ఆర్ విధానంలో ఉంటుంది. ఎంసీఎల్ఆర్ అంటే క్లుప్తంగా నిధులపై బ్యాంక్‌లకు అయ్యే వ్యయం. దీనికి అదనంగా తనకు కావాల్సిన మార్జిన్‌ను బ్యాంక్ జోడించి రుణాలపై రేటును నిర్ణయిస్తుంది. ఆర్‌బీఐ రేట్లను మార్చినప్పుడు ఎంసీఎల్ఆర్‌లోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, వెంటనే కాదు. సాధారణంగా ఆరు నెలల నుంచి ఏడాది సమయం తీసుకుంటుంది. ఎంసీఎల్ఆర్‌లో ఒక్క రెపో రేటు కాకుండా, ఇతర అంశాలు కూడా రేట్లను ప్రభావితం చేస్తాయి. నిజానికి ఎంసీఎల్ఆర్ విధానం అంత పారదర్శకమైనది కాదు. రిటైల్ రుణ గ్రహీతలు దీన్ని అర్థం చేసుకోలేరు. ఈ లోపాలను అధిగమించేందుకు వీలుగా ఆర్‌బీఐ 2019లో రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (ఆర్ఎల్ఎల్ఆర్)ను ప్రవేశపెట్టింది.

వడ్డీ రేట్లు పెరిగినప్పుడు సాధారణంగా బ్యాంక్‌లు గృహ రుణాలపై ఈఎంఐని పెంచడానికి బదులు, రుణ కాలవ్యవధిని పెంచుతుంటాయి. దాంతో ఈఎంఐలో ఎలాంటి మార్పు ఉండదు. దీంతో ఇబ్బందేమీ లేదన్నట్టు వ్యవహరించరాదు. ప్రస్తుత బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీతో మెరుగైన డీల్ కోసం సంప్రదించాలి. సానుకూల స్పందన రానప్పుడు మిగిలి ఉన్న రుణ బకాయిని మరో బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించాలి. బ్యాలన్స్ బదిలీకి సంబంధించి అర్హత ఉందా? అన్నది తెలుసుకోవాలి.

రుణం బదిలీతో ఆదా ఎంత?



బ్యాలన్స్ బదిలీకి అనుమతించే విషయంలో కొన్ని బ్యాంక్‌లు, పూర్వపు సంస్థ వద్ద కనీసం 24 నెలల పాటు అయినా క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లించిన చరిత్రను అడుగుతున్నాయి. ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు, లేదా స్వాధీనం చేసిన ఇళ్లకు సంబంధించి రుణం బ్యాలన్స్ బదిలీకే బ్యాంక్‌లు ఆసక్తి చూపిస్తున్నాయి. వీటికి అదనంగా వేతనం, క్రెడిట్ స్కోర్ కూడా కీలకమవుతాయి. ముఖ్యంగా మిగిలిన రుణాన్ని, తక్కువ వడ్డీ రేటుకు ఆఫర్ చేస్తున్న మరో సంస్థకు బదిలీ చేసుకోవడం వల్ల కొంత ఆదా చేసుకుందామని భావించే వారు.. అసలు ఎంత ఆదా అవుతుందన్న దానిపై అంచనాకు రావాలి. ఉదాహరణకు రూ.75 లక్షల రుణం, 20 ఏళ్ల కాలానికి మిగిలి ఉందని అనుకుందాం. 9.5 శాతం వడ్డీ రేటు ఆధారంగా దీని ఈఎంఐ రూ.69,910 అవుతుంది. ఈ రుణాన్ని బదిలీ చేసుకుంటే, కొత్త సంస్థ 9.1 శాతం రేటుకు ఆఫర్ చేసిందనుకుంటే, అప్పుడు ఎంతో ఆదా అవుతుంది. కొత్త సంస్థ వద్ద 9.1 శాతం రేటు ప్రకారం ఇదే రుణంపై ఈఎంఐ రూ.67,963 అవుతుంది. 20 ఏళ్ల కాలంలో రూ.4,67,280 ఆదా అవుతుంది. ఇది ఏడు నెలల ఈఎంఐకి సమానం. అంటే రుణం ఏడు నెలల ముందే తీరిపోతుంది. మరో సంస్థకు రుణాన్ని బదిలీ చేసుకోవడం వల్ల మిగిలే ప్రయోజనం ఇలా ఉంటుంది. రుణం తీసుకున్న తర్వాత పెరిగిన ఆదాయం, మెరుగుపడిన క్రెడిట్ స్కోర్, మెరుగైన చెల్లింపుల చరిత్ర ఆధారంగా కొత్త సంస్థ తక్కువ రేటుకు ఆఫర్ చేసే అవకాశాలు ఉంటాయి. వడ్డీ రేటు ఎంత తగ్గితే ఆదా అయ్యే మొత్తం అధికంగా ఉంటుంది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ అయితే ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు తక్కువ రేట్లకు రుణాలను ఆఫర్ చేస్తున్నాయి. 0.25–0.50 శాతం మేర వడ్డీ తక్కువగా ఉండి, రుణ చెల్లింపుల కాలం మరో 15 ఏళ్లు అయినా ఉంటే నిస్సంకోచంగా రుణాన్ని బదిలీ చేసుకోవచ్చు. 2024 మధ్య నుంచి వడ్డీ రేట్లు తగ్గితే, అప్పుడు ఈఎంఐ భారం మరింత దిగొస్తుంది.

పారదర్శక.. రెపో లింక్డ్ లెండింగ్ రేట్



రెపో లింక్డ్ లెండింగ్ రేట్ ఎంతో పారదర్శకమైనది. రెపో రేట్‌కు బ్యాంక్‌లు తమకు కావాల్సిన మార్జిన్‌ను కలిపి రుణాలపై రేట్లను నిర్ణయిస్తాయి. దీంతో రుణ గ్రహీతలు సైతం సులభంగా అర్థం చేసుకోగలరు. రెపో రేటు పెరిగి, తగ్గినప్పుడు తమపై పడే భారం ఎంతన్నది సులభంగా తెలుసుకోగలరు. అంతేకాదు రేట్ల విధానం సులభంగా ఉండడంతో, ఆర్‌బీఐ రెపో రేటును సవరించిన వెంటనే బ్యాంక్‌లు రుణ గ్రహీతలకు దాన్ని బదలాయిస్తాయి. సాధారణంగా ఆర్‌బీఐ రెపో రేటు సవరణ అనంతరం వారం నుంచి నెల రోజుల వ్యవధిలో ఆర్ఎల్ఎల్ఆర్ రుణాల రేట్లు మార్పులకు లోనవుతాయి. రెపో రేటు విధానంలో.. వడ్డీ రేట్లు తగ్గించడం, పెంచడం వేగంగా జరుగుతుంది. కనుక వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో ఆ భారం వెంటనే రుణ గ్రహీతలకు బదలాయింపు అవుతుందని గుర్తు పెట్టుకోవాలి. ఈ విధానంలో బ్యాంక్‌లు సాధారణంగా రెపో రేటుపై 2.5–3 శాతాన్ని తమ మార్జిన్ కింద చార్జ్ చేస్తుంటాయి. ప్రస్తుతం గృహ రుణాలపై బ్యాంక్‌లు 9.5–10 శాతం వసూలు చేస్తున్నాయి. రెపో రేటు 6.5 శాతంపై 3–3.5 శాతం మార్జిన్‌గా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్‌బీఎఫ్‌సీలు అయితే 10.5 శాతం వరకు చార్జ్ చేస్తున్నాయి. అయితే, ఇదే రేటు అందరికీ ప్రామాణికంగా అమలవుతుందని చెప్పలేం. రుణం మొత్తం, కాల వ్యవధి, క్రెడిట్ స్కోర్ తదితర అంశాలు కూడా రేటుపై ప్రభావం చూపిస్తాయి. రేట్ల అస్థిరతలు పెద్ద పట్టింపు కాదంటే, రిటైల్ రుణ గ్రహీతలకు ఎంసీఎల్ఆర్ కంటే ఆర్ఎల్ఎల్ఆర్ రేటు అనుకూలంగా ఉంటుంది.

చార్జీల పట్ల అవగాహన



ఫిక్స్‌డ్ వడ్డీ రేటు విధానంలో రుణం తీసుకున్న వారు, మరో సంస్థకు దాన్ని బదిలీ చేసుకోవడం ఖరీదైన వ్యవహారమే అవుతుంది. ఎందుకంటే ఇప్పటికే రుణం ఇచ్చిన సంస్థ మిగిలి ఉన్న రుణాన్ని బదిలీ చేసేందుకు గాను, ఆ మొత్తంపై 2–4 శాతం వరకు చార్జ్ వసూలు చేయవచ్చు. అదే ఫ్లోటింగ్ రేట్ విధానంలో రుణం తీసుకుని ఉంటే, ఎలాంటి ముందస్తు చెల్లింపుల రుసుములు లేకుండా మిగిలి ఉన్న రుణాన్ని మరో బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీకి బదిలీ చేసుకోవచ్చు. ఎందుకంటే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై ముందస్తు చెల్లింపుల చార్జీలను ఆర్‌బీఐ నిషేధించింది. అయితే రుణాన్ని మరో సంస్థకు బదిలీ చేసుకోవాలంటే రుణ గ్రహీత కొన్ని రకాల చార్జీలు భరించాల్సి వస్తుంది. అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. రుణంపై (బదిలీ చేసుకునే మొత్తం) 0.50 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు కింద చాలా బ్యాంక్‌లు తీసుకుంటున్నాయి. కొన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయడం లేదు. నూతన తరం బ్యాంక్‌లు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు 3 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు తీసుకుంటున్నాయి. కాకపోతే అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒకే మాదిరి చార్జీలు ఉంటాయని అనుకోవద్దు. కనుక ఆయా సంస్థల వెబ్‌సైట్లకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. నేరుగా సంప్రదింపులు చేయడం ద్వారా చార్జీల భారం లేకుండా చూసుకోవచ్చు.



రూ. 20,000 వరకు చార్జీలు

రుణ బదిలీలకు సంబంధించి న్యాయపరమైన, సాంకేతిక మదింపు చార్జీలు కూడా భరించాల్సి వస్తుంది. ఇవి రూ.5,000 నుంచి రూ. 20,000 వరకు ఉంటాయి. కొన్ని బ్యాంక్‌లు విడిగా పేర్కొనకుండా, ఈ మొత్తాన్ని ప్రాసెసింగ్ ఫీజులో కలిపేస్తున్నాయి. కనుక చార్జీల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకోవాలి. ఇక మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంవోడీటీ) గురించి కూడా తెలుసుకోవాలి. రుణ గ్రహీత తన ఇంటి డాక్యుమెంట్లను రుణదాతకు స్వాధీనం చేయడం. రుణం ఇచ్చే సంస్థ తన పేరిట ఆ ప్రాపర్టీని రిజిస్ట్రేషన్ చేయించుకుంటుంది. ఇందుకు అయ్యే చార్జీలను రుణ గ్రహీత భరించాల్సి వస్తుంది. ఈ చార్జీలు రుణంలో 0.1–0.2 శాతంగా ఉంటాయి. ఇందులో ఎలాంటి తగ్గింపు రాదు. సుమారు రూ.75 లక్షల గృహ రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేసుకుంటున్నారని అనుకుంటే, ఇందుకోసం పలు రకాల చార్జీల రూపంలో రూ.62,500 వరకు కోల్పోవాల్సి వస్తుంది. లీగల్ ఫీజులు, ప్రాసెసింగ్ ఫీజుల్లో తగ్గింపు పొందడం ద్వారా ఈ భారాన్ని వీలైనంత తగ్గించుకోవచ్చు.



బదిలీ చేస్తే అయ్యే వ్యయాలు

బదిలీ రుణం	రూ.75 లక్షలు
ప్రాసెసింగ్ ఫీజు	రుణంపై 0.3–3% వరకు
లీగల్ ఫీజు	రూ.5,000–20,000
ఎంవోటీడీ చార్జీలు	రుణంపై 0.1–0.2 శాతం
ఫ్రాంకింగ్ చార్జీలు	రుణంపై 0.1–0.2 శాతం

సంహీ హోటల్స్ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు



స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 174
టార్గెట్: రూ. 290

ఎందుకంటే: ఆతిథ్య రంగ కంపెనీ సంహీ హోటల్స్ పేరున్న బ్రాండెడ్ హోటళ్ల సంస్థ. అసెట్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌తోపాటు.. దేశీయంగా అత్యధిక ఇన్వెంటరీ గదులను కలిగి ఉంది. నిర్వహణలోని 31 హోటళ్ల ద్వారా 4,801 గదుల(సొంతం, లీజ్ కలిపి) పోర్ట్‌ఫోలియో సంస్థ సొంతం. వీటిలో వినియోగ ప్రధానంగా నిలిచే ప్రాంతాలలో 13 హోటళ్లున్నాయి. ఇతర సంస్థల కొనుగోలు, లాభాల బాట పట్టించే బిజినెస్ మోడల్ కారణంగా కార్యకలాపాలు ప్రారంభమైన 2011 నుంచీ ఏటా సగటున 369 గదులను జత చేసుకుంటూ వస్తోంది. తద్వారా వేగంగా వృద్ధి చెందుతున్న ఆతిథ్య రంగ కంపెనీగా నిలుస్తోంది. ఈ బాటలో 2028కల్లా 920 గదులను ఆధునీకరించడం, రీబ్రాండింగ్ చేయడంసహా.. 617 రూములను జత చేసుకోనుంది. ప్రధానంగా కొనుగోళ్లకు సరిపోయే హోటళ్లను గుర్తించడం, సొంతం చేసుకోవడం, నష్టాలలో నడుస్తున్న వీటిని లాభాల బాట పట్టించడం వంటి అంశాలలో సంస్థకున్న సామర్థ్యాలు అదనపు ఆకర్షణగా చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ ధరలతోకూడిన హోటళ్లను కలిగి ఉండటం సంస్థ బలిమికాగా.. లాభదాయక కార్యకలాపాల నిర్వహణా దక్షతతో పటిష్ట ఫలితాలు సాధిస్తోంది. అప్‌సైకిల్‌లో ఆస్తులను సమకూర్చుకుంటూ, నికర రుణ భారాన్ని తగ్గించుకుంటోంది. 2023 మార్చితో పోలిస్తే నికర రుణాలు 35 శాతం దిగివచ్చి రూ. 1,840 కోట్లకు చేరాయి. వెరసి త్రైమాసిక ఫైనాన్స్ వ్యయాలు 57 శాతం క్షీణించి రూ. 60 కోట్లకు పరిమితమయ్యాయి. వార్షిక ప్రాతిపదికన మూడేళ్ల(2023–26)లో ఆదాయం 13 శాతం, నిర్వహణ లాభం 24 శాతం చొప్పున వృద్ధి చూపగలవని అంచనా. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికావడంతో భవిష్యత్ ప్రణాళికలను, పనితీరును నిశితంగా పరిశీలించవలసి ఉంటుంది.

సన్‌టెక్ రియల్టీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 477
టార్గెట్: రూ. 640

ఎందుకంటే: రియల్టీ రంగ కంపెనీ సన్‌టెక్ రియల్టీ ప్రధానంగా ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం(ఎంఎంఆర్)లో పట్టు కలిగి ఉంది. ఇది దేశంలోనే అతిపెద్ద మైక్రో మార్కెట్‌కాగా.. కరోనా మహమ్మారికంటే ముందుస్థాయితో పోలిస్తే ఎంఎంఆర్ 70 శాతం అధిక అమ్మకాలను సాధిస్తోంది. మల్టీ మైక్రో మార్కెట్‌లో కార్యకలాపాలు విస్తరించిన రియల్టీ డెవలపర్‌గా సన్‌టెక్ వివిధ ధరలలో లగ్జరీ(ప్రీమియం) ప్రాజెక్టులను చేపడుతోంది. ప్రాజెక్టుల నిర్మాణం, పూర్తి, విక్రయం తదితర అంశాలలో కంపెనీకున్న సామర్థ్యాలు, ట్రాక్ రికార్డ్ కారణంగా రియల్టీ రంగంలో కనిపిస్తున్న పటిష్ట డిమాండు కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది. కంపెనీ సొంతం చేసుకున్న ఎనిమిది ప్రాజెక్టులలో ప్రారంభించిన మూడు కొత్త ప్రాజెక్టులు 2018–23 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 22 శాతం ముందస్తు అమ్మకాలను సాధించిపెట్టాయి. భవిష్యత్‌లో అంటే 2023–26 కాలంలో 25 శాతం వృద్ధిని అందుకునే అవకాశముంది. వెరసి రూ. 3,100 కోట్లను సాధించే వీలుంది. ఇటీవల 2–3 కొత్త ప్రాజెక్టులను చేపట్టే సన్నాహాల్లో ఉంది. అత్యంత తక్కువ రుణ, ఈక్విటీ(0.1) నిష్పత్తితో పటిష్ట బ్యాలన్స్‌షీట్‌ను కలిగిన కంపెనీగా నిలుస్తోంది. వీటికి జతగా అత్యుత్తమ క్యాష్ ఫ్లోను సాధిస్తోంది. 2023–26 కాలంలో రూ. 1,600 కోట్లు అందుకుంది. ఇటీవల ఐఎఫ్‌సీతో జట్టుకట్టడం ద్వారా భవిష్యత్ వృద్ధికి బాటలు వేసుకుంది. ఐఎఫ్‌సీ ప్లాట్‌ఫామ్ ద్వారా జత చేసుకోనున్న భవిష్యత్ ప్రాజెక్టులతో రూ. 1,400 కోట్ల విలువను జమ చేసుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం. అయితే కొత్త ప్రాజెక్టులను ప్రవేశపెట్టడంలో జాప్యం, అమ్మకాలు మందగించడం వంటి అంశాలు మానిటైజేషన్ ప్రక్రియను దెబ్బతీసే అవకాశముంది. వీటిని కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జోస్ ఆలుక్కాస్ 'వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్'



కోయంబత్తూర్: జోస్ ఆలుక్కాస్ 'వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్' ప్రారంభించింది. ఉత్సవ ఆఫర్లలో భాగంగా రూ.50,000 లేదా అంతకు మించి విలువ చేసే వజ్రాభరణాల కొనుగోలుపై ఒక బంగారం నాణం ఉచితంగా పొందవచ్చు. అదనంగా వజ్రాభరణాలపై 25% వరకు, ప్లాటినంపై 7% తగ్గింపు లభిస్తుంది. ''వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్‌లో అద్భుతమైన కొత్త వజ్రాల సేకరణలు ఆవిష్కరించాము. ఇటీవల ప్రవేశపెట్టిన ప్రీమియం డైమండ్ కలెక్షన్స్ 'నిత్యారా' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని షోరూంల్లో ఫెస్టివల్ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

సంపద సృష్టిలో రిలయన్స్ టాప్

ఇన్వెస్టర్ల సంపద సృష్టికి గత ఐదేళ్ల కాలం (2018–23)లో డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్ చెయిర్‌ను అలంకరించింది. ఈ బాటలో సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ రెండో ర్యాంకులో నిలవగా.. లాయిడ్స్ మెటల్స్, అదానీ గ్రూప్ సైతం ఇదే బాటలో నడవడం గమనార్హం! వివరాలు చూద్దాం..

- 2018–23 మధ్య రూ. 9,63,800 కోట్లు
- తదుపరి రూ. 6,77,400 కోట్లతో టీసీఎస్
- లాయిడ్స్ మెటల్, అదానీ గ్రూప్ సైతం..



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్ల సంపదగా పేర్కొనే మార్కెట్ విలువ(క్యాపిటలైజేషన్)లో పలు దిగ్గజాలు గత ఐదేళ్లలో జోరు చూపాయి. పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) అత్యధికంగా రూ. 9,63,800 కోట్ల మార్కెట్ క్యాప్‌ను జమ చేసుకుంది. నంబర్‌వన్ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) రూ. 6,77,400 కోట్ల విలువను జత చేసుకోవడం ద్వారా తదుపరి ర్యాంకును సాధించింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక ప్రకారం సంపద సృష్టిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఆల్‌రౌండ్ ప్రతిభను కనబరిచింది. స్టాక్ మార్కెట్లో వివిధ కంపెనీల పనితీరును పరిశీలించిన మోతీలాల్ ఓస్వాల్ ఆర్ఐఎల్ వరుసగా ఐదో ఏడాదిలోనూ టాప్‌లో నిలిచినట్లు పేర్కొంది.


ఐసీఐసీఐ, ఎయిర్‌టెల్

2018–23 కాలంలో ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ మార్కెట్ క్యాప్ రూ. 4,15,500 కోట్లమేర బలపడగా.. ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ విలువ రూ. 3,61,800 కోట్లు పుంజుకుంది. మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ రూ. 2,80,800 కోట్లను జత చేసుకుంది. అయితే లాయిడ్స్ మెటల్స్ అత్యంత వేగంగా 79 శాతం సంపదను పెంచుకున్న కంపెనీగా ఆవిర్భవించింది. ఈ బాటలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ 78 శాతం వార్షిక వృద్ధితో ద్వితీయ ర్యాంకును సాధించింది. ఈ కాలంలో మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్‌ను మించుతూ అత్యంత నిలకడగా పురోగమించిన కంపెనీగా క్యాప్రి గ్లోబల్ నిలిచింది. ఏడాదికి 50 శాతం చొప్పున లాభపడింది.

రూ. 10 లక్షలు.. ఐదేళ్లలో రూ.కోటి

గత ఐదేళ్లుగా అత్యున్నత ర్యాలీ చేసిన టాప్–10 కంపెనీలలో 2018లో రూ. 10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. 2023కల్లా ఈ పెట్టుబడి రూ. కోటికి చేరి ఉండేదని నివేదిక పేర్కొంది.

అస్థిరతలను అధిగమించడం ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్ పథకాల మధ్య పెట్టుబడులను ఎటువంటి సందర్భాల్లో మార్చుకోవాలి?
– సుఖ్‌దేవ్ భాటియా

మీరు ఇన్వెస్ట్ చేస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాలను రెండు రకాల కారణాల వల్ల మార్చాల్సి రావచ్చు. మొదట మీ లక్ష్యాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు పెట్టుబడులను వాటికి అనుగుణంగా సవరించుకోవాల్సి ఉంటుంది. లక్ష్యాలను చేరుకున్నప్పుడు కూడా ఈ అవసరం ఏర్పడుతుంది. ఉదాహరణకు మీరు రిటైర్మెంట్ లేదా పిల్లల ఉన్నతవిద్య కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుంటే.. నిర్ణీత కాలవ్యవధికి ముందే మీకు కావాల్సిన మొత్తం సమకూరితే ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఏదైనా ఒక పథకంలో కొన్ని కారణాలను చూసి ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. అవన్నీ మారిపోయినట్టయితే పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. ఫండ్ మేనేజర్ మారిపోవడం పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి సరైన కారణం కాబోదు. గతంలో మంచి రాబడులను ఇచ్చిన పథకం కొత్త ఫండ్ మేనేజర్ నిర్వహణలో అంత మంచి పనితీరు చూపించకపోతే అప్పుడు వేరే పథకానికి మారిపోయే ఆలోచన చేయవచ్చు. అలాగే, నిలకడగా మంచి రాబడులను ఇస్తుందన్న కారణంతో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. మీరు ఆశించిన విధంగా పనితీరు లేకపోయినా దాని నుంచి తప్పుకోవచ్చు.

ఈక్విటీ మార్కెట్లలో అస్థిర పరిస్థితులను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– శ్రవణ్

ఈక్విటీలు అంతర్గతంగా ఆటుపోట్లతో ఉంటాయి. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. కాకపోతే ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోవడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమల్లో పెట్టాలి. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో మార్కెట్లలో చేసిన పెట్టుబడులపై ఆధారపడకూడదు. ఇందుకోసం అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల కాలం వరకు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ విధమైన చర్యలు అమలు చేయాలి. అలాగే, క్రమం తప్పకుండా మార్కెట్లలో సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల పరిస్థితుల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో దిద్దుబాట్లు మంచి పెట్టుబడుల అవకాశాలు అవుతాయి. తక్కువ రేట్లకే కొనుగోళ్లు చేసుకోవచ్చు. ప్రతికూల సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను సమకూర్చుకోవచ్చు. మార్కెట్లలో దిద్దుబాట్లకు భయపడి, మరింత పడిపోతాయేమోనన్న ఆందోళనతో పెట్టుబడి పెట్టకుండా ఉంటే, మంచి అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

రిలయన్స్ జనరల్ 'హెల్త్ గ్లోబల్' ప్లాన్

ముంబై: రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ 'రిలయన్స్ హెల్త్ గ్లోబల్' పేరుతో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని విడుదల చేసింది. భారతీయులు దేశీయంగా, అంతర్జాతీయంగా వైద్య సేవలు పొందేందుకు వీలుగా ఈ పాలసీని రూపొందించినట్టు సంస్థ ప్రకటించింది. కేన్సర్, బైపాస్ సర్జరీ తదితర క్లిష్టమైన వ్యాధులకు విదేశాల్లోనూ చికిత్స తీసుకునే సమగ్ర కవరేజీతో కూడిన పాలసీ ఇదని, దేశంలో అపరిమిత సమ్ ఇన్సూర్డ్ లభిస్తుందని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేశ్ జైన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-12-2023	
విశాఖ	601–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	582–00
విజయవాడ	582–00
17-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	572–00
వరంగల్	574–00

క్లుప్తంగా...

ఎక్స్ సర్వీస్‌మెన్ కోసం మెగా జాబ్ మేళా



జాబ్‌మేళాలో పాల్గొన్న అతిథులకు జ్ఞాపికలను అందిస్తున్న నేవీ అధికారులు

సింధియా: రక్షణ మంత్రిత్వ శాఖలోని ఎక్స్ సర్వీస్‌మెన్ సంక్షేమ శాఖలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్ ఎక్స్ సర్వీస్‌మెన్‌ల కోసం విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ శాతవాహన క్రీడా మైదానంలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని ఎక్స్ సర్వీస్‌మెన్‌లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 30 కంపెనీలు పాల్గొనగా.. ఆర్మీ, వైమానిక, నౌకాదళానికి చెందిన దాదాపు 1,340 మంది ఎక్స్ సర్వీస్‌మెన్‌లు ఉపాధి కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కమాండోర్ వివేక్ హోట్టి, సీఐఐ ఏపీ చాప్టర్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఏపీ చాప్టర్ ఎస్ఐడీఎం చైర్మన్, ఏడీజీ, డీఆర్‌జెడ్ (సౌత్) బ్రిగ్ రోహిత్ మెహతా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భవిష్యత్‌లో మరో ఐదు జాబ్ మేళాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా యువత ఎదగాలి

- 'యువకుల సమ్మేళనం'లో పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు

ఆరిలోవ (విశాఖ తూర్పు): యువత మొదటి తరం పారిశ్రామికవేత్తల అడుగుజాడల్లో నడవాలని పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు సూచించారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఆదివారం విశాఖలో నిర్వహించిన 'యువకుల సమ్మేళనం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశాఖను గ్లోబల్ హబ్‌గా మార్చడానికి ఒక ట్రాన్స్‌ఫార్మింగ్ విజన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులు, ఉత్పత్తులు, సేవల గురించి అధ్యయనం చేస్తూ స్థానిక వ్యూహాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచీకరణ అందిస్తున్న అవకాశాలను అందుకుని గ్లోబల్ కనెక్టివిటీని పెట్టుబడిగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఏటా బయటకు వస్తున్న 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లలో కనీసం 70 శాతం మందికి ఉపాధి కల్పించి మేధోవలసను తగ్గించవచ్చని చెప్పారు. విశాఖలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో, పారిశ్రామిక అవకాశాల కల్పనలో పల్సస్ పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలను ఆకర్షించటం ద్వారా వైజాగ్ ప్రముఖ టెక్ ఎ1 హబ్‌గా రూపొందేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. హెల్త్ అండ్ ఫార్మా సమ్మిట్స్, జీ20 గ్లోబల్ టెక్ సమ్మిట్, హెల్త్ సమ్మిట్ సిరీస్‌లను విశాఖ కేంద్రంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విశాఖ బ్రాండ్‌ను ప్రచారం చేయగలిగామన్నారు.

కళ్లలో కారంకొట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి

- గుంటూరు జిల్లాలో టీడీపీ నేతల దౌర్జన్యం

గుంటూరు రూరల్: పొలం కౌలు విషయంలో గొడవ నేపథ్యంలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడులో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేతల కళ్లలో కారం చల్లి దాడిచేశారు. స్థానికులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గారపాడులో పొలం కౌలు విషయంలో ఇద్దరికి స్వల్ప వివాదం జరిగింది. ఈ విషయాన్ని పెద్దల సమక్షంలో మన్నవ వీరనారాయణ వద్ద పరిష్కరించుకుందామని ఒకరు చెప్పారు. పెద్దలు ఎవరున్నారు, వీరనారాయణనైనా, పెద్దలనైనా తంతాం, వాడి అంతు చూస్తాం అంటూ టీడీపీకి చెందిన రౌడీషీటర్ పల్లపాటి వీరయ్య మహిళలపై దాడిచేశాడు. మహిళలు వీరనారాయణ వద్దకెళ్లి ఈ విషయం చెప్పారు. దీనిపై మాట్లాడేందుకు వీరనారాయణ గారపాడులో గొడవపడిన వ్యక్తుల వద్దకు మాట్లాడేందుకు వెళ్లాడు. అప్పటికే ప్లాన్ ప్రకారం స్థానికంగా ఉన్న మహిళలు వీరనారాయణ, మరికొంతమంది కళ్లలో కారం కొట్టి దాడిచేశారు. గ్రామంలోకి వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరు వచ్చినా అంతు చూస్తామంటూ టీడీపీ నేతలు బెదిరించారు. గ్రామంలోని దళితులపట్ల సామరస్యంగా ఉంటూ వారికి చేదోడువాదోడుగా ఉంటున్న తనపై దాడిచేసేందుకే గొడవపడ్డారని వీరనారాయణ తెలిపారు.

బిగ్‌బాస్-7 విజేత ప్రశాంత్



గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్ బిగ్‌బాస్ సీజన్-7 విజేతగా నిలిచాడు. 105 రోజులపాటు సాగిన ఈ రియాలిటీ షోలో అసాధారణ ప్రతిభతో టైటిల్‌ను దక్కించుకున్నాడు. రైతుబిడ్డ అయిన ప్రశాంత్ తన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకుంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. తొలుత టాప్-6లో ప్రవేశించిన ప్రశాంత్.. ఆ తర్వాత ఉత్కంఠభరితంగా సాగిన ఎలిమినేషన్ల పర్వంలో రెండోస్థానంలో నిలిచాడు. ఆఖరికి టాప్-2లో అమర్, ప్రశాంత్ మిగిలారు. బిగ్‌బాస్ హోస్ట్ నాగార్జున ఆదివారం రాత్రి ప్రశాంత్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో గజ్వేల్ ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

సరుకు రవాణా సేవల్లో ఏపీ భేష్



తీరప్రాంత రాష్ట్రాల అచీవర్స్ జాబితాలో ఏపీ ఫస్ట్

రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించిన కేంద్ర వాణిజ్య శాఖ 'లీడ్స్' నివేదిక

సులభతర సరుకు రవాణాలో ఆంధ్రప్రదేశ్ మరోసారి సత్తా చాటింది. లాజిస్టిక్ రంగంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను కేంద్ర వాణిజ్య శాఖ కొనియాడింది. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ తాజాగా విడుదల చేసిన లాజిస్టిక్ ఈజ్ ఎక్రాస్ డిఫరెంట్ స్టేట్స్(లీడ్స్)-2023 ర్యాంకుల్లో తీరప్రాంత రాష్ట్రాల అచీవర్స్ జాబితాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది.

సాక్షి, అమరావతి: దేశంలో సులభతర రవాణా వ్యవస్థను మెరుగుపర్చడానికి 2018 నుంచి సరుకు రవాణా సేవలను వినియోగిస్తున్న వారి అభిప్రాయాలు తీసుకుని ఈ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఏపీ వరుసగా రెండో ఏడాది కూడా మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు విధానాలు, ప్రాజెక్టులను నివేదికలో ఉదహరించింది. లాజిస్టిక్ రంగానికి పారిశ్రామిక హోదా ప్రకటించడంతో పాటు ప్రత్యేకంగా లాజిస్టిక్ పాలసీ విడుదల చేయడాన్ని అభినందించింది.

భూ కేటాయింపుల్లోనూ బెస్ట్

దేశంలో ఎక్కడా లేని విధంగా చౌక సరుకు రవాణా కోసం ఏపీలో భారీ ఎత్తున మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులను అభివృద్ధి చేస్తున్నారని లీడ్స్ నివేదికలో పేర్కొంది. ఇప్పటికే నేషనల్ హైవే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌తో కలిసి విశాఖ, అనంతపురంలో రెండు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో ఆరు పార్కులకు ప్రతిపాదనలను పంపినట్లు వివరించింది. వివిధ పారిశ్రామిక పార్కుల సమీపంలో కృష్ణపట్నం, ఓర్వకల్లు, కొప్పర్తి, మచిలీపట్నం, విజయవాడ/గుంటూరు, కాకినాడల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపింది. ఇందుకోసం 2,500 ఎకరాలు కేటాయిస్తోందని.. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో భూమిని కేటాయించలేదని నివేదికలో పేర్కొంది. లాజిస్టిక్ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే విధంగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పలు కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వడాన్ని ప్రశంసించింది. స్మార్ట్‌పోర్ట్ కార్యక్రమం కింద పోర్టు ఆధారిత సేవలన్నీ పారదర్శకంగా, వేగంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడాన్ని అభినందించింది.

ఏపీలో అభివృద్ధి కనిపిస్తోంది

మౌలికవసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా కనపడుతున్నాయని, వీటిని వినియోగిస్తున్న వారు ప్రభుత్వ చర్యలను కొనియాడుతున్నారని 'లీడ్స్' నివేదికలో పేర్కొంది. లాజిస్టిక్ పాలసీ విడుదల చేయడం.. ఈ రంగానికి పరిశ్రమల హోదా కల్పించడంతో పాటు సమస్యలను ఒకే చోట పరిష్కరించే విధంగా సింగిల్ విండో విధానం 'స్పందన' తీసుకురావడం వంటి విధానాల వల్ల తీరప్రాంత రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో లాజిస్టిక్ మౌలిక వసతుల కల్పన అధికంగా ఉందని.. రోడ్లు, రైల్వే లైన్లు, టెర్మినల్ ఇన్‌ఫ్రా, గిడ్డంగులు వంటి ఫస్ట్ టూ లాస్ట్ మైల్ కనెక్టివిటీలో ఏపీ అద్భుతమైన పనితీరు కనబరుస్తోందని కొనియాడింది. రాష్ట్రంలో కొత్తగా పోర్టులను నిర్మిస్తుండటంతో పాటు ఇప్పటికే ఉన్న పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తుండటాన్ని ప్రశంసించింది. పోర్టుల అనుసంధానంతో పాటు గిడ్డంగుల సంఖ్యను పెంచడంపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించింది.

నేరాలకు దూరంగా... ఉపాధికి దగ్గరగా..!

- విశాఖ జైలులో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు
- ఖైదీల మానసిక పరివర్తన కోసం సైకాలజిస్టులతో కౌన్సిలింగ్
- ఉపాధి కోసం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా చేతివృత్తుల్లో శిక్షణ
- జైలు నుంచి విడుదలయ్యాక బ్యాంకుల ద్వారా రుణాలు
- మానసిక, ఆర్థిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



ఆరిలోవ(విశాఖ తూర్పు): వివిధ కేసుల్లో శిక్ష పడి జైలులో ఉన్న ఖైదీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఖైదీలకు ఆరోగ్యశ్రీ సౌకర్యం కల్పించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తోంది. తాజాగా ఖైదీల ప్రవర్తనలో మార్పు తీసుకురావడంతోపాటు జైలు నుంచి విడుదలయ్యాక నేర ప్రవృత్తిని విడనాడి అందరిలాగే పనిచేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని కేంద్ర కారాగారాల్లో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఇటీవల విశాఖ కేంద్ర కారాగారంలో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో వివిధ విభాగాలకు చెందిన సోషల్ వర్కర్లను సభ్యులుగా నియమిస్తారు. దీనికోసం ఈ నెల 5న సోషల్ కౌన్సెలర్, ఎన్‌జీవోలు, సోషల్ వర్కర్లు, సైకాలజిస్టులు, వెల్ఫేర్ ఆఫీసర్లు, బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులతో కేంద్ర కారాగారంలో సమావేశం నిర్వహించారు. వారిలో ఐదుగురిని ఉన్నతాధికారులు ఎంపిక చేస్తారు.

సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఏం చేస్తారంటే...

- ఖైదీలకు సైకాలజిస్టులు కౌన్సిలింగ్ ఇచ్చి వారి ప్రవర్తనలో మంచి మార్పు తీసుకువస్తారు. మానసిక ఒత్తిడిని తగ్గించడానికి కృషి చేస్తారు.
- ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రతినిధులు వచ్చి ఖైదీలకు వివిధ చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయినవారికి సర్టిఫికెట్ అందజేస్తారు.
- ఈ శిక్షణ వల్ల ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత సమాజంలో పని చేసుకునే వెసులుబాటు ఉంటుంది.
- ఏపీఎస్ఎస్‌డీసీ ఇచ్చిన సర్టిఫికెట్ ఉన్న ఖైదీలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారు.
- ఈ చర్యల వల్ల ఖైదీల్లో నేర ప్రవృత్తి తగ్గుతుందని, ఆర్థికంగా ఎదిగి కుటుంబంతో ఆనందంగా గడిపే అవకాశం ఉంటుందని జైలు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థి వికాసానికి ఏపీ కృషి అభినందనీయం

- కేంద్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్
- నెల్లూరులో జాతీయ విద్యావిధానంపై సదస్సు



నెల్లూరు(టౌన్): నూతన టెక్నాలజీ సాయంతో విద్యార్థి వికాసానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ ప్రశంసించారు. నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యకు సంబంధించి జాతీయ పాఠ్య ప్రణాళికపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆదివారం ప్రారంభించారు. తొలుత కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మన బడి నాడు-నేడు, ప్రధానమంత్రి పోషణ్ -జగనన్న గోరుముద్ద, అభ్యసనాభివృద్ధి కార్యక్రమం, జగనన్న విద్యాకానుక తదితర ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. మనబడి నాడు-నేడు స్టాల్‌లో ఏర్పాటు చేసిన స్కూల్స్ బల్లలపై ఆయన కూర్చొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం అభినందనీయమన్నారు. ట్యాబ్‌ల వినియోగం, డిజిటల్ ప్లాట్‌ఫాం ఉపయోగించడం లాంటి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పాఠశాలలకు హాజరు కాని పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలకు పంపించే యంత్రాంగం గ్రామస్థాయిలో అందుబాటులో ఉండటం చాలా మంచి నిర్ణయమని పేర్కొన్నారు. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లాని మాట్లాడుతూ విద్యార్థి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాఠ్యపుస్తకాలు తయారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పాఠశాల విద్యలో తీసుకువచ్చిన సంస్కరణలు, మార్పులను రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రూ.13 వేల కోట్ల ఖర్చుతో రాష్ట్రంలో 45 వేల పాఠశాలలను ఆధునీకరించామన్నారు. 6 వేల ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులను డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి మార్చామని తెలిపారు.

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు ప్రారంభం

తుమ్మపాల (అనకాపల్లి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని రైతు భారతి ఆడిటోరియంలో భారతీయ బాడీబిల్డింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డింగ్ అసోసియేషన్, అనకాపల్లి బాడీబిల్డింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మిస్టర్ ఆంధ్ర-2023 ఏపీ స్టేట్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నూతన సంవత్సరంలో జాతీయస్థాయిలో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మాజీ ఒలింపియన్ మాణిక్యాలు, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరాజు, కాండ్రేగుల శ్రీరామ్, ముప్పన సుబ్రహ్మణ్యం, విల్లూరి శ్రీనివాసరావు, కులపర్తి శ్రీను, బొడ్డేడ రామసత్యనారాయణ, మళ్ళ మహేష్ పాల్గొన్నారు.

రూ. 25 లక్షల వరకు 'ఆరోగ్యశ్రీ'

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

- కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులకూ శ్రీకారం
- నేటి నుంచి ఇంటింటికి పంపిణీ
- ప్రతీ ఇంట్లో ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ అయ్యేలా చర్యలు
- మొత్తం 4.25 కోట్ల లబ్ధిదారులకు ఈ సేవలపై విస్తృత అవగాహన
- జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 జనవరి 1 నుంచి..



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో గొప్ప మైలురాయికి శ్రీకారం చుడుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ దానిని మరింత బలోపేతం చేసే కార్యక్రమాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఇక నుంచి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమంతోపాటు సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల జారీని కూడా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభిస్తారు. అలాగే, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించడం.. దాని ద్వారా ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడికి వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలనే సందేహాలన్నింటినీ ప్రతిఇంట్లో నివృత్తిచేసే కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇక కొత్త కార్డుల పంపిణీ సందర్భంగా ప్రతీ ఇంట్లో కనీసం ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు స్వయంగా చూస్తారు. తద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు, 4.25 కోట్ల మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పిస్తారు.

జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2

ఇక జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని 2024 జనవరి 1 నుంచి ప్రతీవారం గ్రామీణ ప్రాంతాల్లో మండలానికి ఒక గ్రామ సచివాలయం పరిధిలో.. పట్టణ ప్రాంతాల్లో ప్రతీవారం ఒక వార్డు పరిధిలో సురక్ష శిబిరాలు నిర్వహిస్తారు.

- ఫ్యామిలీ డాక్టర్ సూచన మేరకు సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా విలేజ్ క్లినిక్‌లకు మందులు చేరవేసి అక్కడి నుంచి ఏఎన్ఎంల ద్వారా సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులకు నేరుగా ఇంటివద్దనే డబ్ల్యూహెచ్ఓ, జీఎంపీ ప్రమాణాలుగల మందులు ఉచితంగా అందిస్తారు.
- ఈ మందులు అయిపోయిన తరువాత వాటి కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరంలేకుండా విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్‌తో అనుసంధానం చేసి డోర్ డెలివరీ చేసే సదుపాయం కూడా కల్పిస్తున్నారు.

కొత్త కార్డుల ఫీచర్లు ఇవే..

- ప్రతీ కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుని ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పొందుపరిచిన లబ్ధిదారుల ఆరోగ్య వివరాలతో ఏబీహెచ్ఏ ఐడీ ఉంటుంది.
- ఈ క్యూఆర్ కోడ్‌తో లాగిన్ అవడం ద్వారా రోగి చేయించుకునే వ్యాధి నిర్ధారణ పరీక్షలు, తీసుకుంటున్న వైద్యం, చికిత్సలు, డాక్టర్ సిఫార్సులు, సమీపంలోని ఆసుపత్రులు, ఆ ఆసుపత్రులకు చేరేందుకు గూగుల్ మ్యాప్స్ ద్వారా అనుసంధానమైన మార్గాలు తెలుసుకోవచ్చు.
- అలాగే, ఆరోగ్యమిత్ర కాంటాక్టు నంబర్లు సైతం తెలుసుకునే వీలుంది.
- దీని ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితులపై డాక్టర్లకు, సిబ్బందికి పూర్తి అవగాహన.. మెరుగైన ఉచిత వైద్యం లభించేందుకు మార్గం సులభతరం కానుంది.

సాయం చేస్తున్నా గిట్టదా?

కళ్లెదుట కనిపించడం లేదా వాస్తవాలు?

- సీజన్ ముగియకుండానే కరువు మండలాల ప్రకటన
- తుపాన్ పంట నష్టం అంచనాల్లో యంత్రాంగం నిమగ్నం
- సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు సన్నాహాలు



సాక్షి, అమరావతి: పంట నష్టం అంచనాలతో పనిలేదు.. కరువొచ్చిన మర్నాడే సాయం అందితీరాలి! తుపాన్ తీవ్రత తగ్గక ముందే పరిహారం ఇచ్చి తీరాలి అన్నట్లుగా ఉంది ఎల్లో మీడియా ధోరణి! కరువు రావడం, తుపాన్ వల్ల భారీ వర్షాలు కురవడం కూడా ప్రభుత్వ వైఫల్యమే అన్నట్లుగా ఉన్నాయి రామోజీ రాతలు! విపత్తుల వేళ అప్రమత్తతోపాటు రైతన్నలు నష్ట పోయిన ప్రతీ ఎకరాకు, దెబ్బతిన్న ప్రతీ గింజకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. పంట నష్టం లెక్కింపులో జాప్యం లేకుండా, పరిహారం చెల్లించి ఆదుకోవడంలో వేగాన్ని ప్రదర్శిస్తోంది. సంక్రాంతి లోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదంతా తనకు పట్టనట్లుగా యథాప్రకారం బురదలో కూరుకుపోయి దుష్ప్రచారానికి దిగే పెద్ద మనిషిని ఏమనుకోవాలి?

ఎలా లెక్కిస్తారో తెలియదా?

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఏదైనా ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలంటే ఆరు ప్రామాణికాలు (వర్షపాతం, సాగు విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, వాగు ప్రవాహం, భూగర్భ జలాలు, జలాశయాల స్థాయిలు) పరిగణనలోకి తీసుకుంటారు. ఇక తుపాన్లు, వరదలు, అకాల వర్షాల సమయంలో తొలుత ప్రాథమిక నష్టాన్ని అంచనా వేస్తారు. తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం నిబంధనల మేరకు 33 శాతానికి పైగా మునిగిపోయి దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకొని పంట నష్టం తుది అంచనాలను రూపొందిస్తారు. ఆ మేరకు పంటలవారీగా లెక్కించిన పంట నష్టపరిహారాన్ని (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తారు.

ఆదుకోలేదనడానికి మనసెలా వచ్చింది?

ఖరీఫ్ 2023-24లో బెట్ట పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంది. సీఎం జగన్ సీజన్ ప్రారంభం నుంచి 15 రోజులకోసారి అధికారులతో సమీక్షించారు. శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు అనుగుణంగా 80 శాతం రాయితీపై విత్తనం పంపిణీ చేశారు. 80 శాతం సబ్సిడీతో (రూ.26.46 కోట్ల విలువ) 30,977 క్వింటాళ్ల విత్తనాలను 1.16 లక్షల మంది రైతులకు అందజేశారు. ముందస్తు రబీలో 89 వేల మంది రైతులకు రూ.40.45 కోట్ల విలువైన 1.23 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై ఆర్బీకేల ద్వారా సరఫరా చేశారు.

కరువు సాయం కోసమే కేంద్ర బృందాలు

ఖరీఫ్ 2023కి సంబంధించి ఏడు జిల్లాలలో 103 కరువు మండలాలను గుర్తించారు. 7.14 లక్షల మంది రైతులు 6 లక్షల హెక్టార్లలో పంట నష్టపోయినట్లు లెక్కించి జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శించారు ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు రూ. 534 కోట్ల పెట్టుబడి రాయితీ కోరుతూ కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఈ నెల 12 నుంచి 15 వరకు కేంద్ర బృందం రాష్ట్రంలో కరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు 6.39 లక్షల మంది రైతులు 5.33 లక్షల హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు లెక్క తేల్చి రూ. రూ.784.61 కోట్ల పెట్టుబడి రాయితీ ఇవ్వాలని అంచనా వేశారు. ఈ మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఖరీఫ్ 2023లో 21, రబీ 2023 -24లో 17 పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింప చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఖరీఫ్ 2023 నోటిఫైడ్ పంటలకు సంబంధించి 34.7 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా పథకం వర్తింప చేశారు ఈ జాబితాలను కేంద్రంతో పాటు బీమా కంపెనీలకు సైతం పంపించారు.

ఉదారంగా ధాన్యం కొనుగోళ్లు

సీఎం జగన్ ఆదేశాల మేరకు ఉదారంగా వ్యవహరిస్తూ తేమ శాతం నిబంధనలను సడలించి రంగుమారిన, పాడైపోయిన 6.52 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కళ్లాల వద్ద నుంచే సేకరించారు. గత సర్కారు ఎగ్గొట్టిన బకాయిలతో సహా గత నాలుగున్నరేళ్లలో విపత్తులతో నష్టపోయిన 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.44 కోట్ల పెట్టుబడి రాయితీ సొమ్మును అదే పంట కాలం చివరిలో బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారు.

సాయం పెంపు కనపడదా?

వైపరీత్యాల వేళ కేంద్రం నిర్ణయించిన దానికంటే ఎక్కువగా ఇవ్వాలనే సంకల్పంతో 2023 నవంబర్ 14 నుంచి పెట్టుబడి రాయితీని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విపత్తుల వల్ల వ్యవసాయ భూముల్లో మట్టి, ఇసుక మేట వేస్తే తొలగించేందుకు గతంలో హెక్టారుకి రూ.12 వేలు ఇవ్వగా సీఎం జగన్ ప్రభుత్వం రూ. 18 వేలకు పెంచింది. దెబ్బతిన్న వర్షాధార పంటలకు హెక్టారుకి గతంలో రూ.6,800 మాత్రమే ఉన్న పరిహారాన్ని రూ.8500కి పెంచింది. నీటిపారుదల భూములైతే ఇన్‌పుట్ సబ్సిడీ గతంలో రూ.13,500 ఇచ్చే పరిస్థితి ఉండగా ఇప్పుడు రూ.17 వేలు ఇస్తున్నారు. ప్రధానంగా వరి, వేరుశనగ, పత్తి, చెరకు తదితర పంటలకు గతంలో హెక్టార్‌కు రూ.15 వేలు ఇవ్వగా ప్రస్తుతం రూ.17 వేలకు పెంచారు. ఉద్యాన పంటలకు రూ.7,500 నుంచి రూ.17 వేలకు పెంచగా మామిడి, నిమ్మ జాతి పంటలకు రూ.20 వేల నుంచి రూ.22,500లకు, మల్బరీకి రూ.4,800 నుంచి రూ.6 వేలు చొప్పున పెంచి ఇస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

రాయచూరు రూరల్: తాలుకాలోని రాజోళ్లిలో ఆంజనేయస్వామి జాతర రథోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాయచూరు రూరల్ శాసన సభ్యుడు బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లిఖార్జున గౌడ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్ : క్రీడాకారులు అథ్లెటిక్ పోటీలలో రాణించాలని మంత్రి బోసురాజ్, మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి అన్నారు. ఆదివారం మహాత్మ గాంధీ క్రీడా మైదానంలో జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఉత్తమ ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పరుగు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజ్‌కుమార్, కిరణ్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన పూజలు



సిరుగుప్ప: నగరంలో శ్రీనివాస, ఆంజనేయ, శనేశ్వర దేవస్థానంలో శ్రీమధ్వాచార్యుల మూల మహాసంస్థానం శ్రీ రాజేంద్రతీర్థ పూర్వ దిమఠంలో సోసలె శ్రీ వ్యాసరాజ మఠానికి చెందిన శ్రీవిద్యామనోహర తీర్థులు సంస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థులు తన ఆశీర్వాద వచనాలు తెలియ జేస్తూ, ధర్మం, ఆచారాలను మరవకూడదన్నారు.

కల్తీసారా విక్రయం, ఇద్దరి అరెస్ట్

రాయచూరు రూరల్: నగరంలో కల్తీ సారా విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్దనుంచి కల్తీసారా స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి నగర పరిధి హరిజన వాడలో కల్తీసారా విక్రయిస్తున్న రఘును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా, స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ద్విచక్ర వాహనంలో తీసుకువస్తున్న 150 లీటర్ల కల్తీ సారాను పట్టుకుని సవారప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీ నాయక్ తెలిపారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కంప్లి: ప్రజలందరూ ఎలాంటి ఖర్చు లేకుండా సమగ్ర ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్షేత్ర ఆరోగ్య శిక్షణాధికారి శివప్ప తెలిపారు. సండూరు తాలూకా తోరణగల్లు రైల్వే స్టేషన్ గ్రామ సమీపంలోని షర్పడే నగర్‌లో సార్వత్రిక ఆరోగ్య దినోత్సవంపై జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం ఈ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

గ్రామాలలో తాగునీటికి ప్రాధాన్యత

రాయచూరు రూరల్: ప్రజలకు ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ విధాన సభ సభ్యుడు బసన గౌడ పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని బాపూర్ తండాలో జలజీవన్ మిషన్ పథకానికి పూజలు చేసి మాట్లాడారు. ప్రభుత్వ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


కాళికామాత వేషధారణలో విద్యార్థిని

హొసపేట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లాధికారి దివాకర్ అన్నారు. నగరంలో ఆకాష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రతిభకారంజి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభా కారంజి పోటీలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యువరాజ్ పాల్గొన్నారు.

అంజూర సాగుతో లాభాలు

- కరువును అధిగమించిన యువరైతు
- 25 ఎకరాల్లో పంట
- ఎకరాకు రూ. 50 వేల ఆదాయం
- తక్కువ నీటితో మేలిమి సాగు


తోటలో అంజూర మొక్కలను నాటుతున్న దృశ్యం


అంజూర మొక్కలు


యువ రైతు రవి

సాక్షి బళ్లారి: ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతులు ఏదో రకంగా ఏటా పంట నష్టపోతూనే ఉన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు పంటలకు తెగుళ్ల వంటి కారణాలతో వారికి కన్నీరే మిగులుతోంది. వరుణుడు కరుణ చూపకపోవడం, దిగుబడులు రాక పెట్టుబడులు కూడా కోల్పోవాల్సి వస్తోంది. ఇటువంటి తరుణంలో ఓ యువరైతు వ్యాపారం, ఇతర రంగాలలో పనిచేసి అందులో ఎటువంటి సంతృప్తి లేకపోవడంతో వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో స్థిర పడిన రైతు రవి తనకు సొంత **భూమి లేక** పోయినా కౌలుకు ఆయకట్టు **భూము**లను తీసుకుని అందులో అంజూ**రు** తోటను సాగు చేసి లాభాలను ఆర్జిస్తున్నాడు.



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని..:

ఏటా తుంగభద్ర ఆయకట్టుతో పాటు వర్షాధారిత భూముల్లో, పండ్ల తోటలను సాగు చేసి**న** రైతులు కూడా తీవ్రంగా నష్టపో**తు**న్నారు. అంజూర పండ్లకు అధిక **డిమాం**డ్, రోగాలు కూడా తక్కువగా రా**వడంతో అం**జూర రైతులు ఎందరో కష్టాల నుంచి బయటపడుతున్నారు. ఇందులో భాగంగానే రవి అనే యువరైతు ముందుగా కురుగోడు తాలూకా **ముష్టిగట్టి** గ్రామంలో 10 **ఎకరాలు** కౌలుకు **తీసుకు**ని అంజూర **సా**గు చేసి లాభా**ల**ను గడిస్తున్నారు. ప్రస్తుతం 25 ఎకరాల్లో అంజూ**ర**ను సాగు చేసి **ఖర్చు**లకు పోను **లక్షలా**ది రూపా**యలు** గడిస్తున్నారు. **ఈసారి** వర్షాలు సరిగా **లేనందున,** అంజూర పంట కూడా దెబ్బతింది. దీంతో కిలో కిలో అంజూర రూ.100లకు పైగా ధర పలుకుతోంది. ప్రస్తుతం కురుగోడు తాలూకాలో 25 ఎకరాల్లో సాగు చేసిన రవి ఎకరంలో 100 నుంచి 150 బాక్స్‌లు అంజూరు పండ్లను పండించేందుకు సాధ్యం కావడంతో రైతుకు అధిక లాభాలను తెచ్చిపెడుతున్నాయి.

ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసే ఈ పండుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అంజూర సాగుతో కరువులోను ముష్టిగట్టి గ్రామానికి చెందిన రవి కురుగోడు తాలూకాలతో పాటు జిల్లాలో విస్తారంగా సాగు చేసిన అంజూర రైతులందరూ అంతో ఇంతో ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సాధ్యమైంది. బళ్లారి జిల్లాతో పాటు కర్ణాటకలోని వివిధ జిల్లాలు, పొరుగు ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి అంజూరు పండ్లను కొనుగోలు చేస్తుండటంతో డిమాండ్ అంతకంతకు పెరుగుతోంది.


చెట్టుకు అంజూర పండ్లు

అనుమానంతో హత్య చేశాడు

- భార్యకు ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరణ
- నిందితుడి అరెస్ట్


హతురాలు సోనీ (ఫైల్)


నిందితుడు అవినాష్

రాయచూరు రూరల్: అనుమానం పెనుభూతంగా మారింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఓ కిరాతక భర్త ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. వివరాలు... నగరంలో ఓ ప్రైవేట్ హోటల్లో విధులు నిర్వహిస్తున్న సోనీ (23) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. సోనీ, ఆమె భర్త అవినాశ్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు. ఇదిలా ఉంటే పోలీసులు అనుమానంతో అవినాశ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నిందితుడు అసలు విషయం వెల్లడించాడు. భార్యపై అనుమానం పెంచుకున్న ఇతను తరచూ ఆమెతో గొడవ పడి రోజు చిత్రహింసలు పెట్టేవాడు. మంగళవారం భార్యను చంపి ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని నమ్మించడానికి యత్నించాడని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. వీరిద్దరు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారని చెప్పారు.

నేడు సుబ్రమణ్య షష్టి

బళ్లారిఅర్బన్: ధనుర్మాసం సందర్భంగా సోమవారం శ్రీ సుబ్రమణ్యం షష్టి పూజా కార్యక్రమాలను స్థానిక ఫైర్ కార్యాలయం సమీపంలోని కుమారస్వామి ఆలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ హనుమంతప్ప తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే సుబ్రమణ్య స్వామి పంచామృతాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మావిన చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోండి

రాయచూరు రూరల్: చారిత్రక మావిన చెరువు అభివృద్ధికి, రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి బోసురాజు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 120 ఎకరాలున్న చెరువులో ఏడు ఎకరాలు ఆక్రమించారని, దాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా చెరువులోకి మురుగునీరు, చెత్త చెదారం వేయకుండా నగరసభ అధికారులు నోటీసులు ఇవ్వాలన్నారు.

మాధుస్వామి నివేదికలను జారీ చేయాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మాదిగల రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి మాజీ మంత్రి మాధుస్వామి కేంద్ర సర్కార్‌కు అందించిన నివేదికల ఆధారంగా కేంద్రం రిజర్వేషన్లు జారీ చేస్తుందనే విశ్వాసం ఉందని బాగల్‌కోట ఎంపీ రమేష్ జిగజిణిగి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో మాదిగ మున్నడే అత్మగౌరవ సమితి ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. మాదిగలకు రిజర్వేషన్ల విషయంలో ఏబిసిడి వర్గీకరణలో న్యాయమూర్తి సదాశివ నివేదికల జారీకి 30 ఏళ్ల పాటు ఆందోళనలకు బీజేపీ సర్కార్ స్పందించిందని అన్నారు.

వీరశైవ లింగాయత్ సమావేశాన్ని విజయవంతం చేయండి

- ఈనెల 23, 24 తేదిల్లో దావణగెరెలో సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న వీరశైవ ప్రముఖులు

సాక్షి,బళ్లారి: ఈనెల 23, 24వ తేదిల్లో దావణగెరె అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ 24వ మహా సమావేశం నిర్వహిస్తున్న అఖిల భారత వీర శైవ లింగాయత్ మహాసభ రాష్ట్ర,జిల్లా నేతలు శ్రీనివాసరెడ్డి, చానాల్ శేఖర్ పేర్కొన్నారు. వారు ఆదివారం నగరంలోని అల్లం సుమంగళమ్మ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. దావణగెరెలో రెండు రోజులు పాటు జరగనున్న సమావేశానికి ఐదులక్షల మంది వీరశైవ లింగాయత్‌లు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. బళ్లారి జిల్లా నుంచి అన్ని తాలూకాల నుంచి 100 బస్సులు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్క వీరశైవ సమాజం చెందిన వారు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మాజీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు, కేంద్ర నేతలు కూడా హాజరువుతారని, ఈ నేపథ్యంలో మన హక్కులు, సాధన, మన సమస్యలను వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా వీరశైవ లింగాయత్‌లను కేంద్రంలో ఓబీసీ జాబితాలో చేర్చేందుకు గట్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు రామనగౌడ, అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ఏపీ అధ్యక్షుడు శివానంద, లింగాయత్ సమాజ ప్రముఖులు తిమ్మనగౌడ, శాంతనగౌడ, విరుపాక్షప్ప, కుమ్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి పరచాలి


వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సన్మానించిన దృశ్యం

గంగావతి: గంగావతి తాలూకాలో చారిత్రాత్మక ప్రదేశాల్లో టూరిజంను అభివృద్ధి పరచాలని డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ కరిగులి పేర్కొన్నారు. ఆయన సర్వతోముఖాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తాలూకాలో టూరిజం అభివృద్ధి, గంగావతి పరిస్థితి గురించి శ్రీ కృష్ణదేవరాయ కళా భవనంలో ఏర్పాటు చేసిన చర్చగోష్టిలో మాట్లాడారు. గంగావతి తాలూకాలో ఆంజనేయ జన్మస్థలమైన అంజనాద్రిని అభివృద్ధి పరచాలని కోరారు. అదే విధంగా వరి ధాన్యపు ఉత్పాదనకు పేరు గాంచిన గంగావతి 180 రైస్ మిల్లులు ఉన్నాయని ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల వల్ల అవి మూతపడే స్థాయికి చేరుకోవడంతో వాటికి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి మాట్లాడుతూ.. ఆనెగుంది ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే హంపీ ప్రాధికార సమితి కొన్ని సడలింపుల తోటి యాత్రికులకు వసతి సౌకర్యం కోసం రెస్టారెంట్ల నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతం అభివృద్ధికి గత ప్రభుత్వం కేటాయించిన రూ. 120 కోట్ల నిధులను ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి సరైన రీతిలో ఉపయోగించి అభివృద్ధి పరచాలని కోరారు. కార్యక్రమంలో డివైఎస్పీ సిద్దలింగనగౌడ, విలేకరి, మాధ్యమ అకాడమి రాష్ట్ర ప్రశస్తి విజేత కే.నింగజ్జ, పోలీస్ అధికారి శారదమ్మ, బసవరాజ్ మేగలమని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ఉత్తమ సాధనలు సన్మానించారు.

వంచన కేసులో ఏడుగురికి ఏడాది జైలు

హుబ్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా బెళగావి జిల్లా సహపుర శాఖలో జరిగిన రుణ కుంభకోణం కేసుకు సంబంధించి ధార్వాడ సీబీఐ ప్రత్యేక కోర్టు ఏడుగురికి ఏడాది జైలుతో పాటు రూ. 1.60 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ఆ బ్యాంక్ మేనేజర్ బీవీ నర్వేకర్, పూనం ట్రేడింగ్ కంపెనీ డైరెక్టర్ ఆనంద్ శేషు ఆ కంపెనీ ఉద్యోగి ఎస్.ఆదినారాయణతో పాటు దేవరాజు, హేమలత దంపతుల శిక్షకు గురైన వారు. వీరు 2001లో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బీవీ నార్వేకర్, డిజోయ్ చేతన్, పునాల చేతన్ తదితరులు పూనం ట్రేడింగ్ కంపెనీ పేరుతో బెంగళూరులో దుస్తుల వ్యాపారం కోసం రూ.75 లక్షల రుణం తీసుకున్నారు. అయితే ఎటువంటి వ్యాపారం చేయకుండా మోసం చేశారు. ఆ కంపెనీ సీఏ ఆదినారాయణ, డైరెక్టర్ ఆనంద్ తప్పుడు పత్రాలు బ్యాంకుకు సమర్పించారు. ఈ రుణానికి బెంగళూరు నివాసులైన దేవరాజ్, హేమలత ఇచ్చిన ల్యాండ్ రికార్డులు నకిలీవిగా తేలుస్తూ సీబీఐ చార్జ్‌షీట్ వేసింది. కీలక నిందితులైన డిజోయి చేతన్, పునాల చేతన్ జాంబియా దేశానికి పరారయ్యారు. వీరిపై లుకౌట్ నోటీసులు ఇచ్చారు. ఆ మేరకు డిజోయి చేతన్, పునాల చేతన్ దంపతులు నేరం చేసి విదేశాలకు పారిపోయినందున ధార్వాడ ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి సుబ్రమణ్య 23 ఏళ్ల తరువాత తీర్పు వెలువరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నగరంలోని విద్యానగర కళాశాల వెనుక భాగంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాగలకోట జిల్లా జమకండి తాలూకా గోటెగ్రామకు చెందిన రాజు పాటిల్‌గా గుర్తించారు.

కుడితినిలో తాగునీటి ఎద్దడి

కంప్లి: కుడితిని పట్టణంలో 20 రోజులుగా తాగునీటి సమస్యతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ పంచాయతీ అధికారులు తాగునీటి సమస్య నివారణకు కృషి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. 5, 6 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు హాలప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన అధ్యక్షురాలిగా పుష్పలత

కంప్లి: కొట్టూరు తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారుల క్షేమాభివృద్ధి సంఘం నూతన అధ్యక్షురాలిగా పుష్పలతను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులు కే.మరుతేష్, కోశాధికారిగా హెచ్‌ఎం గంగాధర స్వామిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో పీడీఓలు మాట్లాడుతూ..తమ గళం వినిపించేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయడం శ్లాఘనీయమన్నారు.

కుక్కకాటుతో బాలుడు మృతి

సాక్షి,బళ్లారి: కుక్కకాటుతో పదేళ్ల చిన్నారి మృతి చెందిన హృదయ విదారక ఘటన చిత్రదుర్గం జిల్లాలో చోటు చేసుకుంది. 15 రోజులు క్రితం చిత్రదుర్గం జిల్లా మదేహళ్లి గ్రామానికి చెందిన తరుణ్ (10) కుక్క కరవడంతో వెంటనే బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక ఆదివారం మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో కుక్కలు సంతతి పెరిగిపోవడంతో జనం రోడ్ల మీద తిరిగేందుకు భయందోళన చెందుతున్నారు.

స్వచ్ఛతను కాపాడుకోవాలి



కంప్లి: మనం నివసించే ప్రదేశాలతో పాటు చుట్టుపక్కల కూడా స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్.ఫగీందర్ తెలిపారు. ఆదివారం సమీప కొత్త దరోజి గ్రామంలో ఆరోగ్య ఆయుష్, క్షేమాభివృద్ధి ఆధ్వర్యంలో స్వచ్ఛతా ఆందోళన యోగ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే యోగా చేయాలని, తాజా కూరగాయలను ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ శాఖ మందుల పంపిణీదారులు గంగాధర ఎస్.హొన్నూరమ్మ, రత్నమ్మ, విద్యార్థులు గీతా, సంజన, ఐసు, అను, జ్యోతి, ఈరమ్మ, దీమ్మమ్మ, సౌమ్య, జ్యోతి స్వప్నజ్యోతి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక వెతలు

కంప్లి: తోరణగల్లు సమీపంలోని బళ్లారి విద్యుత్ ఉత్పాదన కేంద్రం ఆవరణలో ఉన్న అగ్నిమాపక శాఖలో41 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ. 12 వేల జీతం, కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు



బళ్లారి అర్బన్: వాహనాలు నడిపే డ్రైవర్లు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. పోలీస్ శాఖ, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తం ఆధ్వర్యంలో బళ్లారి డ్రైవర్లకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక డీఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే సురక్ష ప్రయాణం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్లు, ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపకూడదన్నారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లకు కంటి పరీక్షలు, చెవి, గుండె పరీక్షలు నిర్వహించారు. సిటీ డివైఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, డీఏఆర్ డిఎస్పీ తిప్పేస్వామి, సీఐ ఐయన్నగౌడ పాటిల్, రోటరీ క్లబ్ అధ్యక్షులు సురేష్, ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీప్రియా, కంటి వైద్యుడు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కోలారు జిల్లాలో అమానుషం

- విద్యార్థులతో పిట్ శుభ్రం చేయించిన మొరార్జి దేశాయి వసతి పాఠశాల సిబ్బంది
- ప్రిన్సిపాల్, వార్డెన్ సహా నలుగురిపై వేటు


హాస్టల్‌లో లెట్రిన్ పిట్‌ను శుభ్రం చేస్తున్న విద్యార్థులు


సస్పెండైన ప్రిన్సిపాల్ భారతమ్మ


ఉపాధ్యాయులు మునియప్ప, అభిషేక్


వార్డెన్ మంజునాథ్

కోలారు: కోలారు జిల్లాలో అమానుషం చోటుచేసుకుంది. చిట్టి చేతులతో లెట్రిన్ పిట్ క్లీనింగ్ చేయించిన ఘటన మాలూరు తాలూకా యలువహళ్లి మొరార్జి దేశాయి వసతి పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మేల్కొన్న జిల్లా యంత్రాంగం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్ సి మహదేవప్ప ఆదేశాలతో వసతి పాఠశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, వార్డెన్ మంజునాథ్‌తో పాటు ఉపాధ్యాయుడు మునియప్పను కలెక్టర్ అక్రం పాషా సస్పెండ్ చేయగా అతిథి ఉపాధ్యాయుడు అభిషేక్‌ను విధుల నుంచి తొలగించారు. వివరాలు... యలువహళ్లి వద్ద ఉన్న మొరార్జి దేశాయి ప్రభుత్వ వసతి పాఠశాలలో తాలూకాతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుతున్నారు. రెండు రోజుల క్రితం పిట్‌ను క్లీన్ చేయడానికి ప్రిన్సిపాల్, ఓ ఉపాధ్యాయుడు కలిసి 7 నుంచి 9వ తరగతి చదువుతున్న ఐదారుగురు విద్యార్థులను లెట్రిన్ పిట్‌లోకి దింపి శుభ్రం చేయించారు.

ఇక్కడ చదువుకోలేము :

తమతో లెట్రిన్ పిట్ శుభ్రం చేయించారని, తాము ఐదారు మంది పిల్లలు ఉన్నామని, ఇక్కడ పెట్టే హింసను భరించలేమని విద్యార్థులు తమ గోడును సోషల్ మీడియాలో వెళ్లబోసుకోవడం వైరల్‌గా మారింది. విషయం బయటకు పొక్కగానే పిల్లల రక్షణ విభాగం అధికారి నాగరత్న వసతి పాఠశాలకు వెళ్లి పరిశీలన జరిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పిల్లలనుంచి సమాచారం సేకరించారు. విషయం తెలిసి వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాఠశాల వద్దకు వెళ్లి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీసీలు ఇచ్చేయండి :

వసతి పాఠశాలలో ప్రిన్సిపాల్, వార్డెన్‌తో సహా ఎవరు ఉండరని, పాఠశాలలో హింసను తాళలేక విద్యార్థులు చాలా మంది టీసీలు తీసుకుని వేరే పాఠశాలల్లో చేరారని తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. భోజనం, టిఫిన్ సరిగా ఉండదని, టాయిలెట్ పిట్‌లోకి పిల్లలను దించినట్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాలలో లైట్‌లు ఆర్పి విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టి శిక్షలు ఇస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలను తరగతి గదిలో ఇష్టానుసారంగా కొడ తారని ఇదంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని అంటున్నారు. అంతే కాకుండా వసతి పాఠశాలలో విద్యార్థినులను కూడా వేధిస్తున్నారని, వారు దుస్తులు మార్చుకుంటున్న సమయంలో రహస్య కెమెరాలతో చిత్రీకరిస్తున్నారని దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సస్పెండ్‌కు ఆదేశం : మంత్రి మహదేవప్ప

పిల్లలను టాయిలెట్ పిట్‌లోకి దింపి శుభ్రం చేసిన ఘటనపై బెంగుళూరులో స్పందించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప ఇది అమానుష ఘటన అని, విషయం తెలిసిన వెంటనే ప్రిన్సిపల్ సెక్రెటరీ మణివణ్ణతో చర్చించానని ప్రిన్సిపాల్, వార్డెన్ సహా ఘటనకు కారణమైన వారందరిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపి దోషులను శిక్షిస్తామని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల సంత

కోలారు : నగరంలోని కారంజి కట్టలోని ఎంఇఇఎస్ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించిన పిల్లల సంత కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడిన సీనియర్ న్యాయవాది సతీష్ విద్యార్థులు విద్యతో పాటు వ్యవహార జ్ఞానాన్ని కూడా పెంచుకోవాలని, దీనికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలను చక్కగా అవలోకనం చేసుకుని క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో నివృత్త ఏఎస్ఐ రవి, ఎస్ ఫల్గుణ, మంజునాథ్ శివకుమార్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

కెజీఎఫ్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి సాధన చేయాలని భగవాన్ మహావీర్ జైన్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖాసేథీ తెలిపారు. నగరంలోని మహావీర్ జైన్ కళాశాలలో 17వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవితంలో సంపాదించిన ఆస్తి ఇతరుల పాలు కావచ్చు అయితే విద్య ఇతరులు కాజేయడానికి సాధ్యం కాదన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను కలిగి అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 340 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.

ప్రజా సమస్యలకు స్పందించాలి

శ్రీనివాసపురం: ప్రజల వద్దకు వెళ్లే ముందు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటికి స్పందించాలని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. తాలూకాలోని దళసనూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ భారత వికాస సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కౌశల్యాలు కలిగిన వారికి కేంద్ర ప్రభుత్వం తగిన శిక్షణ, రుణాలు ఇచ్చి వారు స్వయం ఉపాధి పొందే విధంగా కృషి చేస్తోందని అన్నారు. శిక్షణ సమయంలో రూ. 500 స్టయిఫండ్ కూడా అందిస్తోందని, శిక్షణ అనంతరం వానే శిక్షణకు అనుగుణంగా రూ. 15 వేల కిట్‌లను కూడా అందిస్తోందని తెలిపారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తల్లి పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తోందన్నారు. ప్రసవం అనంతరం మహిళలకు రూ. 6 వేలు కేంద్రం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీంద్ర, లీడ్ బ్యాంకు మేనేజర్ సుధీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీనివాసపురం: తాలూకాలో ఎక్కడా తాగునీటి సమస్య ఎదురు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జి కె వెంకటశివరెడ్డి అన్నారు. శనివారం తాలూకా కార్యాలయంలో నిర్వహించిన టాస్క్ ఫోర్సు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాలూకాలో వర్షాభావ పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో పశుగ్రాసం కొరత రాకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యలయం, పశువుల ఆస్పత్రికి ఎంజి రోడ్డు నుంచి నేరుగా రహదారి నిర్మించడం జరుగుతుందని కాంట్రాక్టర్‌లు త్వరగా పనులు ప్రారంభించాలని తెలిపారు. రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న శౌచాలయాల సముదాయాన్ని తొలగించి ప్రజలకు అనుకూలమయ్యే మరో చోట నిర్మించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సుధీంద్ర, తాపం ఈఓ ఎస్ శివకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కె ఎల్ జయరాం తదితరులు పాల్గొన్నారు.